UNIVERSAL
LIBRARY

కనకాభిషేకము

రచయిత:

కాకర్ల వెంకటరామనరసింహము

ఎమ్. ఎ. పిహెచ్. డి.

మూల్యము:

రు 2—0—0



కనకాభిషేకము

1 ప్రకరణము.

ఆనాడు విద్యానగర ప్రజలానందోన్మత్తులై యుండిరి. నృత్తగీత వాద్యములతోఁ బట్టణమంతయు మార్మ్రోగుచుండెను. ప్రతిగృహమును, మామిడి తోరణములతోడను, చిత్ర విచిత్రములగు పుష్పమాలలతోడను రంభాస్తంభములతోడను నలంకృతమైయుండెను. సంపన్నులు తమభవనముల ముందాణిముత్తెములతో రంగవల్లులుదిద్దినారు; మణిమయ తోరణములు గట్టినారు. మృగనాభి పంకముతోఁ గలయంపినారు. నెఱికురుల నగరు ధూపసంవాసితములుగఁ గావించు అమ్లానసౌరభోల్లసిత కుసుమదామములఁ గ్రైసేసి, తారహారములను, అనర్ఘ మణిమయ స్వర్ణాభరణములను ధరించి, ఆకసమునఁ జలింపక నిల్చిన విద్యుల్లతలోయన, నీలాశ్మస్థగిత మనోహర భవనోపరిభాగంబుల, శృంగారవతులు నిలిచి, పుర

వీధులలోని వివిధ వినోదముల నాలోకించుచుండిరి. నెఱజోడు
లైన యువజనులుకొందఱు, శరీరమునిండ రక్తచందనము
బూసికొని, ముడివైచిన జుట్టున సిందూరబూచిన గుల..
సవరించుకొని, ముంజేతఁ బువ్వులదండలు, మెడలో ము..
ముల చేరులును మఱియుఁ గాసెకోకలుకట్టిన ...
దంతపుఁబిడులుగల బాకుల చిరుమువ్వలు లేగాలికి ...
మొరయ, మత్తేభంబులగతి మందమందగమనంబు...
వీధులఁ బోవుచుండిరి. "సొగసుకాఁడా! రాజసభకేగుచు
గూర్చువిన్నాణములేని యీ కుసుమదామమును ధరించితి
వేల? రమ్మా, గేదంగిపూరేకులతోఁ గూర్చికట్టిన యీ విరజాజి
పూదండను, వలపలికేలఁ గీలొల్పు" మని, చిన్నారిచిరు
నవ్వు దొంతరల విన్నాణము చూపుచు నొకపుష్పలావికి
మనోహరాకారుఁడగు నొకపురుష పుంగవునిబలుకరింపగా
తాంబూలరాగరంజితమగు నామె కెమ్మోవి వెనుక దోబూచు
లాడు పల్వరుస తళ తళల కాంతడు ముడియుచు, నల్లకలువల
నీను నామె నిశితవీక్షణ పరంపరలచేఁ గట్టువడి యచ్చటనే
నిలిచిపోయెను.

అంతట రాచబాటనొక కోలాహలము జనించెను.
ఆనందాతిరేకమున బాలురిటునటు బరువులు వెట్టుచు, "ఉత్సవ
ముత్సవ" మని కేకలు వేయుచుండిరి. గడియలోపుగనే
మంగళతూర్య నినాదములు మిన్నుముట్ట నుత్సవము సమీ
పించెను. హయహేషలు, మదగజ ఘీంకృతులు, పోటు
బంటుల సింహనాదములు, నొక్కటై, దిగంత దంతావళ

కర్ణరంధ్ర పాటనపటిష్ఠములై యుండెను. రాకానిశాకరోదయమున నుప్పొంగు మహోదధివోలె, నానాపు పౌరజానపదుల యానందార్భటులచే విద్యానగరము ఘూర్ణిల్లుచుండెను. ఇంతలో "జై శ్రీనాథ మహాకవికిజై, జై ప్రౌఢదేవరాయ దేవేంద్రునకుజై" అను జయజయ ధ్వానములు బ్రహ్మాండ కటాహమును బ్రద్దలుచేయునట్లు బయల్వెడలెను. అంత వసంతపాథోనిధి యుప్పొంగెనా యనునట్లు, ఇసుగ వేసిన నేల రాలకుండ జన సమూహము తరలి వచ్చుచుండెను. మొదట భేరీపటహాది వాద్య విశేషములును, వాటివెనుక వారాంగనా నృత్తగీతాభినయములు, వానివెంబడి సాముగరిడీలు నమర్పఁబడియుండెను. తొలుత జనసమూహమును రక్షించుచు రక్షక భటులుండిరి. ఇరుపార్శ్వముల బారులుతీర్చిన శ్వేతాశ్వములపై శ్వేతాంబరములను, రక్తోష్ణీషములను ధరించిన కొందఱు తురుష్క సిపాయీలుండిరి. వెనుక గజబృందము, కదలు నడగొండలోయన మంద మందగమనమ్ములనేతెంచుచుండెను. తెల్లని పట్టుకుచ్చులతోఁ జేయఁబడిన తురాయిలు శిరస్సులపైఁ దూగులాడ, మణిమయములగు నాభరణ విశేషములు, క్షీరాబ్ధిఫేన సంతతిం బురిడించు తమ దేహచ్ఛవి కొకవింత సోయగమ్మును సంపాదింప, కెంపులును గరుడపచ్చలును దాపిన స్వర్ణపట్టములు, లేఁదొండతాకునఁదళతళల నీనుచుండ, నయ్యాజానేయములు, చూపఱులకు నేత్రోత్సవము గావించుచుండెను. ముత్తియముల పేరులు వ్రేలాడు బంగరుటంబారీలు, నొడలెల్ల రత్నకంబళులు

నొప్పార మత్తగజములు, మనోజ్ఞ దర్శనములై యుండెను. ఆ గజబృందముమధ్య, గిరిశాట్టహాస ధవళంబగు మదగజ మొంపుగానవచ్చుచుండెను. దాని మూపుపైన నర్ఘమణి గణాలంకృతమును హైమమును నగు నంబారియుండెను. దానిపై శ్రీనాథ మహాకవి యధివసించియుండెను. దివ్యతేజస్సంపన్నుం డగు నమ్మహాకవి మేరుగిరిశృంగముపై నధివసించిన మహేంద్రుని భంగి, చూపరులకుఁ గనువిందొనరించుచుండెను. బంగరు జలతారుచే మిలమిలలాడు రత్నాంబరమును ధరించి, నొసటభస్మ త్రిపుండ్రములఁదాల్చి, సొగసుగాజార్చి ముడి వేసిన కొప్పున సిగపూవుగైసేసి, మెడలో స్ఫటిక రుద్రాక్షములు మెరయుచుండ నరుణాధరముపైఁ జిరునవ్వు దోబూచు లాడుచుండ, శాంత శృంగారము లేక మూర్తిధరించినవో యననొప్పు శ్రీనాథమహాకవినిజూచి, యాపౌరులు తమనేత్ర సాఫల్యము నందిరి. అమ్మహాకవి కిరువంకలనిల్చి యిర్వు రిం దీవరాక్షులు వింజామరములఁ బట్టి వీచుచుండిరి.

మధ్యమధ్య వారాంగనా నృత్యమునకై యా జన సమూహము నిలుచుచుండెను. అప్పుడు భేరీపటహాది వాద్య విశేషములును నిలిచిపోవుచుండెను. మెఱుపుతీగెలవంటి యొయ్యారులు, తమకళాకౌశలముచే నందలి రసికజనుల హృదయముల కమందానందమును గల్పించుచుండిరి. బెళుకు చూపులచేతను, ఆకుంచిత భ్రూలతావిన్యాసములచేతను, నూపురఘళంఘుళారవములచేతను, ఆశృంగారవతులు, విట జన హృదయములు నాకర్షించుచుండిరి.

మంద మందగమనముల నుత్సవము రాచనగరు సమీపించెను. సింహద్వారముకడనే, వంది బృందములు జైవారములు సేయుచుండ, నిందీవరంబులనేలు కన్నులతోడి శరదిందు ముఖులు కొందరు వింజామరముల వీచుచుండ మంత్రి సామంతపురోహితాదులతో సుఖోపవిష్టుడై యున్న ఱేడు, నిజాసనమునువీడి; యెదురేగి, మహాకవికిఁగై దండ యొసంగి, పట్టపేన్గుపైనుండి క్రిందకుదించెను అంతట మెఱపు మెఱసినట్లొక జవ్వని, పసుపు నిగ్గులుదేరు పసిడిపళ్ళెరమున నమ్మహాకవికి కర్పూరనీరాంజనమిచ్చి, నొసటఁ గుంకుమబొట్టు పెట్టి, సురభిత కుసుమదామముల మెడలోవైచి, యొయ్యారపు నడలతో వెనుకకో సరివిపోయెను. అనంతరము రాజును, కవిరాజును, మెలమెల్లగనడచుచు ముత్యాలశాలను సమీపించిరి. వారివెనుక సచివ సామంత దండనాధులు పోవుచుండిరి. వారివెంబడి మథ్యమాన మహార్ణవమువోలె ఘూర్ణిల్లుచున్న జనసమూహము చనుచుండెను. ముత్యాలశాల సమీపించినంతనే వందిమాగధులు, "జయకర్ణాటక్షమామండలాఖండలా! జయగండరగండ! జయప్రౌఢరాయ క్షితీంద్ర! జయ! విజయీభవ!" అను జయజయధ్వానములగావించిరి. అంతట, "జయబ్రాహ్మీదత్తవరప్రసాద! జయ! ఈశ్వరార్చన కళాశీల! జయ! బ్రహ్మాండాది మహాపురాణచయ తాత్పర్యార్థ నిర్ధారిత బ్రహ్మజ్ఞాన కళానిధాన! జయ! జయ! విజయీభవ!" అను జయ జయ ధ్వానములు మిన్నుముట్టెను. అంతట ప్రౌఢరాయ దేవేంద్రుడు, తనసింహపీఠిపైఁ గవితా సామ్రాజ్య పట్టాభిషిక్తు

శ్రీనాథకవిసార్వభౌము నాసీను గావించి, యాతని పార్శ్వము ననే తానును సుఖోపవిష్టుఁడ గయ్యెను. సభాభవన మంతయుఁ బురజనులచేఁ గిక్కిరిసియుండెను. అంతట మహామంత్రిలేచి యిట్లుపన్యసించెను. "జగత్ప్రసిద్ధులగు శ్రీనాథ కవీంద్రులు మనరాజ్యమునకువచ్చి దర్శనమిచ్చుటచే మనజన్మములు ధన్యములైనవి. ఉద్భటమీాద ప్రౌఢిమెఱయు, డిండిమ భట్టారకుల జయించుటయే, వీరి యసమాన శాస్త్రపరిజ్ఞానము నతిమానుష ప్రజ్ఞావిశేషమును వేనోళ్ళ నుగ్గడించుచున్నది. పుంభావ సరస్వతులును, కవితాసామ్రాజ్య పట్టాభిషిక్తులు నగు నిమ్మహాకవులకుఁ గనకాభిషేకముఁగావించి, కవిసార్వభౌమ బిరుదము నొసంగుటకు శ్రీ శ్రీ శ్రీ ప్రౌఢదేవరాయ క్షితీంద్రులు సంకల్పించియున్నారు. సభ్యులందరు నీ సత్కార్యము నామోదింతురనియే నానమ్మకము"— ఈ మాటలు ముగియకముందే సభాభవనమంతయు, జయజయారవముతో మారుమ్రోగెను. మహామాత్యులచే సన్నచే నాకోలాహాల మంతయుఁ దృటిలోనంతరించెను.

అంతట, మిలమిల మెఱయు దీనారటంకములతో నిండిన బంగరు పళ్ళెరములు కేలఁగీలించి, నృత్తగీతాభినయములతో నప్సరసలఁబోలు విలాసవతులు, విద్యుద్వల్లులఁ బోలె నాసభాభవనమును బ్రవేశించిరి. అనంతరమొక్కొక్క యొయ్యారి రాయలదరికేగి యొకించుక దూరమున నిల్చి యభినయముతో బంగరు పళ్ళెరమునందీయ, నద్దాని నాభూనాథుఁడు గ్రహించిలేచి, సింహాపీఠి సుఖోపవిష్టుఁడై

యున్న శ్రీనాథు భూసుర మంగళాశీర్వాద పూర్వకముగ నభిషేకించెను. ఒక చారుహాసిని మహాకవికిఁ జందనములదెను; ఒక పూబోడి చారుచాంపేయ మల్లికా కుసుమదామము నొయారముగఁ గవిసార్వభౌముల మెడలోవైచెను. ఒక వికచార విందనయన నీరాజనమిచ్చుచుఁ దళుకుంగన్నులబిసాళి చూపుల నాశృంగారమూర్తిని దనివారజూచి, యానందించెను అనంత రము శ్రీనాథకవిసార్వభౌముఁడు లేచి యిట్లుపన్యసించెను.

"రాజ దేవేంద్రా! ప్రౌఢరాయ క్షితీంద్రా!

"పంపావిరూపాక్ష బహుజటాజూటికా
రగ్వధ ప్రసవ సౌరభ్యములకుఁ
గలశాపురప్రాంత కదళీవనాంతర
ద్రాక్షాలతా ఫల స్తబకములకుఁ
గర్ణాటకామినీ కర్ణహాటక రత్న
తాటంకయుగధాళ ధళ్యములకు
దుంగభద్రాసముత్తుంగ వీచీఘటా
గంభీర ఘుమఘుమా రంభములకు

నిర్నిబంధ నిబంధమై నెనయు కవితఁ
దెనుఁగునను సంస్కృతంబునఁ బలుకనేర్చు
కలికులోత్తంసు శ్రీనాథ కవివరేణ్యు
మెప్పుగాంచితి జగము మేల్మేలనంగ"

మరియుఁ గర్ణాటమేదినీభార ధరణ దక్ష దక్షిణ భుజాభుజంగ! రాయవేశ్యాభుజంగ! గండర గండాంక! సంగ్రామనిశ్శంక!

"గగన కల్లోలినీ కల్లోల మాలికా
పాలీసకములతో నవఘళించి
చరమ సంధ్యాకాల సంఫుల్ల మల్లికా
స్త్ర బకపంక్తులతోడ సరసమాడి,
శరదాగమారంభ సంపూర్ణ పూర్ణిమా
విమల చంద్రికలతో వియ్యమంది,
బిసరుహాసన వధూపృథుప యోధరభార
హారవల్లరులతో నసగి పెనగి
"వెలయు నాచంద్రతారార్క విలసనమున
దశదిశాక్రాంత మహనీయ తావకీన
కీర్తి, దివ్యోజ్వల స్ఫురన్మూర్తి తోడ
లక్షణోపేంద్ర! ప్రౌఢరాయక్షితీంద్ర!"

అనంతరము, తనముంజేతి సింహతలాటముల కనకురుమణి గణదీధితులు, రాయల సౌవర్ణపట్టస్థగిత మాణిక్యకాంతులు, నొండొంటి నొరసియాడ, వాగ్దేవతావల్లకీ దండంబునానొప్పు తన దక్షిణ హస్తంబెత్తి, హరితాక్షుగలనా రాజదేవేంద్రు నాశీర్వదించెను. అంతట కవిసార్వభౌమ, కర్ణాట సార్వభౌమ ప్రశంసాపూర్వక జయజయ ధ్వానములతోడను, నృత్తగీత వాద్యములతోడను, సభ ముగిసెను.

—: రెండవ ప్రకరణము :—

కనకాభిషేకము గడిచిన తరువాత నొకటి రెండు వారములుగడిచిపోయినవి. ఒకనాటి సాయంతన సమయమున, తుంగభద్రానదీతీరమున నిరువురు పురుషు లాసీనులై యుండిరి.

ఇరువురు నించుమించుగా సమవయస్కులు; ఇరువురును స్ఫురద్రూపులు; ఇరువురు నమూల్య వస్త్రాలంకృతులు; అందొకడు చామనచాయమేనివాడు. ఒకడు కుందనపుబసిండి నిగనిగలుగల దేహచ్ఛాయగలవాడు. ఇరువురి ముఖముల యందు నించుక దైన్యచ్ఛాయయు, నించుక రోషారుణ రేఖయుఁ గోచరించుచుండెను. ఎద్దియో ప్రతీకారవాంఛ, ఎద్దియో అవమానజనిత రోషానలము. వారి హృదయముల దహించివేయుచున్నట్లు, ఎడనెడ వారు నిగుడ్చు నిట్టూర్పుల వలనఁ దెలియుచుండెను. అందుఁ జామనచాయమేనివాఁడిట్లు మాటలాడ నుపక్రమించెను.

"రాజనాథా! మీ నాయనగారిప్పుడేమి చేయు చున్నారు?"

"ఇప్పుడు వారీయూర లేరు; ఈ యూరికి కొలది దూర మున నున్న తమ బృందావన భవనమున నివసించు చున్నారు."

"ఏమి! చెప్పినావు కావు! డిండిమభట్టారకుఁడీ యూర నే లేఁడా? అవును: మానముగలమానిసి యెవ్వఁడట్టి తిరస్కార మును సహింపగలడు?"

వీరన్నా! నీవు పొరపడుచున్నావు. మానాయనగారి, ముఖమున నవమాన జనిత ఖేదలేశమును గానరాదు. ఉపరి యీవిషయమునఁ దమయానందమునే వెలువరించినారు."

" ఏ విషయమున ? "

"కనకాభిషేక విషయమున "

"ఏమి? ఇంతగానున్నదే? మఱిపట్టణము నేల విడిచి పోయిరి?"

"వీరన్నా! నీవు నాయనగారి ప్రకృతిని బాగుగా నెఱుగవు. అందులకే యిట్లు మాటాడుచున్నావు. ఆయన శాంత సద్గుణమూర్తి. తాను వాదమున నోడిన మరునాడు, వారే స్వయముగ శ్రీనాథుని మాయింటికాహ్వానించి విందు చేసినారు. ఆ దినమున నాతో "రాజనాథ్! ఏల దీనవదనుండవై యున్నావు. వాగ్దేవతయెందున్నను, నుపాశ్యయే కదా! నేడు శ్రీనాథునిరసనపై నామె తాండవించుచున్నది. ఆధేయమునుబట్టి యాధారమును, మనకుం బూజ్యమే. ఇంతకును జయాపజయములు దైవాధీనములు. క్షణికములగు వీనికై భ్రమ ప్రమాదములకు లోనుగాకు" మని పలికినారు. ఇంక పురమును వీడిపోవుటకుం గారణమాయనయే యిట్లు చెప్పినారు. "నేననిన నపరిమితమగు ప్రేమగలవారనేకు లున్నతోద్యోగు లీపట్టణమునంగలరు. ఱేడును నాయెడ గురుభావముగలవాఁడే. ఇప్పట్టున నేనిచ్చటనుండుట వారి యుత్సాహమునకు భంజకముగానుండును. అర్హ సన్మానమును నూనలేరు.; అభిమానములం ద్రెంచుకోనంజాలరు. ఇట్టి విషమ సమస్యవారికిం గలుగకుండం గొలదికాలమునే నూరు విడిచి, బృందావన భవనమున వసింతును"

"మఱి శ్రీనాథుడు విందారగింప నేతెంచెనా"

"ఆఁ! వచ్చినారు. శ్రీనాథభట్టారకులు నిగర్వచూడామణులు. ఆయన మహాపండితుండు; మహాకవి; మహా

భక్తుఁడు. ఇంచుక శివప్రీతికలవాఁడు. కాని, ఉద్ధతులయెడ నుద్ధతుఁడు; నమ్రులయెడ నమ్రుఁడు. పూజ్య పూజా వ్యతిక్రమమును సహింపఁజాలఁడు. మానాయనగారితో నాయన సల్పిన వినోదగోష్ఠి మధురాతి మధురము. ఆయనవాక్కులలో సమ్మృతము వర్షించును; ఆయన చిఱునవ్వులలో సమరద్రుమసుమజాలములు చిందులుద్రొక్కును.

(కోపముతో) "చాలు నీయుపన్యాసము. పులికడుపున నక్కపుట్టినట్లు, డిండిమభట్టారకుల కడుపున నీవు పుట్టితివి. గురుదేవులకు జఱిగిన యీ తిరస్కృతి సహింపరానిది. గురుజన తిరస్కారమును సహించిన యీ జన్మ కాల్పనా. నీ తండ్రిమాట అటుండనిమ్ము. ఆయన యెంతటి పండితుఁడో, అంతటి యమాయికుఁడు. అదియునుగాక మఱొకతీరున నాయన ప్రవర్తించుటలో కారువాదజనకమగును గదా! ఈతిరస్కృతికిఁ బ్రతిక్రియ నాయన యాత్మీయులే, శిష్యవర్గమే, ఆచరింపవలయును. ఇంకనైన నీ యుపన్యాసములఁ గట్టిపెట్టి కర్తవ్య పరాయణుఁడవుగమ్ము."

"వీరన్నా! నీమాటలు నాకర్థమగుట లేదు. నన్నేమి చేయుమందువు? ఇంతకు నీ విషయము నవమానకరముగఁ బూజ్యపాదులగు మాతండ్రిగారు తలంపనే లేదుకదా! ఇంకఁ బ్రతిక్రియయనఁగా నెట్టిది? ఎందులకు?"

"అవును; గురుదేవు లీవిషయమునఁ జోక్యము చేసికొనరనుమాటయు, వారిద్దాని నవమాన కరముగ భావింపలేదనుమాటయు వాస్తవములే. అయిన నీ ప్రతీకార వాంఛ

యెందులకని యందువా? వినుము. అందే సర్వము నిమిడి యున్నది. అది మీనాయనగారెఱుఁగరు. ఈ యూరఁగల కొలదిమందికి మాత్రమే ఆతంత్రమంతయుఁ గరతలామల కము. కాని ముందొకటి రెండు ప్రశ్నలకు సమాధాన మిమ్ము? ప్రౌఢదేవరాయలు, పక్షపాతము లేకుండగనే యిందుఁ బ్రవర్తించెనందువా? ఈ వాదోపవాదముల సారా సారములఁ దూచిచెప్పఁగల పండితులీపట్టణమునఁ గలరనియే నీ యభిప్రాయమా?"

"అవునదియే నాయభిప్రాయము, ఇందు రాయ లంతటివాడు పక్షపాతము వహింపఁ గారణమేమున్నది. శ్రీనాథుండాతని కేమైన మేనమామకొడుకా? మానాయన గారు కాకపోయిరా?"

(వెడవెడనవ్వి) "అవును. నీయభిప్రాయమెట్లుండునని నేనెఱింగియే ప్రశ్నించితిని. నీ కన్నులయెదుట జఱుగు విష యములుకూడ నీవు తెలిసికొనలేవు. రాజుల దురభిమాన ములు నీకింకను బరిచితములు కావు. డిండిమభట్టారకులనిన విద్యానగర వాసులకొక దైవము. ఆయనవాక్యమే వేద వాక్యము. ఆయనయాజ్ఞ యనుల్లంఘనీయము; శిరసాధార్యము ఆయనకుగల గౌరవము రాజునకుఁ గూడ లేదు. విరూపాక్ష ప్రసాదము ముందు డిండిములకును, తరువాత రాయలకును బోవును. ఇదియంతయు సామాన్య విషయమనియే నీయభి ప్రాయమా" రాయల హృదయమున నీర్ష్యాసూయలు రగు లొల్పుటకియ్యవి చాలవా? మఱియు నీమధ్య, మహా

మంత్రులకును డిండిములకును నొక ముఖ్య విషయమున వాదోపవాదములు గడిచినవి. అందు గురుదేవుల సిద్ధాంతము రాజాభిప్రాయమునకు విరుద్ధము.

"ఏవిషయమున వాదోపవాదములు జఱిగినవి"

"అదియొక రాజకీయ విషయము. రాయలకు చిన్న భార్యపై వలపు మిక్కుటము. కావున నామెకు జనించిన విరూపాక్షునికే తనయనంతరము రాజ్యము చెందవలయునని యాయన యభిప్రాయము. మహామంత్రులుకూడ రాజ మతానుయాయులే. కాని ప్రజలకు పెద్దభార్య కుమారుడగు మల్లికార్జునుడే యిష్టుడు కావున ప్రజాభిప్రాయమును గూడ తనకనుగుణముగఁ ద్రిప్పుకొనుటకై, రాయలు డిండిమ భట్టారకుల సాహాయ్యము నపేక్షించెను. కాని డిండిములీ విషయమున మల్లికార్జున పక్షమునే యవలంభించి, రాజ్యార్హత పెద్దవానికేగాని చిన్నవానికి లేదని శాస్త్ర నిదర్శన పూర్వకముగ స్థిరీకరించిరి. అది రాయలకు రుచింపలేదని వేఱె చెప్పవలయునా? "

"నీకీ రహస్య విషయములన్నియు నెట్లు తెలిసినవి?"

"నేను కేవల దండనాథుడను మాత్రమే కాదు. రాజ సోదరుఁడగు వీర ప్రతాపునకు నేనాంతరంగికుఁడనుగదా! ఆతడే నాకీ రహస్యములఁజెప్పెను. వీని నొఱులెఱుగరాదు. నీవు మద్గురు దేవుల ప్రియపుత్త్రుఁడవు గావునను, నాకుఁ బ్రియమిత్రుఁడవుగావునను ఈ రహస్యములు నీకుం

దెలియఁ జేసితిని. ఇప్పుడైన నీసందేహము తీరినదా? రాయలకు డిండిమభట్టారకులపై క్రోధముకల్గుటకుఁ గారణము గలదందువా? లేదందువా? క్రోధాంధులును, తదనుయాయులు సత్యనిర్ణయమున నెంతటి శక్తిమంతులగుదురో నీవే యోజించుకొనుము. ”

“ అబ్బా! ఈ విషయమున నింత తంత్రమున్నదా! ప్రౌఢదేవరాయలు పయోముఖ విషకుంభమని నాయనగారికిఁ దెలియదు.”

“ అవును వారికి తెలియదు, ఇంతదనుక నీకును దెలియదు. సరికదా! ఇంక కర్తవ్య పరాయణుడవుకమ్ము. నాయుపదేశానుసారమాచరింపుము ”

“నీయుపదేశ మేమి? దానిని నేనెట్లాచరింపగలను. సార్వభౌముడేడ? నేనేడ? ”

“ ఓయివెఱ్ఱివాడా! నీకెందులకీ యాలోచనము. నీవు నిమిత్తమాత్రముగ నిలువబడుము. మీ తండ్రిగారవమాన దుఃఖమున గ్రుంగి కృశించి, మంచముపట్టి యున్నారని మాత్రము చెప్పుచుండుము. నీవుచేయవలసినదంతే. తక్కిన పనులన్నియు మేము చక్కబెట్టుకొందుము. గురుదేవుల సారస్వత సార్వభౌమత్వము వారికి దక్కవలయును; కంచుఢక్క మ్రోతలు దిశాగహ్వరములఁ బ్రతిధ్వను లీయవలయును; వంది బృందమరుణ గిరినాథ డిండిమకవి సార్వభౌముల జయ

గీతముల నెలుగెత్తి పాడవలయును; ఆనాడు మనము నిద్రింప వలయునా— ఏమందువు?

"అట్లే కానిమ్ము"

—: 3 వ ప్రకరణము :—

అది చంద్రకాంత శిలా వినిర్మిత మనోహార హార్మ్య రాజము. మధుమాస రాకానిశాకర కిరణజాలమున నయ్యది యజరామరులగు మహాకవుల కీర్తిపుంజమువోలె ధగధగ మిలమిల మెఱసిపోవుచుండెను కైలాస శైలముభంగి నచంచలమై, గిరిశాట్టహాసము కరణి నుద్ధతమై, గంగాస్రవంతి వోలె నాత్మానంద దాయకమై, నవవికసిత మల్లికా కుసుమ రాశివోలె మనోజ్ఞమై, యా ప్రాసాదరాజ మొప్పాలుచుండెను. మనోజ్ఞ ముక్తాహార శోభిత హరినీలమణిస్థగిత కుడ్యభాగములు. విద్యుద్వలాహకములువోలె నేత్రానంద దాయకములగుచుండెను. ఆభవనమును జుట్టి యొక మహో ద్యానముకలదు. అందమ్లాన సురభిళ కుసుమసంతతులచే నొప్పారు, నికుంజపుంజము లనేకములుగలవు. పల్లవిత కుసు మిత ఫలిత తరుసంతతులచే, నాయుద్యానము, నందన చైత్ర రథములఁ దిరస్కరించుచుండెను. ఆరామ దీర్ఘికావికచకల్హార మధుమత్త బంభర ఝుంకారములచేతను, జ్యోత్స్నాభ్రమితో త్థిత కీర శారికాకలస్వనముల చేతను, ఆయారామము గాన మందిరముకరణి నొప్పారుచుండెను.

క్రమ క్రమముగా, నిశాకరుడాకాశ మధ్యభాగమున

కేతెంచెను. వినీల స్వచ్ఛమగు నాయాకసమున శశాంకుండు, కాళిందీ మనోజ్ఞ తరంగడోలికలపై లీలావిహారముసల్పు రాయంచవోలె గన్పట్టుచుండెను. పిండియారబోసినట్లు, పాల వెల్లి పొంగి పొరలినట్లు, వెన్నెల విశ్వవ్యాప్తమై యుండెను. నగరమంతయు మాటుమణిగియుండెను. శాంత పావనమును ప్రసన్న గంభీరమునగు నాసమయ మనుభవైక వేద్యము; సహృదయ హృత్కవాట పాటనకళావిశిష్టము.

అట్టి సమయమున నాహర్మ్యపరిభాగమున నొక తేజో మూర్తి పద్మాసనా సీనుడై యుండెను. అతని శరీరమునం జలన మించుకంతయును లేదు. అతడు కనులఅమోడ్చెను; చూపునాసికాగ్రమునం గేంద్రీకరించెను. మకరకుండలకాంతు లాతని గండభాగమునం బ్రతిఫలించుచుండెను. విశాలఫాల భాగము భస్మత్రిపుండ్రాంకితము. సుదృఢమును, ఋజ్వాయత మునగు నాతని విశాల వక్షముపై స్ఫటిక రుద్రాక్షమాలలు గానవచ్చుచుండెను. అచంచలము నతిగంభీరమునగు నాతని తేజోమూర్తి, యోగముద్రాభి ముద్రితుండై యున్న పరమ శివుని దలపునకుం దెచ్చుచుండెను.

ఆకసమునుండి యమృతకిరణుని కాంతిపుంజమాతనిపైం బడుచు నా ప్రసన్నగంభీరమూర్తి కమర తేజమును గల్పించు చుండెను. మీద వినీల స్వచ్ఛమగు నాకసము; అందుం గాంతి నిస్తంద్రుండగు చంద్రుండు క్రింద రాజతాచలమును దలపించు ప్రాసాదరాజము; దానిపై ఖేచరీ ముద్రాభిముద్రితమైయున్న యొకభాస్వత్తేజః పుంజము. ఎంత రమణీయము? ఎంత

పావనము? అదృశ్య రామణీయకముతాగతీతము; అనుభ
వైక వేద్యము.

ఒకటి; రెండు; మూడుగంటలు గడచినవి. అంత నిరు
వురు పురుషులచ్చోటికి మెల్లమెల్లగా వచ్చిరి. వారొకరితో
నొకరుమాటాడుకొనుటలేదు. ఆయోగమూర్తి కొంకించుక
దూరమునఁ బిట్టగోడకానుకొని నిలిచియుండిరి. ఒకగడియసే
పట్లేవారుండిరి. కొంత సేపటికాతని కనుదమ్ములు విడివడినవి.
ఆకర్ణాంతమగు నా నేత్రద్వయమునుండి యమేయతేజః
పుంజము నిర్గతమగుచుండెను. ఆతఁడాగంతుకులవైపు
చూడలేదు. ఎదురుగానేయుండియు వారాతని దృష్టిపథమునఁ
బడలేదు. అంతర్లీనము నాత్మనిష్టమునగు నాతనిదృష్టి యుప్పు
డాకసమువంకఁ బ్రసరించుచుండెను. ఉండియుండి యాత
డుచ్చైస్స్వరమున, "శివ! కాశీధవ! నీలకంఠ! మదనధ్వంసీ!"
యని శివనామస్మరణముఁ గావించెను. ఆమేఘగంభీర
నిర్ఘోషమునకు— ఆ దుందుభిధ్వానమునకు ఆ ప్రాసాద
మంతయు మారొ్మ్రోగెను. అగంతుకులు మర్లేచలింపక నిలిచి
యుండి యనిమేషనయనముల నామహనీయ రూపమును
గాంచుచుండిరి. అంతఁగొంత సేపటికి మెల్లమెల్లగ నాతని
దృక్కులు వారిపైఁ బ్రసరించెను. ఆ కన్నులలోనున్న ప్రశ్న
మును వారప్పుడే గ్రహించి, "ఇప్పుడే వచ్చితి" మని సమా
ధానమొసంగిరి. అంతట నాతడు వారిలో నందమైన తెవి
సోగకన్నులును, విశాలఫాలమును, నూనూగుమీసలును,
కుందనము వంటి మేనిచాయయుఁగల యువకునితోనిట్లు

ప్రసంగింప నారంభించెను.

"దుగ్గనా! రాజ ప్రాసాదమునకుఁ బోయితివా?

"పోయితిని."

"రాజేమనినాఁడు.

"మనమీ పట్టణమును వీడుట తనకెంత మాత్రమును సమ్మతముగాదనినాడు. కవిసార్వభౌములతోఁడి యెడబాటును తాను సహింపఁజాలనని తమతో మనవిచేయుమనినాఁడు."

"నీవేమంటివి?"

"నేనేమందును? తుదకొక వత్సరమైన మీరిందుండక తప్పదని పట్టుపట్టినాఁడు. నేనందుల కంగీకరించి వచ్చితిని."

"మంచిపనియే చేసితివి; నేను చెప్పినదొకటి; నీవు చేసినదొకటి; కానిమ్మిదియు నొకందుకు మేలే" (నిట్టూర్చి) "ఈశ్వరేచ్ఛ"

"మంచి యీశ్వరేచ్ఛయే; కొండవీడువదలి యిప్పటికించుమించుగా నారునెలలు కావచ్చినది. నీవు విఘ్నేశ్వరుని వంటివాడవు. విందునకు పిలువనివారిదే పాపము. నీవు మాత్రము విందుభోజనమునకు సిద్ధము. ఇట్లే, నెలలో కావలసిన ప్రయాణ మారునెలలు పట్టినది.

"(చిరునవ్వుతో) అవునోయీ! దగ్గుబల్లివారు మిక్కిలి సుకుమారులు. కడుపునిండతినలేరు; తిని యరిగించుకొనలేరు"

"అవును. మేమట్టివారమే. కావుననే నీభోజన

ప్రియత్వమింత నిరాఘాటముగ సాగుచున్నది. ఉన్నదంతయు మేమే తినివేసిన నింక నయ్యగారి బొజ్జ వీధినిబడవలసినదే."

"ఓహో యుక్తి ప్రత్యుక్తులలో నీవింతవాడవైతివని నాకు తెలియలేదు."

"తెలియుటకు నేనేమి గౌడడిండిమభట్టు కంచుఢక్కను బగుల గొట్టించితినా"

"ఆఁ! పగులగొట్టింపకేమి? నీవును మీయక్కయుఁ దలచుకొన్నచోఁ గంచుఢక్కలొక్క లెక్కయా! వందల కొలది రాతిరోళ్ళే పగులగొట్టగలదు."

"అన్నిరోళ్ళు పగుల గొట్టుటకెన్ని విందులారగింపవలయునో; ఆహారముతోడిదేగదా బలము."

"దానికేమిలే. శరీరబలమున మీరద్వితీయులు: దీనికితోడు కొంచెము బుద్ధిబలమే యున్నచో—"

"శ్రీనాథకవిసార్వభౌములతో దేశదిమ్మరులవలె మేమూరూరఁ దిరుగము"

"సెబాస్! ఎన్నిమాటలు నేర్చితివోయి. నీవింకను పసివాడవేయనుకొనుచున్నాను. (వీపుపై మెల్లగ నిమురుచు) ఎల్లుండినుండి నైషధమారంభింతములే; కినియకు. (కొంచెము సేపాగి) దానికేమిగాని దుగ్గనా! మనభిక్షము లేదా?

"(దగ్గరనుండియే) బాబూ! ఇందేయున్నాను."

"ఓహో! ఇందేయున్నావా! క్రిందికేగితివనుకొంటిని"

"అవును బాబు! క్రిందికేగి యిప్పుడేవచ్చితిని అమ్మగారు పిలిచినారు."

"ఎందులకు ? "

" .... "

" ఏమి? మాటాడవు "

" .... "

" మా చన్ద్రేవి రాకనుగూర్చి యడిగినదా?

" .... "

" సరే! నీవు చెప్పకున్నను నేను గ్రహింపగలను. దాని కేమిలే. కర్తవ్యమాలోచింతము మాచలిద్దేవి వచ్చినదా"

"వచ్చినది. ఒకటిరెండు దినములలో రాజదర్శనము కూడ చేయునంట. రాయలయనుజ్ఞా పత్రము వచ్చినదంట. రేపు తమదర్శనమునకు వత్తునని మనవి చేయమనినది. "దిగ్విజయానంతరము, గురుదేవుల పాదపద్మముల సన్నిధి నెప్పుడు వ్రాలుదునాయని నాహృదయ భ్రమరము తహతహలాడి పోవుచున్నది" అని తనమాటలుగా మీతో మనవిచేయ నన్ను మఱి మఱి ప్రార్థించినది."

"సరే! ఆమెనొకసారి చూడవలయును"

దుగ్గన:- ఈ మాచల్దేవి యెవరు?

శ్రీనాథు:- ఆమె యొక వారాంగన. నాశిష్యురాలు. సంగీత సాహిత్యములందసమాన పాండిత్యము గలది. అనేక రాజాస్థానముల మెప్పులందినది. ఇందు నేనుంటిననివిని, యిచ్చోటికే వచ్చినది.

దుగ్గన:- (మొగము వాల్చి మెల్లగా) ఇట్టి శిష్యురాండ్రు తమ

కనేకులున్నారనుకొందును.

శ్రీనాథు:- ఆ! అవేు. ఉన్నవారిలో నీవె యగ్రగణ్య. చిన్న తనమున మనింటికి తఱచుగా వచ్చెడిది. నీవప్పటికి పసి వాడవు. కావుననే యిట్లనుచున్నావు. (చిఱునవ్వుతో) దుగ్గనా! నీయభిప్రాయము నాకు తెలియనిది కాదు. నీవును మీయనుక్క యునొక్క ధోరణిలోనే యున్నారు. మీరే యననేల? లోకులనేకులు వస్తుతత్త్వ వివేచనా శూన్యులే శ్రీనాథు నర్థముచేసికొనిన వ్యక్తి యిప్ప టికి జనింపలేదు. ఇకముందుపుట్టునను నమ్మకము నాకులేదు. రాజులతోడను, రాజ మంత్రులతోడను మిక్కిలి సన్నిహితత్వముగల నేను చిత్రమగు జీవిత మార్గము నవలంభింప వలసివచ్చినది. నాహృద యము— నాయాత్మీయత— నాగ్రంథములలోఁ దెలియును. రాజులతో నాకుగల యనుబంధము, కృత్యవతారికలలో వ్యక్తమగును.

దుగ్గన:- (తలవాల్చియే) తమచాటువులు—

శ్రీనాథు:- (ఉద్రేకముతో) నేను ప్రేమించిన నాదేశము- అందలి వివిధనాగరకతలు— నాచాటువులలోఁ జాటి చెప్పికొన్నాను. మంచియో చెడ్డయో— లోప భూయిష్ఠమువెూ లోపరహితమో— ఉన్నదున్నట్లు- చూచినది చూచినట్లు- భావించినది భావించినట్లు- చెప్పినాను. అందుఁగూడ నపార్థములఁ గల్పించువారుం దురా? ఉండని మ్మ;. నేనది గణింపను.

దుర్గ:- (పాదములపైఁబడి) బావా! నన్ను క్షమింపుము. అలోకసామాన్యమగు నీ ప్రభావమును నేను కనుఁగొనఁజాలనైతిని.

శ్రీనాథు:- (తలనిమురుచు) లెమ్ము! లెమ్ము! ఇందు క్షమించుటకేమున్నది. ద్విధాభిన్నము- అంతరంగమున నొకటి, బహిరంగముగ నింకొకటి- అగు శ్రీనాథుని జీవితమొక క్లిష్ట సమస్యయగుట యాశ్చర్య జనకము కాదు. ఒక్కొక్కప్పుడు నా జీవితము నాకే యాశ్చర్య జనకముగానుండును. నను జూచి, నాలో నేనే నవ్వుకొనుచుందును. దుర్గనా! నీ వింకను బసివాడవు. నీకు దెలియని పరమరహస్యములనేకములు గలవు. ఇట్టివి శాస్త్రజన్యజ్ఞానమువలన నలవడునవి కావు. "బహుధా విప్రతిపత్తి నీవిషయములే పాడైనశాస్త్రార్థములే" కేవలమగు ననుభవమే యింకులకుఁ బ్రమాణము. మానవుడెంతటి యున్నతుఁడో అంతటి యధముఁడు. అతని కుద్గతి యెంత సుకరమో, పతనము నంతసన్నిహితమే. మఱియుఁ బశుపక్ష్యాదులకుఁగల స్వేచ్ఛ మానవునకు లేదు. వానికి జీవిత బాధ్యతలే లేవు. సృష్ట్యాదినుండి నేటివరకును వాని జీవిత విధానమొక్క తీరుననేయున్నది. అవి పుట్టును; పెఱుగును; చచ్చును. అంతే. మానవుడో- అట్లు గాదు. వీనికి సంస్కృతియున్నది బాధ్యతయున్నది. ఉన్నది అను విషయమున విప్రతిపత్తి

నేమియును లేదు. ఎంతవఱకు? అను విషయముననే శాస్త్రములు పరస్పర సామరస్య హీనములై యున్నవి.

దుర్గన:- శాస్త్రములుకూడ ననుభవజ్ఞులైన మహర్షుల యభిప్రాయములే కదా!

శ్రీనాథు:- అవును. అందులకే వానియందు నభిప్రాయ భేదములుండుట కవకాశమేర్పడినది. ఒకరు పోయిన త్రోవనింకొకరు పోవు. అందరు ననుభవజ్ఞులే, అందరు వేద వేదాంగ పారంగతులే. ఒక్కటి మాత్రము సర్వథా సత్యమని నాయభిప్రాయము.

దుర్గన:- ఏమది?

శ్రీనాథుఁడు:- మానవుఁడు సర్వ భారములు తానే తలపై నిడికొని, సర్వమునకుఁ దానే కర్తనను నహంభావమును వహించియున్నాడు. పుణ్యపాపములు- సుఖ దుఃఖములు- వేయేల, సర్వము నీతని యధీనమనియే యీతని తలంపు. కానియనుభవజ్ఞుల నడుగుము! జీవితము యొక్క సుడిగుండములలో మునిగి తేలిన వారి నడుగుము? వారే నిజము చెప్పగలవారు. వారే సత్యస్వరూపమును ముఖాముఖి చూచినవారు. సర్వము నీశ్వరేచ్ఛ మానవ ప్రయత్నము నిమిత్త మాత్రము. ఈ రహస్యము నెఱింగి, జీర్ణించుకొని, యనుభవములోనికిఁ దెచ్చికొనినవాఁడు, మాయా

తీతుఁడు. ద్వంద్వరహితుఁడు.

దుగ్గ:- బావా! ఇట్టి తత్త్వప్రతి పాదకమగు గ్రంథమొక్క టెయు నీవు వ్రాయలేదేమి? ఎంత వ్రాసినను శృంగారమే.

భీములు:- ఆరాధ్యచరితమును వ్రాసిరికదా!

దుగ్గన:- అందు భక్త్యున్మాదముదక్క తత్త్వ ప్రతిపాదన మేమి కలదు?

శ్రీనాథు:- ఆరాధ్యచరితముమాట యటుండనిమ్ముగాని భక్తివిషయమున నొక్కమాటవినుము. భగవద్భక్తి లేని తత్త్వజ్ఞానము, నిస్సారము. తేజోహీనము. భ్రమ ప్రమాద సంకలితము. ఊహాతీతములగు విషయము లెన్నియేని కలవు. ఈ మహా విశ్వతత్త్వ రహస్య ములు, మానవబుద్ధి కతీతములు, కావున భక్తియే పరమ శరణ్యము. భక్తితోఁడిజ్ఞానము, ప్రతిభతోఁడి వ్యుత్పత్తివోలె, దోషదూషితముగాకుండును. అది యటుండనిమ్ము. ప్రస్తుత విషయము వినుము. మా చర్దేవి వారాంగనయనియు, నపరూప రూపరేఖా లావణ్యములు గలదియనియు, సంగీత సాహిత్యముల నద్వితీయ యనియు ముందే చెప్పియున్నానుగదా! ఆమె యిప్పుడిచ్చటికి వచ్చుటచే మనకొక మహత్తర కార్యము సుసాధ్యమగును. ప్రౌఢదేవరాయలు మనల ననేక విధముల సత్కరించినాఁడు సుశ్లోకుఁడు. కాని యాతని కంతశ్శత్రువులు గలరు. వారాతని యెడల

ననేకములగు కుట్రలుపన్నుచున్నారు. అవకాశము చిక్కిన నాతని ప్రాణములకే ముప్పుంగల్పింప నిశ్చయించుకొని యున్నారు. ఈ యంశముల నేనిచ్చటికి వచ్చినకొలది కాలముకే తెలిసికొంటిని. కాని యప్పుడు నేను కేవల తటస్థుండను. కాని నేడు పరిస్థితులు మారినవి. డిండిముల పరాజయము నాధారముగంజేసికొని, రాయల శత్రువులాతనిపై లేనిపోని నిందలు మోపుచున్నారు. ఆ యపప్రథ సహింపరానిది. అందు మనకును సగబాలున్నది.

దుగ్గన:- అదియెట్లు?

శ్రీనాథు:- అదియొక చిత్రగాథ. దానిసారముమాత్రమిది. కొన్ని రాజకీయ విషయములలో రాయలకును డిండిమ భట్టారకులకు నభిప్రాయ భేదముకలిగినది. అదికారణముగా రాయలకాతనిపైం గోపము కలిగినదనియుం, దన్మూలమున నే, వాదోపవాదములలో శ్రీనాథుని పక్షము నే యవలంబించి, యాతనికిం బరాభూతి కల్గునట్లు చేసెననియు నందువలన శ్రీనాథుని విజయము న్యాయసమ్మతము గాదనియుం దత్ప్రతీకారమాచరింపవలయుననియు, డిండిములపై గురుభావముగల ప్రజలలో, రాయల శత్రువులు, ప్రవాదమును బుట్టించుచున్నారు.

దుగ్గన:- ఇందు తెరవెనుక డిండిముడుకూడ కలడనుకొందును.

భీములు:- లేకేమి? ఆయనకు లేని బాధ ప్రజలకేమి? ఈనాటక

మున కంతకు సూత్రధారి యాయనయేయని నాయభి
ప్రాయము.

శ్రీనాథు:- శివ! శివ! ఆతఁడీ విషయము నెఱుఁగనే
యెఱుఁగఁడు. ఆవిషయమును నేను ఘంటాపథముగఁ
జెప్పగలను.

దుగ్గన:- అయిన నిందు మాచల్దేవి యేమిచేయగలదు?

శ్రీనాథు:- చేయఁగలిగినది చాలగలదు. ఈ పట్టణమామెకు
సుపరిచితము. అదియుఁగాక ఇట్టి రాజాస్థానము లనే
కము లామెకు సుపరిచితములు.

దుగ్గన:- రాయలీ కుతంత్రము తెలుఁగునా?

శ్రీనాథు:- ఎఱుఁగఁడు. సరికదా ఇప్పట్టున నీయఁశముల
గూర్చి చెప్పినను నమ్మడు.

దుగ్గన:- విషమపరిస్థితియే.

భీములు:- నేడు విరూపాక్షుని మ్రోల మాచల్దేవి యభిన
యించునఁట.

శ్రీనాథు:- అవునామె ప్రప్రథమున స్వామిసేవ గావింపనిదే,
మహేంద్రుని సభకుఁగూడ నేగదు.

దుగ్గన:- అంతభక్తురాలా?

శ్రీనాథు:- మఱేమనుకొంటివి? అంతేగాదు. వితరణఖని.
ఇటీవలనే తనకుఁగల సర్వస్వము, వేదవేత్తలగు
విప్రులకును, బీదలకును దానము చేసివైచినది.

మగ్గన:- అయ్యో! అట్లయిన నామె కుపాధియేమి?

శ్రీనాథు:- వెఱ్ఱివాఁడా! ఆమెకంఠమెత్తిన కనకవర్షము కురి యును. రాజాధిరాజులామెకు దాసానుదాసులు. ఇఁక మీరావలకుఁబొండు. నేను ప్రాతఃకరణీయముల నిర్వ ర్తించుకొనవలయును.

—♦ 4 వ ప్రకరణము ♦—

ఆనాఁటిరాత్రి ముత్యాలశాలలో మాచల్దేవి భరత నాట్యము గావించుననియు, నద్దానికి తాము తప్పక విచ్చేయ వలయుననియు, విద్యానగరమునగల వివిధ రాజకీయోద్యోగు లకును, సంపన్నులగు పౌరులకు నాహ్వానపత్రిక లంపఁబడినవి. ఆ దినమంతయు రాజసేవకులకు తీరుబడియే లేదు. వారిపని యంతయు ముత్యాలశాల నలంకరించుటతో నై పోయినది. ఆభవనమంతయు మణిమాలాలంకృతమైయుండెను. చిత్ర విచిత్రములగు మణి భిత్తికలతోడను, బంగరు జలతారుగల పట్టుచాందినీలతోడను, ఆప్రాసాద మలంకృతమై యుండెను. క్రింద వివిధవర్ణోపేతములగు రత్నకంబళులును, ఇరుపార్శ్వ ముల నర్హాసనములును అమర్చఁబడి యుండెను. అందుఁగొన్ని స్వర్ణమయములు ముక్తామణిమాలికాలంకృతములు, కొన్ని దంతపుఁబనిచేతగలవి. అవిగారుడుత్కీర్ణములు. కొన్ని యాసనములు రాజతములు; హరినీలాశ్మస్థగితములు. ఒక యాసనమునకును ఇంకొక యాసనమునకును మధ్య బారెడు దూరముండెను. వెనుకభాగమున జంగమ హేమపల్లులవంటి చామరగ్రాహిణులు నిలిచి, తాళవృంతములతో వీచుచుండిరి.

దూరమున చంద్రకాంత శిలావినిర్మితమగు నొకవిశాల వేదికపై చింతామణీపీఠము దలపించు సింహాపీఠిక యొండు గలదు. అది స్వర్ణమయము అనర్ఘమణిగణాలంకృతము. ఆ వితర్ది కెనిమిదిమెట్లుగలవు. అవి సువిశాలములు నున్నతాసనో పేతములునై యుండెను. రాయలకించుక క్రిందనున్న యాసనములపై మహామంత్రియుఁ బ్రధానదండనాథుఁడును ఉపవిష్టులగుదురు. తరువాతిమెట్టుపై మహాకవులుపవిష్టులగుదురు. తరువాత రాజబంధువులు, రాజకీయోద్యోగులు నర్హతలఁ బట్టి యుపవిష్టులగుదురు. ఆవితర్దివెనుకనున్న తెరలలో నతఃపురాంగనలుందురు. సభ్యులకువారు కానరారు కాని సభాకార్యక్రమమంతయు వారికిగన్పట్టును. సభలో రాయలకు కుడివైపుననున్న యాసనములపై పురప్రముఖులును, ఎడమవైపున రాజకీయోద్యోగులు నధివసింతురు.

నాటిరాత్రి ముత్యాలశాల దీపికాసహస్ర విరాజితమై కన్నులు మిరుమిట్లుగొల్పుచుండెను. అగురుధూప వాసనావాసితమై, చాంపేయమల్లికాద్యనేక సురభిళ కుసుమమాలికాలంకృతమై యాభవనము సుధర్మను దలంపునకుఁదెచ్చుచుండెను.

పన్నీటజలకమాడి, మంచిగంధము నొడలినిండబూసికొని, ముత్తియముల కూర్పుగల కుళ్ళాయిలుధరించి, చేత రోజాసుమగుచ్ఛముల విలాసముగఁద్రిప్పుచు, బంగరుజలతారుగల పట్టుపుట్టములు వలెవాటువైచుకొని కొందరు

పెద్దలరుదెంచిరి. ఎఱ్ఱనిముఖమలు బట్టపై బంగరు చమికీపని చేసిన యంగరఖాలు తొడుగుకొని, యుత్తరువులు మెయినిండ నలదుకొని, సంపెగనూనెరాసిన జుట్టునున్నగదువ్వి, రోజా సుమమ్ములదండ మణిబంధమునఁగీలించి, యమూల్యముక్తా హారములు కంఠసీమ మెఱయు విలాసముగఁ గొందరు యువ జనులేతెంచిరి. ఆనాటిపౌరుల వివిధ వేషముల నలంకారముల వర్ణింప వాగ్వధూటికైన నలవికాదు.

సాయంసమయమగుసరికి సభా భవనమంతయుఁ గిక్కిఱిసి యుండెను. కొందఱు మిత్రులతో నిష్టగోష్ఠి గావింపుచుండిరి. కొందఱు వయసుకాండ్రు తాళవృంతములు బట్టి నిలిచిన తరుణీమణుల నెఱజవ్వన పుంచికము మెచ్చు కొనుచు, తన్ముఖసౌందర్యవిలోకన తత్పరులై యుండిరి. కొందరు నవ్వుచుండిరి. కొందఱు కేరుచుండిరి. కొందఱూరక చూచుచు, దీర్ఘాలోచనము చేయువారివలె నెడనెడ కన్నులు మూయుచుండిరి. ఇట్లు సభాభవనమంతయు వివిధ భావసమ్మి శ్రితమై యుండెను.

ఇంతలో ఘంటానినాదము వినవచ్చెను. ద్వాఃస్థిత రాజభటులు విచ్చుకత్తులు పట్టుకొని స్తంభములవలె నచంచలులై నిలిచియుండిరి. అంతట వీచోపులిచ్చువారు జయశబ్దములు కులుకుచుండగ, బ్రాహ్మణాశీర్వాద పురస్సర ముగ రాజదేవేంద్రుఁడు ముందుగా సభాభవనమున కరు దెంచెను. ఆయన వెన్వెంటనే, మహామంత్రులును గవిసార్వ భౌములు నుండిరి. అనంతరము సేనాపతి దండనాయకులును,

అమాత్యవర్గమును, రాజబంధువులు నుండిరి. అందరు సుఖోప విష్టులైరి. మరల ఘంటారావము వినవచ్చెను.

పార్శ్వమునగల మార్దంగికులు, మృదంగముల వాయింపఁజొచ్చిరి. ఇంతలో క్రమ విన్యాసముగల గజ్జల మ్రోతవినవచ్చెను. సభాసదుల గుండెలలో నుత్సుకత ద్విగుణీ కృతమాయెను. చూచుచుండగనే - తళుక్కున మెఱపు మెఱసినట్లు, పదనుపట్టిన మదనునియస్త్రమొక్కటి రివ్వున నెగిరివచ్చిపడినట్లు, — మాచల్దేవి సభాభవనమును ప్రవే శించెను. ప్రవేశించినంతనే, ఆమె, నృత్యాభినయన పూర్వక ముగనే కవిసార్వభౌముల దఱికేగి, తత్పాదయుగళి తన శిరమును సోకునట్లుగ నమస్కరించెను. అనంతరము రాయ లకుమ్రొక్కి సభావందన మాచరించెను. అటుపై నభినయ మారంభమాయెను.

ఓహో! దివ్యాంగనా సౌందర్యమంతయు ముంజేభూత మైనదా? లేక, తటిల్లత లేకమై యంగనారూపమును దాల్చి నవా? లేక, యాథాయథమై, ఖండఖండమై, భిన్నవస్తుగతమై యున్న విశ్వసౌందర్యమే యేకాధారము నాశ్రయించి, లోక సమ్మోహన దీక్షాబద్ధమైనదా?

ఆమె గజ్జెలు ఘులుఘుల్లున మ్రోగినవి సభ్యుల హృద యములు ఝులుఝుల్లుమనినవి ఆమెయడుగుతీసి యడుగు వైచుచో, దేహయష్టి నిటునటువంచి కరవిన్యాసమును గావించుచో, నేయంగమున కాయంగమే మనోమోహన

జనకమైయుండెను. కొందఱామె నతృప్త నయనములఁ జూచు చుండిరి. కొందఱామె యలోక సామాన్య సౌందర్యాతి రేకమునకు దిగ్భ్రమనందిరి. కొందఱాలావణ్య ఝరీవేగ మునఁ గొట్టుకొనిపోవుచుండిరి. కొందఱు తమ్ముదామే మఱచి వివిధవికారములకు లోనగుచుండిరి. అహో! అతను సన్మోహన విద్యయంగనారూపమున నవతరించినది.

ఆమెకంఠమెత్తినది; వాగ్వధూటీవల్లకీ నిస్వనములు సభాభవనమంతయు నిండిపోయినవి; మహతిమాత్రోమ్రోగినది; కోకిలాంగన కలస్వనమున నాలపించినది. ఆయమృత మధుర హాసమున నమర ప్రసూన సౌరభము గుబాళించినది.

తొలుదొల్త నామెరాధాప్రణయము నభినయించినది. అహో! ఏనాటి బృందావనము. ఏనాటి రాధాకృష్ణుల దివ్య ప్రణయలీలలు, నేటికవి మరల విద్యానగర పౌరులు కన్ను లారఁ జూచుచున్నారు. కృష్ణుఁడు ముందున్నట్లే భావించుకొని రాధాదేవి తన్మయత్వమున నృత్యము గావించును. అనంత రము, యోగముద్రయందున్న పరమేశ్వరుని మెప్పింపఁ బరమేశ్వరి నృత్యముగావించును. ఆనాడు మాచల్దేవిలో రాధాదేవి రాసలీలావినోద తత్పరయై చూపట్టినది; పరమే శ్వరి సమాధినిష్ఠుఁడగు సర్వజ్ఞు సంతుష్టాంతరంగుఁ గావించినది.

ఆమెయొకచరణమునుబాడి యభినయించును. ఆ యభి నయ మార్గమే వేరు; ఆ యాలాపధోరణియే వేరు. ఒకొ్క్కక్క పదమునందలి భావమొకొ్క్క యంగవిన్యాసమున వ్యక్త

మగుచుండెను. పరాకాష్ఠనందిన యాభావములన్నియుఁ గ్రమ పరిణామమున రసపర్యవసాయులగుచుండెను. సభ్యులందఱు తన్మయులై తమ్మున్మరచియుండిరి. కొంతకాలమా సభాభవనమంతయు నమరవీథీ విహారముగావించెను; మందార మరంద ధారలనాని యానందించెను; అమృతలహరీ తరంగ మాలికాడోలికల నుయ్యాలలూగెను. -- వేయేల -- ఆనంద బ్రహ్మమే తానైయుండెను.

ఎంతసేపు నృత్తము జఱిగెనో యెప్పుడు సమాప్త మయ్యెనోకూడ సభ్యులెఱుగరు. ఇంతలో ఘంటానినాదము వినవచ్చెను. రసప్రపంచమునువీడి, సభ్యులు భౌతికప్రపంచ మున కాలిడిరి.

అంతట పసిడిపళ్ళెరములతో నమూల్యమణిస్థగిత స్వర్ణాభరణములను, రత్నాంబరములనుగొని, కొందఱిందు ముఖులు సభాభవనమున కేతెంచిరి. కర్పూర తాంబూల మును జేతఁగొని, మహామంత్రులులేచి, మాచలదేవి నృత్త గీత కళాకౌశలమునకు రాజదేవేంద్రులు సంతసించి, యామె కాయనర్ఘాభరణములను, బదివేల సువర్ణములను, ఆందోళికా చ్ఛత్రచామరముల ననుగ్రహించిరనియు, నామె కర్పూర తాంబూలమును గ్రహించి, సభ్యులలో నర్హులనితోచినవారి నొక్కరిని సత్కరింప వలయుననియుఁబల్కిరి. మాచలదేవియు నభినయపురస్సరముగఁ గర్పూర తాంబూలమునందికొని, కవి సార్వభౌములదరికేగి, యొయ్యారముగ నించుకవంగి, యాతని చేతిలో నాతాంబూలము నుంచెను. సభయంతయుఁ గర

ధ్వనులతో మాఱ్ఱ్మోగెను. ఆకోలాహలమును జేసన్నచే వారించి, కవిసార్వభౌములు లేచి, దుందుభిధ్వానమున నానాటి కార్యక్రమమును; నర్తన కళావిశిష్టతను బొగడి, తనకానాడు కల్గిన గౌరవము నుగ్గడించి, మాచల నాశీర్వదించి, సభ్యుల నభినందించి, రాయల రసికత నభినుతించి సుఖోపవిష్టులైరి. నాటికి సభ ముగిసెను.

♦ 5 వ ప్రకరణము. ♦

సమయము నిశీథము. బ్రహ్మాండ భాండమంతయు నంజనమలందిన ట్లుండెను. కృతఘ్నుల కొనరించు నుపకారములవోలె దృష్టులు నిష్ఫలములైయుండెను. కాలరూపుఁడగు నొక మహాదైత్యుఁడు, తన కరాళవదనగహ్వరమున నీ బ్రహ్మాండ కటాహమునంతయు, వైచుకొని, గుటుక్కున మ్రింగనుండెనా యనునట్లు, అంధకారము సర్వవ్యాప్తమై యనుక్షణ విజృంభణమునఁ బ్రాణికోటికి భయంకరమై చూపట్టుచుండెను. చదలమిలమల మెఱయు తారకాని కరము, దరిద్రుని గుణగణములవోలె జగదానంద సంధాయకము కాదయ్యెను. అంతట నిశ్శబ్దము తాండవించుచుండెను. ఎడనెడ రాజభటుల కేకలును, విటజనుల హాసప్రసంగములు నా ప్రశాంతికింగొంత హాని కల్పించుచుండెను.

అది విద్యానగరమున డిండిమభట్టారకుల ప్రాసాదము. ప్రాసాదోపరిభాగమున నొక పురుషుడిటునటు ప్రచారము గావించుచుండెను. ఆతఁడుండియుండి నిట్టూర్పులు నిగిడించు

చుండెను. ఆతని నేత్రగోళము లించుక యెఱ్ఱదనముగలిగి నిద్రలేమిని సూచింపుచుండెను. ఆతని మనసు క్రోధోద్దీప్తమై, ప్రళయకాల మహోదధిభంగి ఘూర్ణిల్లుచుండెను. ఆతని హృదయ కుహరమున నగ్ని పర్వతముల నేకములు బ్రద్దలగు చుండెను. ముఖము జేవురించెను. కొంతవడికి కొంచెము విస్పష్టముగ నాతడిట్లు పలుకజొచ్చెను "ఆహా! రాయ లెంతటి మహాపాపమున కొడిగట్టినాడు. ధర్మరక్షకులగు చక్రవర్తులే యిట్టి పాపాచరణమునకుఁ గడంగ నింక నా ర్తజనుల మొర నాలించువా రెవ్వరు? అభిప్రాయ భేదములుండిన నుండ వచ్చును. అంతమాత్రమున నిండుసభలో నాతండ్రి నవమాన పఱతురా? అయ్యో! మానాయనగా రెంతటి దీనావస్థకుఁ బాల్పడిరి. వారీవిద్యానగరమును వీడవలసివచ్చుననియు నందు నిట్టిపరిస్థితులలో వీడవలసి వచ్చుననియు నెవ్వరైన నెప్పుడైన నూహించిరా? విధి చెయ్దము లనూహ్యములుకదా! అయ్యో! నేనెంత పొరబడుచున్నాను. ఇందు విధి చేసిన దేమున్నది. ఆ యుక్తాయుక్తవివేకశూన్యుఁడు, ఆ క్రూరుఁడు, ఆపాపి, రాజ్య మదాంధకారమునఁ గన్నులుగప్పగా, నా తండ్రికింతటి యన్యాయ మొనరించెను. అవమానము పాల్జేసెను. నేనే డిండిమ భట్టారకుల తనూజుఁడ నేని, నేనే కర్తవ్యపరాయణుడ నేని, ఆనీచుని"— అనుచుండగనే యెవ్వరో 'నాయనా' అని యాతని సంబోధించినట్లయ్యెను. ఆతడులికిపడి వెనుదిరిగి చూచుసరికాతని తల్లి శారదాదేవి యందునిలిచియుండెను. ఆమెపాదములపై నాతడు వ్రాలెను. కవోష్ణములగు నాతని

కన్నీళ్ళామె పాదములపైఁబడెను. ఆమె నిలువున నీరయ్యెను. ఆమెకన్నులు నశ్రుపూర్ణములాయెను. ఆమె పుత్రుని మెల మెల్లగ లేవనెత్తి, హృదయోద్రేకము నెంతో కష్టముపై నడంచుకొని, "నాయనా! ఇట్టియర్ధరాత్రమున నేలమేలుకొని యున్నావు; ఈ ప్రశాంతపావన సమయమున నెవ్వరిని దూషించుచున్నావు. ఆత్మస్తుతియుఁ బరనిందయు మహాపాపములుగదా!" అని పలికెను.

పుత్త్రి:- అమ్మా! నాహృదయ మవమానతప్తమై యున్నది. నాయనగారికి జరిగిన యీ పరాభవమూహించుటకుఁ గూడ నాకు శక్తిలేకుండఁ బోయినది.

తల్లి:- వెఱ్ఱినాయనా! ఇందవమాన మేమున్నది. యుద్ధమునందు జయాపజయములు దైవాధీనములు కదా! ఇదియు నొకమాదిరియుద్ధమే; వాగ్యుద్ధము. ఇంతమాత్రమునకే యింత చింతింప వలయునా? ఇందు రాయలు చేసినదేమున్నది. చంద్రశేఖర క్రియాశక్తి యొడయ లట్లు సిద్ధాంతీకరించినారు. మీనాయనగారు నాతీర్పు సమంజసమేయని యంగీకరించినారు. ఆనాటి సభలో మహామంత్రు లుపన్యసింపుచు మీ నాయనగారి పాండితీగరిమ నుగ్గడించి, యంతమాత్రమున వారి కీర్తిచంద్రికలు కళంకితములుగావనియు, నట్టి వాదోపవాదముల యందలి జయము సద్యఃస్ఫురణశక్తిని వ్యక్తముచేయునేగాని, గభీర పాండిత్య గరిమను జూపఁజాలదనియు జెప్పియున్నారఁట. శ్రీనాథమహా

కవీంద్రులును మీనాయనుగారికి నమస్కరించి వాదోద్రేకమునఁ దానేమైన నవమానకరవాక్యము లాడిన క్షమింపవలయునని కోరిరఁట. నాటి సభా విశేషము లిట్లుండ నీ నవమాన మవమానమని యేల వాపోవుచున్నావో నాకుఁ దెలియుటలేదు.

"అమ్మా! నీవమాయికురాలవు. అట్టివన్నియు వట్టి నటనలు. సభా మర్యాద యట్టిది. రాజకీయముల నారితేరిన మహామంత్రులును, రాజాస్థానము లనేక ములు చూచి, వేమభూపాలురాజ్యమున విద్యాధి కారి పదవి నవక్రముగ నిర్వహించుచున్న శ్రీనాథుఁ డును అట్లు ప్రవర్తించుటలో నాశ్చర్యము లేదు. మాటలలో నేమియున్నది. చేతలలో నంతయుఁగలదు. కనకాభిషేక సంరంభములోఁ గాచుకొనక్క యొక మూలఁ బడినది."

"నాయనా! ఇట్టివి నీమనసులో నుంచుకొని, నీశక్తి రారోగ్యమును బాడుచేసికొనకుము. నీవస్వస్థతగా నున్నావని యెవ్వరో మీనాయనగారితోఁ జెప్పగా, నాయన నన్నిటకుఁ బంపినారు. వచ్చి రెండురోజులే అయినను, నామనసేలకో చేయివెట్టి కలచినట్లున్నది; మీ చెల్లెలొక్కర్తెయే యట నాయన యుపచారము లకైయున్నది. మనసు పరిపరి విధములఁబోవుచున్నది"

"అమ్మా! ఈరాత్రి నాకునేదో బెంగగానున్నది. మనసు కీడునే శంకించుచున్నది.

ఇట్లాయిరువురును సంభాషించుకొనుచుండఁగా నేదో గుఱ్ఱపుడెక్కల చప్పుడువలె వినవచ్చెను. ఇంతలో నెవ్వరో తమ్మో యుచ్చైస్స్వరమున సంబోధించుచు, దేవిడీ తలుపులు దబదబబాదుచుండుటవిని, రాజనాథుఁడు త్వరలో మేడదిగి వచ్చి తలుపులు తీసెను. వీరన్న దండనాథుఁడును, డిండిముల ప్రియశిష్యుఁడొక్కఁడు నందుగానవచ్చిరి. రాజనాథుని జూడగనే యా శిష్యుఁడు బోరున నేడువజొచ్చెను. సంగతియేమో తెలియక రాజనాథుఁడు దిగ్భ్రమఁజెందియుండెను. ఇంతలో శారదాదేవి యచ్చటికివచ్చి వీరన్ననుజూచి, "నాయనా! ఇది యేమి? మీగురుదేవులు సుఖులైయున్నారుగదా!" అని ప్రశ్నించెను. వీరన్న, ఆమె మాటలు ముగియకుండగనే గద్గదస్వరముతో, "అమ్మా! ఇంకేమున్నది. సర్వనాశనమైనది. గురుదేవులును గురుపుత్రియు నెచ్చటను గానరారైరి. ఝామురాత్రి కాకముందే శయనించిరి. ఈ శిష్యుఁడు నందే శయనించియున్నాఁడు. ఎవ్వరో దొంగలు, పడి, వారిరువురి కాలుసేతులుకట్టి, నోటగుడ్డలుఁగ్రుక్కి మంచములతోడనే యెత్తుకొనిపోయిరట. ఈతఁడరువ బోవగా నీతనికి నాశాస్తియే గావించిరఁట, నామామూలు ప్రకారము నేను గురుపాదాభివందనమాచరింప, ఁబోయి, ఈశిష్యునినోట నే యావద్వృత్తాంతమును విని సత్వరమ తమకెఱిగింప వచ్చితిని. చుట్టుప్రక్కల వెదకితిమి. ప్రయోజనము లేకపోయినది. ఇఁకఁ గర్తవ్యమేమి?" అని బుడిబుడి దుఃఖములు తీయజొచ్చెను. ఈ వాక్యములన్నియు శారదాదేవి విననేలేదు. తొలివాక్యముతోడనే

ఆమె నిలువున నీరై పోయినది.. ఆమెనోట మాటరాలేదు. కొంతసేపునకామె సర్వశక్తులను గూడఁబట్టి "ఇది యెవ్వని పనియైయుండును." అని మెల్లగఁ గంభీరముగ వీరన్నను బ్రశ్నించెను. అంతటఁదోకఁద్రొక్కిన త్రాచువోలె మండి పడుచు రాజనాథుఁడు "ఎవ్వని పనియని యడిగెదవేమి? ఎవ్వరిచే నీ కపటనాటకమంతయు నాడఁబడినదో వారిపనియే. అమ్మా! ఇప్పటికైనను నామాటల యందలి సత్యము నీకు విస్పష్టమైనదా?" అనెను. శారదాదేవి యొక్కనిట్టూర్పు పుచ్చెను.

—♦ 6 వ ప్రకరణము. ♦—

మాచదువరులకు విసువు గల్గునని తెలిసియుండియుఁ జారిత్రకములగు కొన్నియంశము లిందుమాకుఁజెప్పక తప్పినదికాదు. అది పదునేనవ శతాబ్ద మధ్యభాగము. తుంగభద్రానదీతీరమున విజయనగర సామ్రాజ్యము విజయలక్ష్మీ సనాథమై యద్వితీయవైభవమున వెలుగొందుచుండెను. ఆమహా సామ్రాజ్యము నా నాఁడు ప్రౌఢదేవరాయల వక్రపరాక్రమోపేతుఁడై పరిపాలించుచుండెను. ఈతనినే ఇమ్మడి లేక రెండవ దేవరాయలనియు నందురు. ఈతని వంశము సంగవంశము; తండ్రి రెండవ బుక్క భూపతి. ప్రౌఢదేవరాయ లమేయ ప్రతాపశాలియేకాక, స్వయముగఁ గవియుఁగవిపండిత పోషకుఁడునై యుండెను. ఈతనికాలముననే శ్రీనాథుఁడు విజయనగరమున కేగి, డింఢిమ బిరుదాంకితుఁడగు నరుణగిరి నాథు

నోడించి, ముత్యాలశాలలో దీనారటంకములఁ దీర్థమాడి నాఁడు. ప్రౌఢదేవరాయల యనంతకీర్తి ప్రతాపవైభవముల నాలించి, పారసీక క్షమాపతి తనరాయబారి నొకని నాతని యాస్థానమునకంపి యున్నాఁడు.

ప్రౌఢదేవరాయలు క్రీ॥ శ 1421 సంవత్సరమున, మహారాయ బిరుదమును ధరించి సింహాసనము నధిష్ఠించి యున్నాఁడు. సింహాసనస్థుఁడుకాక పూర్వమే, తండ్రికిఁ జేదోడు వాదోడుగనుండి, సమస్త రాజకార్యములు నను పమబుద్ధికౌశలమున నిర్వహించుచుండెడివాఁడు. చరిత్ర కారు లీతఁడిరువదియైదు సంవత్సరములు రాజ్యపాలనము గావించెనని నుడువుచున్నారు. ఈతనికిఁ దక్షిణముగా కలబరిగె బహామనీసులతానుల (ఫిరోజిషా అహమ్మదుషా, రెండవ అల్లాఉద్దీన్)తో, యుద్ధములు సంభవింపుచుండెను. ఈతఁడా విషయమున సదా అప్రమత్తుఁడైయే యుండెడివాఁడు. తన సైన్యము ననేక విధముల వృద్ధిగావించెను. ఫిరంగులు మొద లగు యంత్రసామగ్రియు సేకరించియుంచెను. ఈతనిరాజ్యము తుంగభద్రా కృష్ణవేణీ నదులుత్తరమున సరిహద్దులుగా, సింహళద్వీప పర్యంతము వ్యాపించియుండెను. తూర్పుపడమ రలకుఁ బ్రాక్పశ్చిమ సముద్రములే యెల్లలు. ఈతనికి మూడు వందల రేవుపట్టణములుండెనని ప్రసిద్ధి కలదు.

ఈతని కాలమునఁ గర్ణాట సామ్రాజ్యము చిన్నచిన్న మండలములుగా విభజింపఁబడియుండెను. ఒక్కొక్క మండ లము నొక్కొక్క దండనాథుఁ డేలుచుండెడివాఁడు. ఆరగడ,

మంగుళూరు, ముళువాయి, బారకూరు పెనుకొండ, వేలూరు, చంద్రగిరి, చంద్రగుత్తి, తెరకనాంబి, రాజగంభీరము, మధుర మొదలగునవి ఆమండలములలో నుత్తమములు. ఇందారగడ, మంగుళూరు, ముళువాయి, బారకూరు రాజ్యములు నాలుగు కలసిన నేటి మైసూరు రాజ్యమునకు సరిపోవును. కోలారు మండలమునే ముళువాయి రాజ్యమనుచుండిరి. ఇప్పటి కొచ్చిన్ మలబారు రాజ్యములు తెరకనాంబి రాజ్యమని పిలువఁబడుచుండెడివి.

బ్రహ్మోపేత క్షత్రియుండైన రాయప్ప ఒడయని కుమారుఁడు, శ్రీగిరినాథ ఒడయరు, అరగడ రాజ్యమును బరిపాలించుచుండెను. గోవచంద్రగుత్తి రాజ్యమును త్ర్యంబక దేవ, హాండేయరాయలనువారలు వరుసగా నొకరి తరువాత నొకరు పరిపాలించిరి. మంగుళూరు రాజ్యమును. నాగణ ఒడయులు, నాగమంగళం దేవరాయ ఒడయలును వరుసగా నేలియుండిరి. బారకూరు తుళువరాజ్యమును చందరస ఒడయలు, నరసింహదేవ ఒడయలును బాలించియుండిరి. దేవరాయల తమ్ములలో వీరపార్వతిరాయఁడు తెరకనాంబి రాజ్యమును, ప్రతాపదేవరాయలు వేలూరి రాజ్యమును, శ్రీగిరినాథుఁడు చంద్రగిరి రాజ్యమును బాలించుచుండిరి. ఆంధ్రభూమిలోని, ఉదయగిరి వినుకొండ రాజ్యములను వల్లభరాయ మంత్రి యేలుచుండెను. ముళువాయి రాజ్యమును సాళువ గోపరా జేలుచుండెను.

రాయలకు ముప్వురు ప్రధానులుండెడివారు. వారల

దణ్ణాయకు లనుచుండెడివారు. లక్కన సింగన పెరుమాళ్ళు వారి పేళ్ళు. వీరిలో లక్కన దణ్ణాయకుఁడు రాయలకు కుడి భుజము వంటివాఁడు. ఈతఁడే మహామంత్రి; సర్వసేనాధిపతి. సామ్రాజ్యమందంతట నీతని ప్రభావ మప్రతిహతము. ఈతఁడు కలబరిగె సులతానులపై దండెత్తి విజయలక్ష్మీ సమేతుఁడై వచ్చెను; కప్పముకట్టుట మానినందున సింహళ దేశాధీశుని శిక్షించెను. ఈతఁడు బ్రాహ్మణుఁడు.

ఇమ్మడి దేవరాయలకాలమున విజయనగర మహా సామ్రాజ్యము మహోజ్వల దశకువచ్చెను. ఈతని కాలముననే నిక్కోలో - డి - కోంటి యను ఇతాలియా వాస్తవ్యుఁడును, అబ్దుల్‌రజాక్ అను పారశీక చక్రవర్తి రాయబారియు, విజయ నగరమునకువచ్చి, యామహానగర వైభవమును జక్కగ వర్ణించియున్నారు.

విజయనగరము సప్తప్రాకార పరివృతము; శత్రుజన భయంకరము. సప్తమ ప్రాకారమునకు వెలుపల పదిగజముల వెడల్పుగల వాహ్యాళి ప్రదేశము గలదు. అందు దట్టముగా, మొనలుదేరి కఱకుగానున్న బండరాళ్ళు, నిలువులోతుగఁ బాతి పెట్టబడి యున్నవి. పట్టణములోనికిఁ బోవునపుడు ప్రప్రథమ ప్రాకారముకడ సుంకమీయవలసి యుండును. అందు వలయా కారమగు నొక గోపురముగలదు. అందప్రమత్తులై రక్షక భటు లహర్నిశము కావలికాయుచుందురు. ఏడవ ప్రాకార ములో, రాజసౌధములును గొలువుకూటములును గలవు.

ప్రథమ ద్వితీయ ప్రాకారముల మధ్యభూమియందు, వివిధో ద్యానములును, కేదారక్షేత్రములును గలవు. తృతీయ ప్రాకారము మొదలుగ సప్తమ ప్రాకార పర్యంతము, రాజ వీధి కిరుపార్శ్వముల మహాసౌధములు, నంగళ్ళును గలవు. రాయల నగరున కెదురుగ నాలుగువీధులు గలియు మొగ గలదు. ప్రతిరాజవీధి మొగను ధనురాకారమగు తోరణము న్నున్నత గోపుర మంటపములును గలవు. రాజవీధు లతివిశా లములు; రమ్యములు. వాటికిరుప్రక్కల పుష్పలాలికలు నానావిధ కుసుమముల విక్రయించు చుందురు. అందమైన మంచలపై నాసీనులై వ్యాపారులు వివిధ వస్తువులు విక్ర యించుచుందురు. రాజమార్గము గజ ఘటా శకటికా భట కోటి సంకులమై యుండును. ఒక్కొక్కవాడలో నొక్కొక విధమగు వస్తువులమ్మఁబడు చుండును. ఏ సరకులవాడలో నా వాడసరకు లేగాని, యింకొక వాడసరకులు దొరకవు. రత్న వర్తకులు, వజ్ర వైడూర్యాదుల రాసులుగబోసి విక్రయించు చుందురు. నున్నని రాతికాలువలలో సర్వదా మంచినీరు పారు చుండును.

మనోజ్ఞ స్వర్ణ తోరణా లంకృతమును, బహువర్ణ చిత్ర సమపేతమును, దారుమయ స్తంభాభిరామము నగు సభామంటపమున మహామంత్రి కొలువుదీర్చును. ఈ మంట పము రాయలసౌధమునకుఁ గుడివైపున నుండును. దానినాను కొనియే దస్తరముల కొట్టు గానవగును. రాజ్యమునకు సంబం ధించిన లిఖితములన్నియు నిందు దాచియుంతురు. కరణము

లనూర్చనిశము లిందు లెక్కలు వ్రాయుచుందురు. సభామంటప మునగల యున్నత వేదికపైఁ గూరుచుండి రాజకీయోద్యోగులు పరివేష్టించియుండ, నిరుపార్శ్వములఁ బరిచారికాజనము వింజామరలు వీవ వేత్రహస్తులు బరాబరులు చేయ, ధన్నాయకుఁడు (మహామంత్రి) కొలువుండి పౌరుల విన్నపము లాలించు చుండును. విన్నప మొనరించుకొనువారు, వేత్రహస్తుల నడుమకు నడచివచ్చి, కానుకల సమర్పించి, సాష్టాంగ దండ ప్రణామ మాచరించి, లేచి, ముకుళితహస్తులై శిరమువంచి మనవి చేసికొనవలయును. వారివిన్నప మాలించి యాయన యుచితరీతి తీర్పుచెప్పును. ఆ తీర్పునకు మార్పులేదు. ఆయనకు ఏడు రంగుల గొడుగులుండును. ఆతడు రాజదర్శనమున కేగునపుడు, ఛత్రచామరాదులగొని పరివారము ముందు నడచును. వందిమాగధులు "జయీభవ! దిగ్విజయీభవ" అని కైవారములు చేయుచుందురు ముంగిట భేరి పటహ మృదంగాది మంగళ తూర్యారావములు మార్మ్రోగు చుండును. రాజమందిరమునకును, ధన్నాయకుని సభామంటపమునకును మధ్య నేడు కక్ష్యాంతరములు గలవు. ఒక్కొక్క కక్ష్య గడచుసరి కొక్కొక్క గొడుగు ముడువఁబడును. రాజసముఖమునకు ధన్నాయకు డొంటరిగఁ బ్రవేశింపవలయును. ఆతఁడు రాజ్యమందలి సర్వ వృత్తాంతములు రాయల కెరిగించి, యాతని యాజ్ఞలఁగొని, మరలవలయును.

ధన్నాయకుని సౌధమునకు వెనుక టంకశాలయుండును. దేశమునందలి నాణెములన్నియు నిట ముద్రింతురు. అందు

మొదటిది వరహా లేక దీనారము. ఇంకు సగము విలువ గలది ప్రతాపము. ఈ ప్రతాపములు ప్రౌఢదేవరాయలచే ముద్రింపఁ బడినవి. ఈతనికి ప్రతాపదేవరాయలను బిరుదము గలదు. మూడవది పణము. వరహాకు ఇరువది పణములును, ప్రతాపమునకు పదిపణములు నిత్తురు. ఈ మూడును బంగారు నాణెములు. పణమునకు ఆరు వెండి నాణెము లిత్తురు. వీనిని 'తరము' లందురు. 'తరము'నకు జీతలను మూడు రాగి నాణెములు వచ్చును. రాయలకు రావలసిన కప్పములు సంవత్సరమున కొకమారు, ఈ టంకశాలయందు చెల్లింపఁబడును. రాయలు తన సమస్త సైనిక భటవర్గము నకు నాలుగు నెలల కొకమారు జీతమిచ్చును. జీతములకు దీనారములే ఉపయోగింతురు. పాతాళ గృహములలో ఈ ధనమంతయు గుప్తమై యుండును. వెండి బంగారములు కరగించి దిమ్మలుగాఁ బోయుదురు. రాయల సువర్ణరత్న భాండా గారము, అంతఃపుర సౌధములకును, టంకశాలకును నడుమ నున్నది.

ప్రధానమంత్రి సభామంటపమున కెదురుగా రాయల గజశాలగలదు. అందనేకములగు దంతావళములుండును. రాయలకు ముప్పది నల్లని మచ్చలుగల వెల్లయేనుగు కలదు. ప్రత్యూషః సమయమునను, ఈ వెల్లయేనుగును రాయల సమ్ముఖమునకుఁ గొంపోవుదురు. అట్లుషఃకాలమున నా మద కరీంద్రమును దర్శించుట రాయల కభ్యుదయ హేతువఁట. ఉప్పును బెల్లమును గలిపిన యన్నము, రెండేసి ముద్దలు

బరువుగల పెద్ద ముద్దలుగఁ జేసి, నేతిలోగాని పెరుగులోగాని ముంచి, రాచయేనుగుల కాహార మిత్తురు. ఆహార విషయమున నెట్టి లోపమును రాగూడదు. వచ్చినచో, రాయలు క్షమింపడు. అంతవరకు బోరుండ నా గజరాజములే వారిని శిక్షింపగలవు ఇట్టి యాహారము వాటికి రెండుపూటలిచ్చెదరు.

టంకశాలకు వెనుక వేశ్యలవాడగలదు. అనుదినము, ఈ వేశ్యలవలన రాయలకు పండ్రెండు వేల పణములు సుంకము వచ్చును. వీరపరూప రూపరేఖాలావణ్యములుగలవారు. టంకశాలకెదురుగా కటకపాలుని కొలువు కూటము కలదు. కటపాలుని యాజ్ఞానువర్తులై పండ్రెండు వేలమంది, రక్షకభటులు, నగర రక్షణము నందప్రమత్తులై యుందురు. వేశ్యలవలన వచ్చు ధనము కావలివాండ్ర జీతములకై యుపయోగింతురు. నగరమున చౌర్యాదులగు నేరములు జరుగరాదు. అట్లు జరిగినచో తత్ క్షణము, కావలివాండ్రా నేరము చేసినవానిని పట్టితెచ్చి, సొత్తును, పోగొట్టుకొన్న వానికిఁ జేర్పవలయును. వారివలన నేదైన లోపమువచ్చినచో, దానికివారు (కావలివాండ్రు) కొంతపరిహారము నిచ్చుకొన వలయును.

రాయలు సంస్కృతమున, 'మహానాటక సుధానిధి' అనునొక చంపూ గ్రంథమును రచించినాఁడు. అది శ్రీరాముని చరిత్రము. ఈతనికి 'రాయ గజగండభేరుండ' 'గజబేటకార' అను బిరుదములు గలవు. రాయలు మహాసామ్రాజ్య నిర్మాతయగు వీరుఁడే కాక, కళాపోషకుఁడగు రసికుఁడు గూడనై యుండెను.

—♦ 7 వ ప్రకరణము. ♦—

సాయంసమయ మగుచుండెను. అది వైశాఖ మగుటచేఁ జండకిరణుని వేడి కాగలేక పగలంతయు నిట్టిటో గడపిన విద్యానగర పౌరులు, వాహ్యాళికై తుంగభద్రానదీ తీరమున కేగుచుండిరి. కొందఱుద్యాన వనముల విహరించుచుండిరి. నూత్న చూత ఫలయుత తైలాభిఘారముచే వాసించు వసాత్న్య శకల భోజనము గావించి, యద్దాని కనరు వాయుటకై భోగులు, శృంగార వనసికతా తలంబుల దాచియుంచుటచే నతి శీతలములగు నారికేళాంబువుల గ్రోలుచుండిరి. ఎటఁజూచినను జలువ పందిళ్ళు లెక్కకు మిక్కుటముగా నుండెను. కామినీ కచాగ్రముల వికచ మల్లికా పాటల పుష్పదామములు మనోమోహనముగ నుండెను.

(అట్టి సమయమున) మూ చద్దేవి నివసించు ప్రాసాద రాజము అనితర సాధారణ చిత్రవిచిత్ర తోరణమాలికా లంకృతమై, యగురు ధూప సంవాసితమై యొప్పుచుండెను. ఆ భవన ప్రాంగణముననున్న యుద్యానవనమున మూచద్దేవి, తన చెలికత్తెతో సరస సల్లాపములఁ బ్రొద్దు పుచ్చుచుండెను. ఆనాటి యామె రూపవిభ్రమ విలాసము లభినీవములు: అదృష్టపూర్వములు. చందురు కావిరంగుగల యాఁగదట్టముపై, వలిపంపు జిలుగు దువ్వలు వలుధరించి, సొగసు కీల్జెడలో, లేగులాబుల పసమించు చంపక మల్లికా కుసుమ దామమును గీలొల్పినది. ఆ నాఁడామె, యెట్టి యాభరణములను ధరింప లేదు. బంగరు జలతారులుగల పట్టుపావడల ధరింపలేదు.

స్వచ్ఛజలపూరముపై మిలమిలలాడు చంద్రకాంతిపుంజము వోలె, నామె రూపలావణ్యము, జిలుగుం బయ్యెదలో నాణి ముత్తెములనై గనిగ్యము సీనుచుండెను. పరిపూర్ణ మగు నామె యంగసౌష్టవమున నా యుద్యానవనలక్ష్మి పుంజీభూతమై గన్పట్టుచుండెను. అట్లా చలువతాతిన్నెపై నాసీనయైయున్న యయ్యనంగ సామ్రాజ్య పట్టాభిషిక్త తన ప్రాణసఖియగు మందారవల్లితో నిట్లు ప్రసంగింప నారంభించెను.

మాచల:- చెలీ! నా మనసేలకో యీ దినమున నదొక లాగుననున్నది. మనకెద్దియైన కీడు మూడునేమోయని భయమగుచున్నది. ఇట్టి రాజకీయములలో నేనేలం జిక్కుకొంటిని? అవి నిరంతర భయ నిదానములుకదా!

మందా:- నేనడుగవలసిన ప్రశ్న నీవే వేసినావు. సమాధానము కూడ వినంగోరుచున్నాను.

మాచల:- రాజ సోదరుండగు ప్రతాపరాయులను నీవెఱుంగుదువు కదా!

మందా:- ఔ నెఱుంగుదును. అతని యాస్థానమునకుంగూడ మనమొకసారి పోయినాముకదా! వేలూరు.

మాచల:- ఔను. అతం డీయూర నిప్పుడున్నాండు. బహు ధనవ్యయముతోం బ్రాసాద మొండు నిర్మించుచున్నాండు. గృహప్రవేశమునాండు రాయలను గూడ నాహ్వానించునంట.

మందా:- చెలీ! నీమాటలు నాకర్థమగుటలేదు. నీ ప్రశ్న

కిదియే నా సమాధానము. అతని ప్రాసాద నిర్మాణ మా రాజకీయమగుచిక్కు.

మాచల:- కౌనదియే ఇందు పూర్వాపర సందర్భములు చాల గలవు. ఆతఁడు ప్రౌఢదేవరాయలపై కుట్రలు పన్ను చున్నాఁడు. ఆతని నాదుర్వృత్తినుండి మరలింప వలెను.

మందా:- ఆపని మనకేల? ఎవ్వరెవ్వరిపైఁ గుట్రలుపన్నినను మనకు వచ్చునదేమి? పోవునదేమి?

మాచల:- అట్లనరాదు. రాజద్రోహము నింద్యము. అది సహింపరానిది. మఱియు రాయలు, మహాపురుషుఁడు. ప్రజలకుఁ గన్నతండ్రివంటివాఁడు.

మందా:- అట్లయిన నీ వెఱిఁగిన యంశములు రాయలకుఁ దెలియఁజేయుము. ఇంక విలంబనమేల? ఇంత యాందోళనమేల?

మాచల:- చెలీ! దాపఱికమేల? నిజము చెప్పుచున్నాను వినుము. నేను ప్రతాపరాయలను ప్రేమించితిని.

మందా:- ఏమి? ప్రతాపరాయలఁ బ్రేమించితివా? అమ్మ! ఎంతదానవే! ఇంతదనుక నాకుఁ దెలియదే. నా. దగ్గరనే యింత దాపఱికమా?

మాచల:- విషయమంతయు విని యటుపై నన్ను దూరుము నేనాతని బ్రేమించినమాట వాస్తవమే కాని, నన్నా తఁడు ప్రేమించెనో లేదో తెలియదు.

మందా:- అట్లయిన వాని ప్రసంగము మన కేల? గారాజు లౌదలల ధరించు, నీ రూపసౌందర్యములోక యపాత్రునకు— ఒక యరసికున కేల త్యాగమొనర్తువు. వాని యనుభవము వాని కే కానిమ్ము. పద; రాయల కాతని దురాత్మకత నెఱిగింతము.

మాచల:- చెలీ! నీ వెప్పుడును ప్రేమింపలేదు. అందుల కే యీ విషయమున నింత చులకనగా మాట్లాడుచున్నావు. ప్రేమవిషయమున మృతతుల్యముగా నొనర్ప గలదు. దుర్గమముల సుగమములుగాఁజూపును. కంటకిత మార్గముల రాచబాటలుగా నిరూపించును. వేయేల—ప్రేమ గుడ్డిది. అందు ఔచిత్యానౌచిత్య పరిజ్ఞానమే నశించును. ప్రతాపుఁడు దుర్వృత్తి గల వాఁడని మొదటినుండియు నాకుఁ దెలియును. కాని ఏమి చేయుదును? నాహృదయము నాయధీనమున లేదు. అగ్నితప్తమైన యాజ్యమువోలె కఱగిపోయినది. సముద్రగామినియగు మహానదివోలె నాహృదయ మెన్ని యడ్డంకులు వచ్చినను ఆతనినే పొందఁగోరుచున్నది.

మందా:- అటులైన నూరకుండుము. నీవేమియుఁ జేయవలదు. ప్రతాపరాయనితో సుఖింపుము. ఆతని కుట్రలతో మన కేమిపని? రాచపుట్టువులకిట్టి వైరము లుండుట వింత గాదు.

మాచల:- చెలీ! ఇన్నినాళ్ళనుండి నాయొద్దనుండియు నా

హృదయమున కెలుకఁగాకున్నది. నేను ప్రేమించిన మాట వాస్తవమే కాని, ప్రేమకై, ధర్మమును బలి చేయఁజాలను. నా తుచ్ఛవాంఛా సంపూర్తికై కోటానుకోట్ల ప్రజలకన్న తండ్రివోలె కాపాడు రారాజునకుఁగల్గు నాపదను వారింపకుండ నుండఁ జాలను. నాప్రేమ వ్యర్థము కానిమ్ము, నేనే నశింప నిమ్ము, ప్రేమకై ధర్మధ్వంసము నంగీకరింపను.

మందా:- చెలీ! నీహృదయమేమో, నీమాటలేమో— నాకేమియు నర్థముకాలేదు. ఇప్పుడన్నమాట నిప్పుడే కాదనుచున్నావేమి? ప్రతాపరాయలఁ ప్రేమించితివి కాన నాతని కుట్రలు బయలుపెట్టలేవు. రాయఁడు మహాపురుషుఁడుగాన నాతనికిగల్గు నాపద వారింప కుండ నుండఁజాలవు. ఈ రెండు నెట్లు జతపడును. కానిమ్ము, దీనిమాటలేమిగాని ప్రతాపరాయలు కుట్ర లలోనున్నాఁడని యెట్లు గ్రహించితివి? ఆతని నెప్పటి నుండి ప్రేమించుచున్నావు?

మాచల:- ఆతని యాస్థానమునకేగి యాతనిజూచిననాఁడే యాతని బ్రేమించితిని. ఆతఁడు నన్ను బహుధా బహూకరించినాఁడు. కాని అందు ప్రేమావేశము కానరాలేదు. మరల నిక్కడనే ఆతని జూచితిని. అడఁగియున్న నాప్రేమ ప్రవాహము, వెల్లువలై పార జొచ్చినది. అదృష్టవశమున నన్నాతఁడు మఱువలేదు. నిన్న నాతఁడు మనయింటికి వచ్చినాఁడు. అప్పటికే

నీవు నిద్రించుచున్నావు. కొంతసేపిష్టగోష్ఠీ వినోదముల (బ్రొద్దుపుచ్చి, నిద్రించినాఁడు. అంతనాతని జేబులలో గుప్తములైయున్న కొన్ని లేఖలఁదీసి చదువసాగితిని. తొలుదొల్త వాటిని కేవల కౌతుకము చేతనే తీసితిని. ఒకటి చదువుసరికి నాకౌతుక మినుమడించినది—త్రిగుణీకృతమైనది. ఇంతలో రాజభవనమున ఫిరంగి ప్రేలుటయు, నగారామ్రోగుటయు, రాజభటులుచ్చైః స్వరమునఁగేకలిడుటయు సంభవించినది. నేనాతఁడు లేచునేమోయని యూహించి, తొందరగా నాలేఖల నాతని జేబులోఁబెట్టితిని. నే ననుకొనినట్లే ఆతఁడును లేచినాఁడు. లేచి మేల్కొనియున్న నన్నుజూచి, "ఏల మేల్కొనియున్నదాన"వని ప్రశ్నించినాఁడు. అప్పుడే నేనును, నగారా సవ్వడి విని లేచినానని ప్రత్యుత్తర మిచ్చినాను. దాని కాతఁడంతఁగా సంతృప్తి నందినట్లు కానరాలేదు. కాని యంతలో నేదియో స్మృతిపథమునఁబడిన వానివలె లేచి, తన లేఖలకై వెదుకుకొన సాగినాఁడు. నేను పొరపాటునఁ దొందరలో నొకచో నుంచవలసినవి యింకొకచో నుంచినాను. జేబులన్నియు వెదకి యాలేఖలుదీసి చూచుకొని, యవి తన మొలలో గుప్తము చేసికొన్నాఁడు. ఆతని ముఖలక్షణములను బట్టి యాతడు నాపై ననుమాన పడుచున్నాఁడని గ్రహించినాను.

మందా:- వానియనుమానమున కేమిగాని, యాలేఖల

యందలి విశేషముల గ్రహించితివా?

మాచల:- ఆ లేఖల నన్నిటి నామూల చూడముగ నేను జదువలేదు. కాని యాతఁడు కలబరిగె మహామ్మదు ఖానుతోఁగలిసి, రాయలపై నెవ్వియో కుట్రలు పన్నుచున్నాఁడని గ్రహించినాను.

మందా:- అబ్బా! సోదరుఁడే అన్నగారిపైఁ గుట్రలు పన్నుచున్నాఁడా. ఎంతద్రోహము. ప్రతాపరాయలన్నఁ ప్రౌఢదేవరాయలకుఁ బ్రాణము.

మాచల:- నే నీతని సాహాయ్యమున నీ నగరమునందలి కుట్రలు గ్రహింపఁగలనని యోచితినేకాని, యాతఁడే తన్నాయకుఁడని యింతకుముందెఱుగను.

మందా:- కవిసార్వభౌముల కీవిషయములు తెలియవుకదా!

మాచల:- రాజద్రోహులున్నారని మాత్రము తెలియును. వారెవ్వరో మాత్రమింకను దెలియదు. కాని వారి యూహ కసాధ్యములేదు. గ్రహించినను గ్రహించియే యుందురు.

మందా:- ప్రతాపరాయలెంతటి మోసకాఁడు. ఈ మేక వన్నె పులిని నమ్మినచో మనకుఁ జేటుతప్పదు. నీ ప్రేమ ప్రవాహము నరికట్టుకొనుము. సఖీ! దుండగీంద్ర నాయకుఁడు నీ ప్రియుఁడనుమాటను విని నేను సహింపఁజాలను.

మాచల:- దురదృష్టవంతురాలను.

మాటల సందడిలో నాయిరువురు చీకటులుద్యాన వనమంతయుఁ గ్రమ్ముకొనుటను గ్రహింపరైరి. అప్పటికప్పుడే జామురాత్రి దాటియుండును. జగమంతయు నంధకార బంధుర మాయెను. ఒకరి మోమొకరికిఁ గానవచ్చుట లేదు. అట్టితరి నా పొదల చాటున నేదో కదలినట్లయ్యెను. పామేమోయని వారు జడిసిరి. ఇంకనందుండుట ప్రమాదకరమని భావించి, యాయిరువురు లేచి గృహోన్ముఖులగు చుండిరి. ఇంతలో నెవ్వరో వారిపై హఠాత్తుగాఁబడి, నోట గుడ్డలుకుక్కి, కన్నులకు గంతలుకట్టి, కాలుసేతులు బంధించిరి. ఇదియంతయు నిముసములోఁ జరిగి పోయెను. హఠాత్సంభవమగుటచే నయ్యంగనలును నిశ్చేష్టలైరి. వారికిఁగొంత సేపువఱకుఁ దెలివిరానే లేదు.

తెలివివచ్చుసరికి వారొక బండిలో నున్నట్లు వారు తెలిసికొనిరి. కాని యాబండి తలుపులన్నియు మూయఁబడి యుండుటచే నద్దాన మార్గమిదమిత్థముగా వారు నిర్ణయింపలేక పోయిరి. ఆబండి రాజమార్గమునువీడి సందుగొందులఁబడి పోవుచుండెను. మార్గమధ్యమున నెవరైన నాబండి యెవ్వరిదని యడిగిన, నాశకట రక్షకులందున్న వారొకయున్నత రాజకీయోద్యోగి రాణివాసమనియు, నూరిబయటనున్న యుద్యానవన భవనమునకుఁ బోవుచున్నారనియు, వారికి, సమాధానము నిచ్చుచుండిరి. లోనున్న వారు

కేకలు వేయుటకుఁగూడ నవకాశము లేకుండుటచే, నీ మాటలు వారు వినుచుండియు, మూగవారివలె నుండవలసిన వారైరి. మధ్యేమార్గమునందలి యిట్టి ప్రశ్నములను బట్టియు, వీధులయందలి యులజడిని బట్టియు, విద్యానగర మధ్యముననే తాము ప్రయాణము చేయుచున్నామని యా యువిద లూహించుకొనిరి.

ఇంతలో నాబండియాగెను; బండి తలుపులు తెరచిన చప్పుడు వినవచ్చెను. కొందఱు పురుషులు లోనికి వచ్చి వారి నెత్తుకొని పోవుచుండిరి. సవ్వడినిబట్టి వారేవో మెట్లుదిగుచున్నట్లాయంగనలకు దెలియవచ్చెను. కొంతసేపటికాపురుషు లావనితల నొక కొట్టులోదించిరి. తరువాత వారి కట్లు విప్పిరి. కాని గదియంతయుఁ జీకటిగా నుండుటచేతను, నా పురుషులాపాదమస్తకము కృష్ణవస్త్ర సమాచ్ఛాదితు లగుటచేతను, వారి నవలోకించుటకా యంగనల కవకాశము లేకపోయెను. తరువాత నాపురుషులు తలుపు తాళమువైచుకొని పోయిరి. ఆ యంధకారబంధురమగు గదిలో నా స్త్రీ లిరువురు కొంతవఱకు నోటమాట లేక నిలిచియుండిరి అంతట మందారవల్లియే యిట్లుపక్రమించెను.

మందా:- ఈ యంధకారబంధురమగు కూపమున మనల నిటు త్రోయించినవారెవరు? మన మెవ్వరికి నెట్టి యప

రాధమును గావించి యుండలేదే.

మాచల:- అట్లనకుము. క్రూరున కపకారముతోఁ బనియేమి? తేలునకుఁ గుట్టుటయు, బాముకుఁ గరచుటయు నెట్లు స్వభావసిద్ధములో దుర్జనున కపకారము గావించుటయు నట్లు స్వభావసిద్ధమైన విషయమే.

మందా:- అయిననిది యెవ్వరిచేతనైన యుండును?

మాచల:- ఏమో! ఎవ్వరుచెప్పగలగు. ఎవ్వరో కుట్రదారులై యుందురు. సామాన్యపు దొండగీండ్రు మాత్రముకారు.

మందా:- అది నీవెట్లు గ్రహించితివి?

మాచల:- రథగమనమునుబట్టి యీ శకటాశ్వము లాజానేయములని నీవు గ్రహింపలేదా! అట్టివి సామాన్యపు దొంగలకుండునా? మఱియు, మార్గమధ్యమున రాజభటు లెవ్వరు మనమున్న బండి సడ్డగింపకుండుటచే నిందు రాజోద్యోగులుగూడ నున్నారనియు వారు సామాన్యులు కారనియు నాయభిప్రాయము.

మందా:- అయిన మన మిందుండి బయిలుపడుటయెట్లు?

మాచల:- అది తరువాతి విషయము. ఉపాయాంతర మేదియైనఁదోఁపక పోదు. ప్రజ్ఞా విశేషమున్నచో నెట్టి పనియైనను సానుకూలము కాఁగలదు.

మందా:- చెలీ! ఇట నెట్లు విశ్రమింపగలవు. తలక్రింది కొక్క యుపధానమైనను లేదే.

మాచల:- నీవు వట్టి బేలవు. మాచలయను నేనెవరో నీకింకను తెలియుటలేదు. నా శరీరము కాంచన పద్మనిర్మితము. కావుననే ప్రకృతి కోమలమయ్యును సారవంతమును. గురుదేవులైన శ్రీనాథ కవిసార్వభౌముల యను గ్రహముచేత, నేను సకల విద్యాపారంగత నగుటయే కాక, సుఖదుఃఖ సమభావముకూడ నైయున్నాను. హర్మ్యతలమును, హంసతూలికా తల్పమును, కారా గారమును కటికు నేలయు—నాకు సమానములే

మందా:- (నిట్టూర్చి) ఈ వేదాంతముల కేమికాని భయాకంప ముచే నాకు నిదుర రాకున్నది. నా మెడపై తలనిడి నీవు విశ్రమింపుము.

మాచల:- అట్లే కానిమ్ము.

—♦ 8 వ ప్రకరణము. ♦—

రాత్రి రెండు జాములు గడచినది. విజయనగర మంతయు మాటుమణిగియున్నది. అచ్చటచ్చట రాజభటులు వేయు జాగ్రనినాదములు తక్క- వేరొండు వినవచ్చుటలేదు. ప్రకృతియంతయుఁ బ్రశాంత గభీరము.

అట్టితరి మందారవల్లికేదో మనుష్యుల యలికిడివోలె వినవచ్చినది. ఆమె మెల్లగ మాచలదేవిని లేపి చెవిలో నా యంశమును జెప్పినది. ఆమెయుఁ గౌతుకము రెట్టింప నది యేమో తెలిసికొనవలెనని లేచినది. ఆసవ్వడి దగ్గరకే వచ్చినది. తమ ప్రక్క-నేయున్న కవాటము తెఱచినట్లు చప్పు

డెనది. అంగనల కౌతుకము మిన్ను ముట్టినది. మేనెల్ల చెవులుగ, వారాశబ్దమునే వినుచుండిరి. గోడకు చాలమీదనున్న కిటికీనుండి దీపకాంతులు ప్రసరించుచుండెను. అంతట నొక యార్తస్వనము వినవచ్చెను. అది దీనమేయయ్యు కఠోరముగ నుండెను. అది యొక శోకసంతప్తుని హృదయకుహరము నుండి వెలువడుచుండెనని మాచలదేవి నిశ్చయించినది.

“ ఓరీ మూర్ఖా! నన్నేల యిట్లు నిర్బంధించితివి. నీకు నేనెట్టి యపకారమును గావించియుండలేదే. నీకు యుక్తాయుక్త జ్ఞానము నశించినదా? పాపభీతిలేదా? ఇట్టి యకార్యకరణమువలన నీవు రాజాగ్రహమునకుం బాత్రుడవగుదువని గ్రహింపుము.”

అంతటనొక వికటాట్టహాసము; హేళనపూర్వక స్వనము.

“రాజాగ్రహము! రాజెవ్వడు? నేను నీకురాజును కానా? కొలది దినము లోపిక పట్టుము. నిండుసభలో నేను సింహాసన మధిష్ఠించినప్పుడు, కన్నులార నా వైభవమును జూచి నీవే యాశీర్వదింతువు. అప్పుడు నీ ప్రియపుత్రిక సర్వమంగళ నాయర్ధాంగియై నాకు ముదముకూర్చును.”

అంతట మొదటి కఠోరస్వనము; కోపోద్రిక్తము.

“ ఛీ మూర్ఖా! నోరుమూయుము. నా ప్రియపుత్రికను నీవు ముట్టనైన నర్హుడవా? కుక్కకు పురోడాశము లభించినప్పుడు, పంచమహాపాతకికి స్వర్గలోక సౌఖ్యములు సమకూరి

నప్పుడు, నీకు నాపుత్రి యర్ధాంగి యగును. తుచ్ఛుఁడా! నీ వింక నాతోఁ బరిసంగింపకుము. పోమ్మావలకు. నా కోపాగ్ని నిన్ను దహింపక పోదు. నీ పాపమునకుఁ బ్రాయశ్చిత్తము లేదు."

(హేళన పూర్వక స్వనము) పాపము! పిచ్చిబాపడా! పాపపుణ్యములు గణించుచు, ముందు వెనుక లాలోచించుచు, మీనమేషములు లెక్కపెట్టుచు, చేతికందిన సుందరాంగిని వీడుటకు నేనేమంత వెంగలి ననుకుంటివా? నీపై నాకుఁ గోపము లేదు. నిన్నిట్లు నిర్బంధించుటకు రెండు ముఖ్యకారణములు గలవు. సావధానుఁడవై వినుము. నీ వలనే సర్వమంగళయు నాయధీనమున నే యున్నది. కాని యామె నన్ను నిరాకరించుచున్నది. నీవామె నెట్లయిన నొప్పించి నాకు వివాహము చేయవలయును. రెండు. నన్ను రాయలు రహస్యముగ వధింపించెనని లోకమునఁ బ్రవాదముఁబుట్టించి, రాయలపైఁ బ్రజల కాగ్రహము గల్గునట్లు చేయుట. ఈ రెండును. * * *

ఈ మాటలు ముగిసీ ముగియకుండగనే మరల నా కఠోరస్వనము.

"ఓరీనీచా! నాకూతునే బంధించితివిగా? ఇంకనీకు నిష్కృతిలేదు. నాశాప మమోఘమని నీవెఱుఁగవు. ఇదిగో వినుము. నెలతిరుగకుండ నీ శరీరము శతధా భిన్నమగును. నీ రక్తమాంసములు కాక గృధ్రము లాస్వాదింపఁగలవు. బ్రహ్మవిదుఁడనగు నావాక్యమున కన్యథాత్వము లేదు. పొమ్ము."

(మరల వికటాట్టహాసము. క్రోధోద్రేక సూచితమైన పాదతాడనము)

" ఛీ మూర్ఖుఁడా! ఎన్ని విధముల బోధించినను నీకు బుద్ధి లేకున్నది. నీతనయ నీదినముననే నేను బలాత్కారముగ ననుభవించెదను. నీ శాపములు గీపములు నన్నేమిచేయునో చూచెదఁగాక. (కొంతసేపు నిశ్శబ్దము; మరల నాస్వనమే) "ఆలోచించుకొనుము. నీకు పదునేను దినములు గడువొసంగి తిని. అప్పటికి నీ తనయ నంగీకరింపఁ జేసితివా సరి. లేకున్న నీకాలుసేతులు బంధించి, నీకన్నుల యెదుటనే నీతనయ యౌవన గర్వమును రూపు మాపెదను."

అంతట మరల తలుపు మూయఁబడిన చప్పుడు విన వచ్చెను. దీపకాంతులంతరించినవి. పురుషులు వెడలిపోయిన సూచనల గ్రహించి మందారవల్లియే యిట్లుపక్రమించినది.

మందా:- చెలీ! ఆ స్వరములు రెండును మనకశ్రుత పూర్వములుగనే యున్నవే.

మాచల:- అందొకటియే మనమెఱుఁగము. రెండవది నాకు సుస్పష్టమే. ఆ వికటాట్టహాసము, ఆ హేళన పూర్వక కంఠధ్వనియుఁ బ్రతాపరాయునివి.

మందా:- ఆ మొదటిస్వర మెవ్వరిదో?

మాచల:- అదియే యోజించుచున్నాను ఆతఁడెవ్వఁడో శాపానుగ్రహ సమర్థుడగు తపస్వివలె నున్నాఁడు. ఆతని కూతురే ఆ సర్వమంగళ.

మందా:- పాపమామెయు మనవలెనే బంధింపఁబడి యున్నట్లా క్రూరుని మాటలవలన గ్రహింపగలిగితిని. చెలి!

ప్రేమించి ప్రేమించి, మంచివానినే ప్రేమించితివి. కవి సార్వభౌముల శిష్యురాలవు. నీ ప్రణయమింత యథార్థ పతితమగునని నేనెన్నడును భావింపలేదు.

మాచల:- (నిట్టూర్చి) దురదృష్టవంతురాలను.

మందా:- చెలీ! క్షమింపుము. నీ మనసు నొచ్చినట్లున్నది. ఇంక నెప్పుడు నట్టి యనాలోచిత ప్రసంగము చేయను.

మాచల:- ఇందు క్షమించుట కేమున్నది. వాస్తవ మంతే కదా! ఇట్టివానిని ప్రేమించిన నేను కవిసార్వభౌముల శిష్యురాలనని యెట్లు చెప్పికొందును? ఎట్లా మహా మహుని యెదుట నిలువగలను? మార్గాంతరము లేదు. సాధుజనపీడ, రాజద్రోహము క్షమింపరానివి. నా ప్రణయప్రవాహము నిరాశామరుపథమునఁబడి యింకి పోనిమ్ము. నా ప్రణయములత వాడి శుష్కించి, నశింప నిమ్ము. నేనీ ద్రోహచింతనమునకు, ఈ పాపకార్య ములకు దోహదము చేయఁజాలను.

మందా:- చెలీ! ఈ యుపన్యాసమేమి? ఇదియంతయు నా మీఁద కోపమా? అయ్యో! నీ మనసునకెంత నొప్పి కలిగించితిని.

మాచల:- చెలీ! నీపై నాకెట్టి కోపమును లేదు. నాపైనే నా కోపము; నను గూర్చియే నావిచారము. అది యట్లుండనిమ్ము. ఇప్పటి నామాటల యర్థము నీకిప్పుడు తెలియదు. మున్ముందు గ్రహింపగలవు.

మందా:- ఏమి గ్రహింతునో! కాని ఆ సర్వమంగళ నెందు బంధించినాఁడో! ఆమె యెవ్వతయో!

సూచల:- (కొంచెమాలోచించి) డిండిమభట్టారకులకు సర్వమంగళయను కూతురున్నట్లు నేను వినియుంటిని. ఆమె సకల విద్యా ప్రవీణయనియు, విశేషించి సుందరియనియు వినియున్నాను. ఆమెయే యీమెయేమో! డిండిమభట్టారకులు తప్ప, ప్రతాపరాయలతో నట్లు తిరస్కరించి మాటాడగలవారెవ్వరు. నిశ్చయముగ నామె డిండిమభట్టారకుల పుత్రియే.

మందా:- అయ్యో! ఈ క్రూరుఁడు డిండిమభట్టారకులఁగూడ కారాగారమున నుంచినాఁడే. ఎంతమోసము. చెలీ! వాఁడు రాజద్రోహమును దలపెట్టినట్లున్నాఁడు.

సూచల:- (నవ్వి) అందుకు సందేహమా, అది వాని మాట వలననే స్పష్టమైనది. కాని మనమిందుఁ జిక్కుపడియున్నాము. రాయలకీ విషయములు తెలియుట యెట్లు? తెలిసినను, తంతమ్ముఁడే తనపై నిట్టి కుట్రలు పన్నుచున్నాఁడను మాటను తగిన యాధారము లేక యాతఁడు విశ్వసించుట యెట్లు? అంతయు నయోమయము.

మందా:- విశ్వసింపకున్న నాతఁడే తత్ఫలమనుభవించును. మనకా జోలియేల? మొదట మనమిందుండి బయట పడిన నదియే పదివేలు.

9. వ ప్ర క ర ణ ము.

పగలు మూఁడవజాము గడచినను జండకిరణుని ప్రతాపమింకను జల్లారలేదు. అస్తంగతుఁడగువఱకు నాతఁడు జీవలోకమును బరితపింపఁ జేయవలయునని యే సంకల్పించి నట్లు కన్పట్టుచుండెను. కాని విజయనగర పరిసరారణ్య భూములయందు మాత్ర మాతని ప్రభావమంతఁగాఁ బనిచేయుట లేదు. సాంద్ర భూరుహచ్ఛాయలా తపనుని, కార్య కిరణములను కడ్డు నిల్చినవి. జంతు సంతానము లాతరుచ్ఛాయలలో హాయిగ నిద్రించుచున్నవి. విహంగ వ్రాతము తరుకోటరముల నాశ్ర యించుకొని యున్నది. ఇట్టి సాధు ప్రాణికోటి నేమియుఁ జేయ జాలని ఖరకరుఁడు ఉగ్రదీధితులచే నా వృక్షాగ్రములనే పోషింపఁ జేయుచుండెను. ఖరకర కరోగ్రతను తామే శిరసావహించి, మార్గద్రుమజాలము ప్రాణికోటి కాశ్రయమొసంగి సంర క్షించుచుండెను. ఆర్తుల రక్షించునెడ మహాత్ములెట్టి కష్ట ములనైనను లెక్కచేయరు కదా!

ఇంతలో నావన ప్రశాంతత్వమునకు భంగము గల్పించుచు, గుఱ్ఱపు డెక్కలచప్పుడు వినవచ్చెను. ఒక యాశ్వికుఁడు, వాయువేగ మనోవేగములతో నొకగుఱ్ఱము నుదాయించుకొనుచు వచ్చుచుండెను. ఆ యశ్వవేగమును బట్టిచూడ నాతఁడు సాయంసమయమునకుఁ బూర్వమే, విజయనగరమును జేర నుద్దేశించినట్లు కానవచ్చుచుండెను. కాని యాతని ప్రయత్నమునకు తరాయమంతలోఁ జూపట్టెను. ఆకసమున దృశ్యాదృశ్యమునగు నొక మేఘశకలముగానవచ్చెను.

క్షణములో నొక మహాభూతము విశ్వరూపము ధరించినట్లది విస్తరించి, చండకిరణు నాక్రమించెను. కొలదికాలములోనే ఆకసమంతయు మేఘావృతమై చిటపట చినుకులు పడజొచ్చెను. మఱొకక్షణములోఁ బ్రబల ఝంఝూ ప్రభంజనముతోడి యాసార మారంభమాయెను. భూతావేశము నొందినవానివలె నాయరణ్యములోని చెట్లులన్నియు నూగజొచ్చెను. కొన్ని ఫెళాఫెళారవములతో విరుగఁజొచ్చెను. నదులు, గుండెలవియు నట్లు, ప్రళయకాల రుద్రాట్టహాసమువోలె, నురుగు లురుల జొచ్చెను. అప్పుడప్పుడు కన్నులు మిఱుమిట్లు గొల్పుచు, మెఱుపు లాకసమున మెఱయఁజొచ్చెను. పాపము! మన యశ్వచోదకుని శ్రమయంతయు బూడిదలోఁబోసిన పన్నీరైనది. ఆతఁడేమి చేయఁగలఁడు. దైవసాహాయ్యములేని కార్యము లన్నియు నిట్లే విఫలములగుచుండును. చేయునదిలేక, తన యశ్వము నాపి యాతఁడొక వృక్షము నాశ్రయించెను. కాని విధి ప్రతికూలముగ నున్నపుడన్నియు విఫలములే యగును కదా! అంతలో నొక విద్యుద్వలాహక నిస్వనము విన నయ్యెను. కొలదిదూరమున నున్న వృక్షమున మంట లుదయించెను. ఆతని యసురు లదృష్టవశమున దక్కినవిగాని, యాతని యశ్వమా యశనిపాతమున కాహుతియయ్యెను. పాపము! మనరౌతున కాపాదమస్తకము గంపము జనించెను. ఇంక నందే యున్నఁ దనకు నాయశ్వగతియే సంభవించునని స్థిరనిశ్చయుఁ డయ్యెను. కాని యేమిచేయఁగలఁడు? ఆ ధారాసంపాతమునకు నెందుఁబోఁగలఁడు? ఇటునటుఁ జూచెను. కొంచెము ముందు

కేగెను. ఏమియుఁ గానరాలేదు. ఇంతలో ధగద్ధగాయమానముగ నొక మెఱపు మెఱసెను. ఒడలెల్లఁ గన్నులుగాఁజేసి కొని యాశ్రయాంతరము నన్వేషించుచున్న యాతని కనతి దూరమున నెద్దియో మసకమసకగాఁ గానవచ్చెను. తానున్న ప్రదేశమునుండి కొంచెము మలుపుగానేగిన నొక చెట్ల గుంపులో నొక శిథిల గృహమాతనికి దృష్టి గోచరమాయెను. మన యాశ్వికుఁడాలసింపక యటకేగెను. అదియొక పురాతనమైన కట్టడము. అదియెవ్వరు కట్టిరో యెన్నాళ్లకుఁగట్టిరోకూడ చెప్పఁజాలము. మనకుగాని మన యాశ్వికునకుగాని యిప్పుడా ప్రశ్నలతోఁబనిలేదు. ఆ కట్టడమును జూచినంతనే యాతనికి పోయిన ప్రాణములు తిరిగివచ్చెను. ఒక్క యురుకున నాతఁడా శిథిల గృహమును బ్రవేశించెను.

ఆ గృహమున నించుమించుగాఁ బది గదులు కలవు. కాని యించుమించుగా నవియన్నియు నత్యంతము శిథిలావస్థయందున్నవి. గోడలపైఁ జెట్టును జెట్టుచేమలు మొలచినవి. కాని యందు రెండు గదులు మాత్రమించుక వాసయోగ్యములుగ నున్నవి. మనయాశ్వికుఁడందొక్క గదిలోనికేగి, యిటునటు జూచి, యందెవ్వరు లేరని నిశ్చయించుకొని, తడిసిన తన యుడుపులను విప్పి, పిండి, యారవైచుకొనినాఁడు. లోనఁ దేహరక్షణార్థము తొడిగిన యినుపకవచమునుగూడ విప్పినాఁడు. ఇంతలో నాతని కేద్దియో స్మృతిపథమునఁబడగా, విప్పిన కవచమును మరల గైకొని, యందులోన గుప్తమైయున్న తోలుసంచిని బయటకుదీసి, విప్పినాడు. అందొక లేఖ భద్ర

ముగ నున్నది. అదిమరల యథాస్థానమున నుంచి, యాతఁడు ముందుకు పెద్దతోలుసంచి విప్పి, కొన్ని తెనుబంగారములు పైకితీసి నాఁడు. ఆపిదప నాదము వెన్నెలగిన్నెయందును వినానాస్వాద్యము లుగ తెచ్చి. వారిని చూచి. నీసాంతోషదుచ్చికొంపు నారాయణము సంచుక గ్రోలినాఁడు ఇప్పటికిఁతనికి కొంచెము ముత్సాహము కలిగినది. ఆధునాత్యధుల కమృత ప్రాయముకదా! నారాయణము. తడిసిన శరీరమునకుఁ గొంచెము వేఁడిపుట్టించినది. కమూరండు ముని నాతఁడు మరి కొంచెము నారాయణము గ్రోలినాఁడు. ముక్కకొంచెము—మరికొంచెము – ఇట్లు నారాయణము నతఁడు గ్రోలినాఁడు. శీఘ్రముగు నాం మద్యమును సేవించుటచే నాతనికి స్పృహా తప్పినది. పాలుచునాతఁడందే పడిపోయినాఁడు.

నాఁటిరేయియెను ఘోరముగాఁ గురిసియుండెనే యున్నది. ఆరూ మరల నవ్వుడో యిరువుఁరు మనుష్యులు తడియుచు నాయింటివైపుకే వచ్చిరి. ఇల్లు సమీపించిన వారిముఖము లానందవికసితములైనవి. వారిరువురు నాయింటి యొద్ద నిలిచి, తడిసిన యుడుపులు విడిచిపెట్టి, యొత్తడి పెట్టెలో భద్రముగనున్న పొడిబట్టలను గట్టుకొనిరి. అప్పుడు వారిలో నొకరిట్లు సంభాషణవారంభమాయెను.

దుర్గనా! బృందావన భవనమింకెను నంతదూరమా? నీకు తెలియునా? ”

"నాకేమి తెలియును. కొలది దూరమునందే యున్నదని బావగారు చెప్పినారు. చెప్పిన దాటనే నీవుబయలు దేరితివి. నీవెంట నేను బయలు దేరితిని. కాని భీముఁడా! డిండిమ భట్టారకులు కానరాని చోటునకుఁ బోయిరా? ఆయన నెవ్వరు గాని పట్టియుంచుదురు?"

"ఎవ్వరో మనకేమి తెలియును. మీ బావగారెద్దియో దీర్ఘాలోచనములో మునిగి తేలుచున్నారు. మహాకావ్యములు వ్రాయునప్పుడు గూడ నింతటి పరాకు నాకాతనిలోఁ గన్పట్టుట లేదు."

"ఏమో! అంతయు సందేహమయముగా నున్నది. ఏమైనను ఈయూరు వదలిపోయినగాని మనకీ శని వదలదు."

"అదియుఁ గొంత నిజమే. అప్పుడే చీకటి దట్టముగా నలముకొన్నది. వాన కొంచెము తగ్గుచున్నదిగాని యీ గాఢాంధకారములో మనమెందుఁబోఁగలము. నా దగ్గర చెకుముకి యున్నది. కొన్ని పుల్లలు కూడఁబెట్టుము. మంటచేయుదము. చలియైనను కాఁగవచ్చును."

ఈ సంభాషణ వలన నా పురుషు లిద్దరు మనకు సుపరిచితులగు దుగ్గన భీమనలని పాఠకులకుఁ దెలియుచునే యున్నది. డిండిములను బృందావన భవనమునుండి యెవ్వరో యెత్తికొని పోయినారన్న వార్త వినగానే, శ్రీనాథుఁడు వీరిరువురిని, బృందావనమునకుఁబోయి యచ్చటి వృత్తాంతమంతయుఁ దెలిసికొని రమ్మని పంపినాఁడు. ఆయన యాజ్ఞానుసారము

బయలుదేరి పిదప మార్గమధ్యమున నీ జడివానకు లోనై యొక
జీర్ణగృహమును జేరిరి. చెకుముకితో భీముఁడు నిప్పుచేసినాఁడు.
క్రమముగా చిన్నమంట మండసాగినది. ఆ మంటల వెలుతు
రులో వారికి నా గదిని నాలుగుమూలలు గానవచ్చినవి.
అప్పుడంత తెలివితప్పి పడియున్న యొక యాశ్వికుఁడును వారికి
దృగ్గోచరుఁడైనాఁడు. మొదట వారాశ్చర్య చకితులైనారు.
తరువాత, నాతఁడును తమవలెనే యచ్చటికి వచ్చియుండు
ననియు మార్గాయాసముచే బడలి యందు నిద్రించియుండు
ననియు భావించిరి. భీముఁ డాతని దరి కేగినాఁడు. పలుకరించిన
నాఁడు. అతఁడు లేవలేదు. గట్టిగా పిలిచినాఁడు. ఆతఁడు
చలింపలేదు. తట్టిలేపినాఁడు. ఆతఁడు కదలుటఁగూడ లేదు.
ఇంతలో ప్రక్కనున్న సీసాపై నాతని కన్నులు పడినవి. స్థితి
గతులన్నియుఁ దెలియవచ్చినవి. ఆ పెద్దమనుష్యుఁడు సారా
యమమత్తులో నున్నాఁడు. కాని మన భీముని మనసు పాద
రసము వంటిది. ఆతని కూహాలపై నూహాలు పోసాగినవి. ఆ
రాత్రి వృత్తాంత మామూలాగ్రముగ నెఱుఁగ నాతనికి
కౌతుకము చెలరేగినది. కాని యేమి చేయఁగలఁడు. ఆరౌతు
జీవచ్ఛవమువలె పడియున్నాఁడు. కాని యంతలో భీముని
నిశిత దృష్టి యాప్రక్కనున్న కవచముపైఁ బోయినది.
వెంటనే యాకవచమును దీసి యంతయుఁ బరిశీలించినాఁడు.
ఒకమూల నొకతోలుసంచి దొరికినది. అది విప్పినాఁడు. ఒక
లేఖ బయలుపడినది. అదితీసి, మంటకడ కేగి, యాతురతతోఁ
జదువ సాగినాడు. ఒకమారు; రెండుమారులు: పదిమారులు

చదివినాఁడు ఆతని యాశ్చర్యమున కంతములేదు. ఆతని యానందమునకు మేరలేదు. దుర్గన యా ముఖ విలాసము నన్నియుఁజూచుచునే యున్నాఁడు. కాని మాటాడలేదు.

"దుర్గనా మనరేఖ బయలు పడినది"

"మనరేఖ మాటికేమిగాని, యారేఖలోని విషయము లెంతయాశ్చర్యకరములో? మరల మరలఁజదువు చున్నావు."

"ఆశ్చర్యకరములాయని యడుగుచున్నావా? ఇంతకు ముందు మన మూహించుచున్న విషయమునకు తగిన యాధారము దొరికినది. ఇంత యలభ్య యోగముగా నిన్ని యంశము లొక్క మారు తెలియుటయే యాశ్చర్యజనకమైన విషయము."

"మాటలతోఁ బ్రొద్దుపుచ్చుటయేనా? నన్నొకమారా రేఖఁ జూడనిత్తువా ? —సరే; నీవే ఒకమారు దానిసారాంశముఁ దెలియఁజేయుము. విని యానందింతును"

"అయిన వినుము.—ప్రౌఢదేవరాయల తమ్ముఁడు ప్రతాపరాయలు కలడుకదా! ఆతనికి బహమనీ సుల్తాను అహమ్మదుషా వ్రాసిన ఉత్తరమిది. ప్రౌఢదేవరాయలను రహస్యముగా నెట్లయిన సంహరింప వలయుననియు, నందులకుఁ గావలసిన ధనసహాయ్యము, భటసహాయ్యముఁ దాము గావింతు మనియు, సులతాను వ్రాసినాఁడు."

" రాయలయెడ ద్రోహచింత ముందు ప్రతాపునకే కలిగియుండు ననుకొందును."

అవును. అదే సత్యము. ముందీతనికే యీ పాపచింత కలిగియుండును. తరువాత నీతడే సులతాను సాహాయ్య మభ్యర్థించియుండును. శత్రుశత్రువు మిత్రుడేకదా! కాక రాయల వంటి ప్రబలవిరోధి నశించుటయుఁ బ్రతాపునివంటి మూర్ఖుఁడు సింహాపీఠ నధిష్ఠించుటయు, సులతానుకుఁ బ్రియములే. తరువాత నీమూర్ఖునిగూడ పదచ్యుతుని గావించి యీ సామ్రాజ్యమే కబళింప వలయునని యాతని యభిప్రాయము."

" అబ్బో! ఇది సామాన్యవిషయము కాదు. రాయలకీ లేఖఁజూపి సత్వర ప్రతీకారమాచరించునట్లు చేయవలయును. లెమ్ము."

" యీ యాశ్వికునిగూడఁ దీసికొనిపోవుదము. వీని వలనఁ గొన్ని ముఖ్యాంశములు బయలు పడవచ్చును."

" ఈతఁడు వార్తావహమాత్రుఁడేమో"

" అట్లనరాదు. ఇట్టి ముఖ్య రాజకార్యములలో కేవల వార్తావహులను నియోగింపరు. ఈతని కాలుసేతులు బంధించి, తీసికొనిపోవుదము."

" సరే. బంధింపుము. నేనింతలో మాయశ్వముల సజ్జీకృతములు గావింతును —"

—: 10 వ ప్రకరణము. :—

"సోములుగారూ! ఏమిరా విశేషములు? రాత్రి భోజనానంతరము, తమలపాకులు నములుచు, వీరన, తన కాంతరంగికుఁడగు సేవకుని ప్రశ్నించెను. సోములు సామాన్యసేవకుఁడు కాఁడు. స్వామిచిత్తము నెఱిఁగి, మెలఁగుట ఆతనికి వెన్నతోఁ బెట్టినవిద్య. మఱియు, కాముకీకాముకుల సంధికార్య సంఘటనము నందాతఁడందెవేసినచేయి. వీరన, బందీలను బరీక్షించుటకై రెండుమూడుసార్లు వచ్చుటయు, వచ్చినప్పుడెల్ల మాచలదేవివైపు సాభిప్రాయముగఁ జూచుటయు, నాతఁడు కనిపెట్టినాఁడు. దానికనుగుణముగ మాచలగూడ వీరననుగూర్చి, కాపలాకాయుచుండగా నాతని నడిగినది. ఆమె యడిగిన దేమో స్వల్పమే. కాని సోములు, వ్రేలుచూపిన మండి మ్రింగు స్వభావము గలవాఁడు. ఉన్నదానికి మఱిరెండు కలిపిచెప్పుట ఆతనికలవాటు. వీరన యీప్రశ్న వేయఁగనే సోములు దాని భావమంతయు గ్రహించినాఁడు. అతఁడెప్పుడట్టి ప్రశ్న వేయునాయని గుటకలు మ్రింగుచున్న సోములు వెంటనే చిఱునవ్వు నవ్వుచు నిట్లు ప్రత్యుత్తర మిచ్చినాఁడు.

"తమకు తెలియని దేమున్నది బాబూ! కాపలా కాయువాఁడను నేనేమి చెప్పగలను? దేశ విశేషములు పట్టణ విశేషములు తమవంటి వారికి తెలియవలయును గాని, నా వంటివాని కేమి తెలియును?"

దేశవిశేషముల కేమిలే? పట్టణవిశేషములటుంచు. ప్రస్తుతము నీవు చెప్పగలిగినవే ముఖ్యాతిముఖ్యములు. బంధుతులనుగూర్చి వినవలెననియున్నది. ఒక్కొక్కరినిగూర్చి చెప్పు."

" అందఱి మాటకేమిగాని బాబూ! మా చలమ్మగారి సంగతే తమతో కొంచెము మనవి చేసికొనవలెనని యున్నది"

వీరన్న, మఱిరెండు తమలపాకులు నోట వేసికొనినాఁడు. విస్మయానంద విస్ఫారిత నేత్రములతో నాతని వైపే చూచుచు, అంగీకార సూచకముగాఁదలయూఁచినాఁడు.

" ఆమె ఇక్కడికి వచ్చినప్పటినుండియుఁ దమపైనే తలఁపు బాబు. మిమ్ముగూర్చి యొకటే ప్రశ్నించుట. వీరన్నా బొట్టివారు? స్త్రీలనిన కోపింపరు కదా? వెలవెలందులయెడ విసుఖత లేదుగదా? వారు సాధారణముగా నేవిషయములఁగూర్చి సంభాషింతురు? వారి కేయే యాహార పదార్థములయందభిరుచి? సంగీతాభినయములయెడ నాదరముగలవారా కారా? మమ్ముగూర్చి యేనాఁడైన ప్రసంగింతురా?— ఇట్టి వేవేవో ప్రశ్నలు తండోపతండములుగా వేయును. అడుగుట కామెకును, చెప్పుటకు నాకును గూడ విసువులేదు. సాధారణముగా రాత్రులందు నిద్రింపనే నిద్రింపదు. తొలిసారి మిమ్ము ముత్యాలశాలలో చూచినదఁట. మీపై మనసుపోయినదఁట. ఆనాటి మీరూపము నచ్చుగ్రుద్దినట్లు వర్ణించి చెప్పుచుండును. చిఱునవ్వుతోడి మీముఖవిలాసమును దలఁచి తలఁచి యువ్విళులూరుచుండును. తుమ్మెదలబారువంటి మీమీసముల సొయగమును మెచ్చుకొనని రోజే లేదు."

వీరన మీసములపై చేయివైచి, విలాసముగ నవ్వుచు తలయూపి

"ఏమోయి ఇంత గ్రంథముండియు నిన్నాళ్ళు నూతికే యున్నావు. బలేగడుసువాడవు. సరే నీవేమన్నావు? నిజము చెప్పుము. చూతము."

సోము లోకచిన్న నవ్వు నవ్వి,

"నే నేమందునో తమకు తెలియదా? తమ దర్జా, తమ ఠీవి, తమ రసికత, తమ విలాసము, ఈ భూమండలము మీద ఎవరికి లేవని నొక్కి చెప్పినాను. వేయేల రాయలవారి కడ కూడ మీరసికత కానరాదనియు, తమరు చేపట్టిన వారి యింటిలో నవనిధులు తాండవమాడుననియుఁ జెప్పియున్నాను. ఇఁక రూపమునకా — అది నేను జెప్పనక్కరలేకుండ నామెకే తెలియును. మొట్టమొదట, తమ రూపరేఖా తారుణ్యములు చూచినంతనే కదా ఆమెకీ పిచ్చియెత్తినది."

(నవ్వుచూ) మెలమెల్లగాఁ బిట్టను వలలోవైచి నావన్నె మాటే"

"వలలో పడుటెంతసేపులెండి. మనము వలవేయుట యుఁ బిట్టపడకి పోవుటయు నెన్నడైనఁగలదా! కాని ... ...

"కాని ... ... ఏమి? మాటసగములో నాపినావు. నీకేమైన ననుమానమున్నఁ జెప్పుము."

“[illegible] తేము. ఇదియంతయు వృథా ప్రయాసకదా యని వగచుచున్నాను. ఆనాఁ వలపు [illegible] సికత [illegible] [illegible] వ్యర్థముతో యున్నది”

“ఏమిరా! [illegible] మనా[illegible] [illegible] విశ్వాసమ్ము [illegible] చేసి వెచ్చిన్నను. వీర[illegible] గార [illegible] నేమన్నను [illegible] పేరు చెప్పినను భూతప్రేతములు పరుగులు పెట్టవలయును. [illegible]

“ ఇక [illegible] భూతములు గాని [illegible] ములు గాని లేవు బాబు. తమ [illegible] [illegible] ట్లున్నారు [illegible] ప్రేతా పరాయణులైనారు. వలచినట్లున్నారు [illegible]

[illegible] [illegible] ప్రేమ [illegible] [illegible] మండపము [illegible] [illegible] పుచ్చు [illegible] [illegible]

అవును. బాబు. నిజమే. ప్రతి దినము ఆ రక్కసి ములు [illegible] ప్రదికవచ్చి, ఏమేమో [illegible] లాడి తుదకామె సమస్తమును [illegible] [illegible] లు, [illegible] భయపెట్టి [illegible] ను; ఆ వచ్చినప్పుడెల్ల నేను దూరముగా నుండవలెయునట. ప్రేతాపుని [illegible]! ఆ [illegible] [illegible] నేను మరల వచ్చునో యని [illegible] రముగా భయపడుచున్నాను: ఆ యువను మనసుకడ బట్టక [illegible] స్తంభముతో మాట్లాడుచున్నరడి యన్నమాటలు నాలించుచుంటిని. ([illegible]) [illegible]

“ ఏమి చెప్పినరా”

“. [illegible]

"ఇవి మాటలుకావు బాబు; మొట్టమొదట లాలించును. ప్రతాపుని వరింపుము. అతనికంటె సుందరుఁడును రసికుఁడు నెవ్వఁడు గలఁడు. లోకమునందలి సమస్త భోగములును నీకు లభించును. నిమాట నాదలఁదాల్చి, వేలకువేలు దాసదాసీ జనులు సంచరింతురు.—ఈ ప్రకారము కొంతసేపు. తరువాత జడిపించును. అతని వరింపకున్న చో నీ కాభరణము కారాగారవాసమే. ఇప్పుడింకను నీయెడ వలపుతో నున్నాఁడు. కాని కుపితుఁడైయైనచో నీవు పడుపాట్లు కుక్కలుకూడఁబడవు ఇప్పుడు నీకు కారాగార వాసమునుమాటయే గాని, సమస్తోపచారములును జరుగుచున్నవి. అప్పుడో, కేవలనరకమే యనుభవింప వలయును. నేలమాన్యములో గాలియు వెలుతురును లేని యంధకార బంధురమగు కూపములో, ఁబడవేయుదురు. తినుట కాహారమైన నీయరు. క్రుళ్ళి, క్రుంగి చావవలయును. నామాట వినుము. అష్టైశ్వర్యముల ననుభవింపుము.—ఇట్టివే యింకను నేవేవో జడిపింపులు. ఈ మాటలన్నియు ముగిసిన తరువాత నామె పోవును. పోయినంతనే నేను యథాస్థానమును చేరుదును. అంతట నేమిచెప్పుదును. నాగుండె నీరై పోవునట్లామె యేడ్చును. ఒకనాడు నాతో స్పష్టముగాఁ జెప్పినది. వీరన దండనాథుఁడు తన్ను చేపట్టనిచోఁ వజ్రపుటుంగరమును దిని మరణించునఁటగాని, ప్రతాపుని గతాపుని తానొల్లదఁట."

(సంతోషముతో) "నిజమే? నిజమే? అంత ప్రతిజ్ఞ చేసి నదిగా! ఆమె పూర్వజన్మములో నేదో తపోభంగము వలన, వెలవెలదియై పుట్టినదికాని, కులకాంతలమని విఱ్ఱవీగు వారామె కాలిగోరికి కూడ సరిపోరురా!"

"నిజమే! బాబు! ఆమెకున్న నీతి యేరాణివాసపు స్త్రీలవద్ద కానరాదు."

"సోములూ! మాచల మంచిఅందకత్తె కదూ!"

"అందకత్తెయని యడుగుచున్నారా! అందాలబరిణె. గత్నాలమూట; తమవంటి రసికుల చేతిలో నె అటువంటి గులాబీ రాణించును. కాని—"

"మరల కానీ ఏమిరా!"

"చిత్తము; నేను ఏలినవారి సేవకుడను. తమ యభివృద్ధియే నాయభివృద్ధి. కాబట్టి ప్రతాపరాయలు వలచిన దానినే తమరును మోహించుట"

"ప్రమాదకరమనియా నీ యభిప్రాయము. హుం ప్రతాపుడు; ప్రతాపుడు నాచేతిలో కీలుబొమ్మ. నేను కన్నెఱ్ఱ చేసితినా ఆతనికాయువు మూడినదనుకొనుము. ప్రతాపుని బ్రతుకంతయు నాచేతులోనున్నది. వాని గుట్టుమట్లన్నియు నాకుఁదెలియును. నా పిడికిలిలో వాని ప్రాణము లున్నవి. పిడికిలి విప్పితినా వాని ప్రాణవాయువు లెగరిపోవును. ఇదిగో! వీరన దండనాథున కెదురుతిరిగి యీ భూమండలమున నెవ్వ

నేను బ్రతుకజాలను. సరా. నీ భయము తీరినదికదా! ఇంక నీ బంగారు బరిణెనుగూర్చి కొంచెము ప్రసంగింపుము. ఎంత వినినను దనివి తీరకున్నది.''

చెప్పుటకేమున్నది బాబు. బందిఖానాలోనుండి ప్రముఖ వారిని గూర్చి యేమి చెప్పవలెనుగదా. వారి భాగ్యమును గూర్చియా?''

'' కారాగారవాసమునకు కొంతకాలము మాత్రమే. తరువాత నా [illegible] ప్రస్తావన [illegible] ... ... వ్యసనము.''

'' (సవ్యమా) పోనిండు ఆ కారాగారవాసమువలన కేమియు వలవంత నొందుట లేదు. నీవు మిక్కిలి [illegible] మా భాగ్యము తలవంచినదని యాయన సంతసించుచున్నది.''

'' మరియొకసారి వేసవికాలమున [illegible] చెప్పుము. [illegible] తన [illegible] [illegible].''

'' [illegible] [illegible] [illegible] [illegible] స్వేచ్ఛ [illegible] సాయంకాలము [illegible] యుద్యోగ [illegible] తిరుగుచుంట [illegible] కోరుచున్నది.''

'' [illegible] ఇంకేనా [illegible] ఇదిగో [illegible] నాథుని యనుజ్ఞ [illegible] సాయంకాలమే [illegible],

[illegible]చ్చువచ్చినప్పు డయిచ్చెద[illegible] త [illegible] సన్నిజముతో నా
యుద్యానవనము [illegible]ంప వచ్చును. ఇది నా యాజ్ఞ యని
యిచ్చెదీ [illegible] చెప్పుము."

" [illegible]త్తము. తప్పక [illegible]మగు, * * * * "

" [illegible]మా [illegible] రేపు [illegible]గారములు
[illegible] వచ్చెదను. [illegible] [illegible] [illegible]వాసిన
[illegible]ము[illegible] [illegible]."

" [illegible]త్తము, [illegible] "

ఆ. తరువాత [illegible] [illegible]ముపై [illegible]వ[illegible]. [illegible]డు
[illegible] [illegible] ట్లు [illegible]. [illegible] [illegible]
[illegible] [illegible]గ[illegible] గ [illegible] నుద్యో[illegible],
[illegible]పుల్ల [illegible] కేసర [illegible]గ [illegible] [illegible]త [illegible]
[illegible]హా[illegible] [illegible], [illegible], మధూ[illegible]
[illegible]ధ [illegible]డై, యుల్లల్ల[illegible] [illegible] [illegible]దు[illegible] [illegible]
స్పర్శ[illegible] [illegible]హ్లాద[illegible] [illegible] [illegible]. కాని
[illegible] తమ[illegible] [illegible]యే[illegible] ఆతని హృదయము
[illegible]రమైన [illegible]ములం[illegible] [illegible] [illegible]ను లీనుచు[illegible]ను.
[illegible] తను [illegible] ద [illegible] [illegible]నుబట్టి
[illegible]ప [illegible]ది. [illegible]ములు త [illegible] [illegible]. ఇట్టి
కార్యము [illegible]మా [illegible]ములు త చేతిపై [illegible]డిపినాడు.
[illegible] [illegible] [illegible] చేయలేదు. కావున నాతని[illegible]టలు
[illegible] [illegible]వచ్చును. [illegible] తను [illegible] [illegible]ది.

ఎంతటి మధుర సంఘటనము. ఇట్లగునని తానెన్నడు ననుకొనలేదు. మాచలను జూచినప్పుడెల్ల ఆతని హృదయమును చలింపుచుండెడి మాట వాస్తవమే. కాని యట్టిలోక సామాన్య రూప సౌందర్యముల ననుభవింప నేరసికుండా సింహుడు? చేతి కందిన జుంటు తేనెపట్టును, పరిపక్వగోస్తనీ ఫల గుచ్ఛమును, నిరసించు మూర్ఖుండెవ్వడైన నుండునా? ఆమె నెట్లయినం దన వశవర్తినిగం జేసికొనవలయునని తానూహించుచుండుటయు వాస్తవమే. కాని యట్టి సామాన్యముగ, మహాత్ముగ, తనభాగ్య దేవత లనుగ్రహింతురనియు, నాకె తానుండానే తన్ను ప్రేమించి వరించుననియు నాతండూహింపనైన లేదు. తన విలాస విభ్రమములను రాగాలసలలో ముగ్ధులగుచున్నారని విఱ్ఱవీగునాకెను దనవంకకుం ద్రిప్పుకొనుటకుం దానెన్ని ప్రయత్నములు చేయవలసి యుండునోయని, యాతండాతురత పడుచుండంగాం దన్నాతండు పరిగ్రహింపకున్న వజ్రపుటుంగరమును దిని మరణింపనైన మరణింతును గాని ప్రతాపుని మాత్రము పరిగ్రహింపనొల్లనని, యామె ప్రతిన గైకొనినదంట. ఎంతయాశ్చర్యకరము? పిరనదంతనాపునకొక్క కొంత సేపు మతి పోయినట్లయినది. ఇంతకుం బూర్వమాతని హృదయమున నేకోశమునందో దాగియుండిన కామజ్వరమాతని నాడీమండలమంతయు వ్యాపించి బాహ్యవస్తు పరిజ్ఞానమును గూడ నడగింపంజొచ్చినది. అతనికన్నుల యెదుట మాచల దేవియే సాక్షాత్కరింపంజొచ్చెను. నృత్యాలశాలలో నాట్యము సేయునప్పటి మాచరూపము ఆతని హృదయ

ఫలకమునం జిత్రితమాయెను. ఆమె నాట్య భంగిమలన్నియు నాతని మనోనయనములం బొడగట్టెను. ఆసుందరాంగి హావ విలాసములను ధ్యానించి ధ్యానించి యాతఁడు తన్నుదానే మఱచిపోయెను. ఇట్లుకొంతసేపు గడచెను ఆమె నెట్లయినం బొందవలయును. ఇది యాతని నిశ్చయము. కాని సోము లామును ప్రతాపుఁడు కాంక్షించుచున్నాఁడని చెప్పినాఁడే. అదియే నిజమైనచో నికఁ బ్రతాపునకు స్వస్తిచెప్పవలసినదే. కాని ప్రతాపుఁడే చక్రవర్తియైనచోఁ దనకు మఱి మంత్రి పదవి లభించునే? కావున సోమలదేవి నెట్లయినఁ దప్పించి, రహస్యముగఁ దనయింటనుంచి, యభిమత క్రీడలఁ దేలియాడి నచో — ఇది మంచియూహయే. కాని దీనికి నేక ప్రతిబాధక ములు గలవు. ప్రతాపునకీ విషయము తెలియకపోదు. ఆమెను ప్రతాపుఁడు మోహించియున్నను, ఆమెను సందేహించియే కారాగారమున నుంచినాఁడు. కావున నామె కానరాకున్నచో సహస్రముఖముల వెదకించును. మఱియు నమాత్యశేఖరులు నప్రమత్తులైయున్నాఁడు గావలివారిని మోసగించు టెట్లు? అయ్యో! తానింతదూరముల యోజింపవలయును? ప్రతాపుని గుట్టు మట్లన్నియుఁ దన యెఱుక ములుకదా! అది చక్రవర్తికి నివేదించి ప్రతాపుని బంధింపఁ గావించినచో తన మార్గమును నిరోధించు వారెవ్వరు? అదియే యుత్తమమార్గము సోమలదేవి ప్రణయ నిర్భరాశ్లేష సౌఖ్యముకంటె మహాముక్తి యొకటి గలదా? యోజించి యోజించి నీరసుఁ డీ సిద్ధాంతమునకు వచ్చినాఁడు. మోసమున నిట్టిదేకదా! ఎంతటి పాపమున కొడిగట్టినాఁడు.

తన్ను సర్వధాసమ్ము, తన చేతిలో సర్వస్వమునుంచి, తన యాంతరంగిక విషయములన్నియుఁ జెప్పిన ప్రభువునకే యన్యాయము చేయనెంచనే! కాని నిరసన కంతలో మఱి యొక యూహ తోఁచినది. ఆ యూహయే పొడసూపకుండినచో నాతఁడాక్షణముననే సార్వభౌముని కడకేగెను, మహామంత్రి కడకేగెను బోయి సర్వము నివేదించి, ప్రతాపునిఁ బట్టుమీఁది కోఁడివలె నప్పగించువాఁడె. కాని యాయూహ చిన్నయాతంకమును కల్పించినది. సోములేమైన బద్ధము చెప్పినాఁడేమో. తనయభిప్రాయము ననుసరించి మాటలాడుచుండుటయు, తన్నెట్టియైన సంతోషపఱచి సన్నిహితుఁడగుటయు, సోములకు చిరకాలాభ్యస్తవిద్యలు. తా నెవ్వతెనైనఁ గామించుచున్నట్లాతఁడు పసిగట్టినఁ జాలు. మఱుచటి సమయమునుండియు నాసుందరి మదన బాణ తాడితయై పరితపించుచున్నదని చెప్పుట సోముల కలవాటు. కాని యంతవఱకు నాతఁడు చెప్పుట నబద్ధములాడినను చేష్టలు కానరావు. తా నెందఱినో కులస్త్రీలను వలచినాఁడు. కొందరు తన్ను వలచి వచ్చిరి. కొందఱిని దానువలచినాఁడు. అన్నిటఁ సోములే సంధాన కార్యము నెఱపినాఁడు. అట్టివాఁ డీట నసత్యము చెప్పునా? చెప్పి ప్రాణములతోఁ బోవునా? ఏమో? మానవ హృదయ మెప్పుడు నొక తీరునే యుండునని యెవ్వరు చెప్పగలరు? లేక యితఁడింతయు శత్రుజనుల కుట్రరచనయా? తనకును బ్రతాపునకు నభిప్రాయ భేదమును గల్పించి యిరువురను ధ్వంస మొనర్ప వేసిన యెత్తేమో! ఇందు సోములుగూడఁ జేరియుండెనేమో! లేక, ఆతఁడు గూడ

వంచింపఁబడెనేమో! అంతలోనే వీరనకు మఱియొక యూహ పొడసూపినది. అరరే యెంతదూరము పోవుచున్నాను. ' నా యాలోచనలన్నియు వెఱ్ఱితలలు వేయుచున్నవే. ఏది యెట్లున్నను, ఇటు సూర్యుఁడుఁ బైనను నా మాచలను నేను వదలఁజాలను. ఎవ్వరేమైనను సరే. ఆహా! ఆరూప మనస్యసామాన్యము. ఆ విలాసము త్రిజగన్మోహనము. ఇట్లు, పరస్పర విరుద్ధములగు చింతాపరంపరలకు లోనగుచు నాతఁడా రేయి యంతయుఁ గడపెను. కంటికి కూరుకు రాలేదు. మఱునాఁడే మాచల దఱికేఁగి సోముల మాటలయందలి యాథార్థ్యమును నిశ్చయింపనెంచెను. నిజముగ నామె తనయందే వలపు నిలిపెనా. ముజ్జగములు తలక్రిందైనను, తానామెను బొందియే తీరును; స్వామిద్రోహము కానిండు, జగద్ద్రోహముకానిండు. ఆ ముగ్ధలలాట యౌవన సౌందర్యము లనుభవింపని జన్మము వ్యర్థము.

ఇట్లొక నిశ్చయమునకు వచ్చిన తరువాత, ఆతని కొంకించుక నిద్రపట్టెను. ఆ కలత నిద్రలో నాతనికొక కలవచ్చినది. తానును బ్రతాపుఁడు నొక పడవపైనెక్కి యొక సరోవరములో విహరించుచుండిరి. ఆ సరోవర మధ్యమున నొక ద్వీపము గలదు. అందుఁజివురు జొంపములతోఁ బుష్పగుచ్ఛములతోఁ బరిపక్వ ఫలకదంబముతో నలరారు తరుపుంజములుగలవు. ఇరువురు నా ద్వీపమునకేఁగ సంకల్పించిరి. తానోడ నడుపుచుండెను. ప్రతాపుఁ డుత్సాహముతోఁ గూని రాగములు తీయుచుండెను. ఇరువిరును ద్వీపము దఱికేఁగిరి.

అందొక రసాలసాలము గలదు. అయ్యది ఫలభార నమ్రమై యుండెను. దానిఁజుట్టి యల్లిబిల్లిగఁ దీగెలెన్నియో యల్లుకొని యుండెను. అవి చిత్ర విచిత్రములగు వర్ణములు కలవి. చక్కని సువాసన లీను పుష్పములతో నలరారుచున్నవి. ఆ తీగెల నడుమ నారసాలము నానుకొని యొకపెద్ద భాండము కలదు. అదిహిరణ్మయము. అందు దివ్యతేజః పుంజమును విరజిమ్ము చున్న మణుల నేకములు గలవు. వారిరువురకు నయ్యది యెట్లేనిఁ గొనిపోవలెనను నూహ పొడమినది. ఇరువురు నొకరి మొగమొకరు చూచుకొనినారు. నవ్వుకొనినారు. ముందుకు నాలుగడుగులు వేసి యాతీగెల గుంపులోఁ బ్రవేశించినారు. ఆశ్చర్యము. ఆతీగెలన్నియుఁ జైతన్యమున్నవానివలెఁ గదలఁ జొచ్చినవి. ఇదియేమి వింతయని చూచునంతలో నవి యొక్క టొక్కటిగా వారిని జుట్టి బంధించివైచినవి. ఉక్కు గొలుసుల వలె నవి త్రెంపనసాధ్యములై యున్నవి. వారిరువురకు నేమి చేయుటకు నవకాశములేక పోయినది. అంతలో నెక్కడనుండి యూడి పడినదో యొక మహాసర్పము; పంచ ఫణామండల మండితము. ఘోర పూత్కారరవముతో నేతెంచి వారినిరువు రను దన నిశిత దంష్ట్రా జాలముతో గరవఁ బోయినది. భయార్తులై వారిరువురు కెవ్వున కేక వైచినారు. పారిపోవ విశ్వప్రయత్నము గావించినారు. కాని యాతీగలు మఱియుఁ బిగిసి పోయినవి. అంతలోనే యాశ్చర్యకరముగా వారున్న చోట నొక మహారంధ్ర మేర్పడినది. అందుండి ఘోరవహ్ని శిఖలు బయల్వెడలినవి. ఆ వహ్ని శిఖాపటలమధ్యమునఁ

జిక్కికొని వారిరువురు నార్తులై హాహాకారములుగావించిరి. కాని యాతీగెలు మఱియు బిగుసుకొనిపోవుచున్నవి. ఎటు పోవుటకును వీలు లేదు. ఏమి చేయుటకునువీలు లేదు.

వీరన, ప్రతాపులొక పర్వతము నధిరోహించుచుండిరి. అంతలో నాపర్వతము బ్రద్దలై యగ్నిపుంజముల నెగజిమ్మ జొచ్చినది. వారిరువురు దారియుఁ దెన్నునుగానక యటు నిటుఁ బరువులు వెట్టసాగిరి. అంతలో నిరువురును గాలుజారి యాఘోరానల మధ్యమునఁ బడిపోయిరి.

వహ్నిస్ఫులింగముల వెడల గ్రక్కుచున్న కన్నులతోఁ బాములవలెఁ బుసకొట్టుచున్న కఱకు వెంద్రుకలతో బండి కందెన చాయగల మేనితో కోరబండ్లతో నొక మహా భూత మాతనియెదుటనిల్చి కఠిన హుంకారరవముతో, జ్వాలదుగ్ర వదన గహ్వరమును దెఱచి, యాతని మ్రింగబోయినది. ఆ భయంకర మూర్తిని జూడగనే యాతని సర్వావయవములు గంపించినవి. ముచ్చెమటలు గ్రమ్మినవి. కాలుసేతులాడుట లేదు. భయాతిరేకమున గొంతుగ డగ్గుత్తిగ పడినది. వికట స్వనమున నాతఁడు "రక్షింపుడు; రక్షింపుఁడ"ని యరచుచుఁ గ్రిందపడి పోయినాడు.

11 వ ప్రకరణము.

మరునాడు పూర్వాహ్ణమంతయు నించుమించుగా, వీరనకు సముచితాలంకార నిర్ణయమునకే సరిపోయినది. బంగరు జలతారు పనివాడితనముగల పట్టు వస్త్రములెన్ని యో

ముందుపడియున్నవి. ఆతఁడందొక్కటి తీయును. అందేదోలోప మెంచును. మఱియొకటి తీయును. మఱియొక లోపలేశము గాని పించును. ఒకదానికి జలతారు హెచ్చుగ దోచును. వేరొక దానికి తక్కువయగును. ఒకదానిరంగు ముదుక; ఒక దానిరంగు పలుచన; ఒకటి వెలవెల బోవుచున్నది. ఒకటి గరగర లాడుచున్నది. ఇట్లా వస్త్రముల నెంతయెంచినను, ఆతనికొక స్థిరనిశ్చయము కుదురలేదు. ఒక యుష్ణీషమును దీసినాడు. అది గులాబీరంగు పట్టుతోఁ జేయఁబడినది. దానికి ముత్తియములు కూర్చి కుట్టబడియున్నవి. దానిని ధరించినాఁడు. ఒక నిలువు టద్దము కడకేగి తన యందమును బరిశీలించుకొని నాడు. అది బాగుగనే తన కమరినది. కాని సంపెగనూనెతోఁ దనజుట్టు చక్కగ దువ్వుకొని గులాబులు ముడుచుకొనినచోఁ దానంతకంటె యందముగాఁగానిపించునేమో కాని నల్లని తుమ్మెదల బారువంటి తన మీసమునకేమి రాయవలయును. సంపెగనూనెకంటె మల్లెయత్తరు వించుకరాసిన సొగసుంద నంపు సొంపులు గుబాళించునేమో. మాచల తన మీసమును జూచి మురిసిపోయినదని సోములు చెప్పినాడు. కావున దాని మెడఁబ్రత్యేక శ్రద్ధవహింప వలయును. కాని యామె కేరంగు గల వస్త్రము లిష్టమో. ఎంత పొరపాటు. సోములు నా విష యమునుగూర్చి తానడుగ మరచినాడు. ఆ మొద్దుపెద్దమ్మ కూడఁ దనకా విషయమును జెప్పమరచినాడు. ఇఁకేమిచేయుట. మరల నిలువుటద్దము దరికేగినాఁడు. ఈ మారు బంగరు జల తారుచమికీ పనిచేసిన యంగరఖాను ధరించినాడు. మెడలో

ముత్యాలహారములు వేసికొనినాడు. మీసమును మెలివేయుచు నొకచిఱునవ్వునవ్వి తన యందచందములకుఁదానే మురిసిపోయినాడు. ఇన్నిచిన్నెలు నిన్నివన్నెలు నింతరసికత యుఁగలదు కావుననే మాచల తన్నువలచినది. తన్నుజూచిన కంటితో నామొద్దు ప్రతాపునిఁజూచునా ? ఒక విధముగాఁ దనయాత్మకు సంతుష్టి యొదవినది. కాని యట్టిమంచి సమయమున సోములచ్చట లేకపోవుట యాతనికి గొప్పలోపముగాఁ దోచినది.

వీరన మధ్యాహ్నం భోజనమును ముగించి, కొంతసేపు విశ్రమించి, యెండవేడిమి తగ్గినంతనే మరల సింగారమునకు గడంగినాఁడు. కొంతసేపటి కన్నియు సమాప్తమైనవి. అంతట గుప్త ద్వారమును దెరచి యందులో మాయమైనాడు.

ఉద్యానవనమున విలాసముగ నడుచుచూఁ గారాగారము దరికేతెంచుచున్న వీరనను సోములు దూరమునుండియే చూచినాఁడు. చూచినంతనే త్వరితగతినేగి యావార్తను మాచలకును మందారవల్లికిని జెప్పినాడు. వారాతనిరాక నూహించియే యున్నారు. కావున సర్వసన్నద్ధలైయే యున్నారు. వీరన హారిణీశాబకమును బట్టుటకుఁ గావలసిన వాగురులన్నియు సిద్ధముగానేయున్నవి.

అంతట వీరనగారు సవిలాసముగ నడచుచూఁ గారా గారమును సమీపించి, యెదురుగావచ్చిన సోములుపై నొక కరుణాకటాక్షవీక్షణ మందహాస రోచిన బ్రసరింపజేసి, యా పడతులిర్వురుగల వైపునకు మరలిరి. సోములు ముందుత్రోవ చూపుచుండెను.

అల్లన వీరన దండనాథుని గాంచినంతనే, మాచలయు మందారవల్లియు లేచి నిలిచిరి. గజ్జెలందియలు ఘలు ఘల్లుమని మ్రోగినవి. వీరనగారి దృక్కులావంకకు మరలినవి. ఆహా! ఏమి యాదృశ్యము. వీరన తనకన్నులను దానే నమ్మలేకపోయి నాఁడు. తానున్నది భూలోకమా? లేక స్వర్గమా? స్వర్గమే కాకున్న నింతటి యపరూప రూపసంపద యీలోకమున నెట్లుద యింపగలదు. చక్రవర్తికడ నాట్యము చేయునప్పుడు, మాచల దేవినాతడు చూచియే యున్నాడు. కానియంతటి విలాసము, ఇంతటి యొయ్యారము, ఇంతటి రూపసంపద, ఆమెయందా నాడు కూడ నాతనికి గోచరింపలేదు. ఆమె లేగులాబీరంగు పసల మిస మిసలాడు నంగదట్టమును గట్టినది. పైని శారద చంద్రికాధవళంబునం శుకమును ధరించినది. వదులు వదులుగా జడవైచుకొని యొక్క పుష్ప గుచ్ఛమును మాత్రమే ముడుచు కొనినది. మెడలో నొక్క ముత్యాలహారము మాత్రమే కలదు. వీరన యామె నాపాదమస్తకముఁ దిలకించినాడు. పసిమితో మిసమిసలాడు నామె లావణ్యామృతము నాతనికి నేత్రపర్వ మొనరించినది. చారడేసి కన్నులు; బారెడుజుట్టు; విదియ చందురుని గేరు నెన్నుదురు. లావణ్య ప్రవాహా ముబికి పచ్చు

చున్నదో యన నొప్పు నంగసౌష్ఠవము—— వీరనకు మైకము గమ్మినది. ఆమె నట్లే చూచుచు నిలిచిపోయినాడు. అట్లెంత సేపు నిలిచినాడో ఆతనికే తెలియదు. అంతలో మధుర మనోజ్ఞ వల్లకీ నిస్వనమువోలె నుల్లాసమును గల్పించు నొక కంఠరవ మాతని చెవిని బడినది. వీరన తన మైకమునుండి తెప్పరిలినాడు. కాని యా వాక్యమేమో, యాతని కర్థము కాలేదు. అంతటఁ జతురవచో విలాసముల నారితేఁన మందారవల్లి యిట్లుపక్రమించినది.

మందా:- వీరన దండనాథులు త్రోవతప్పి వచ్చినారేమో. లేక యీనిర్భాగ్యులపై నీనాటి కనుగ్రహము గలిగిన దేమో.

వీరన:- (తొట్రుపడుచు) లేదు లేదు; ఈ రోజున- కాదు కాదు; ప్రతిదినము, ఇటురావలయుననియే నాయభిప్రాయము. కాని ఏమి చేయుదును. అడుగడుగునకు నేవో రాజ కీయము లడ్డుతగులుచునే యున్నవి. ఇంతకు నేనిచటికి వచ్చి వారమురోజులేకదా యైనది.

మందా:- ఓహో! మీకు వారము రోజులొక లిప్తవలె నున్నవి. కాని—సోములు నడుగుడు—మా చెలి కవియే యేడు యుగములై పోయినవి.

సోము:- అంతే బాబు అంతే; అహర్నిశము మిమ్ముగూర్చియే ప్రశ్నలు. ప్రత్యుత్తరములీయలేక నేను చచ్చెడివాడను.

వీరన మాచల వైపొక్కమారు దృష్టి పోనిచ్చి నాడు. నల్లగలువల నీను నామె కన్నుల నొక్కమారే పైకెత్తినది. ఒక్క క్రేగంటిచూపు; ఒక్కటే మధురమందహాసము. వీరన ముగ్ధుడైనాడు; పరవశుడైనాడు. ఆతని యొడలెల్ల గగుర్పొడిచినది. మధుర మధురమగు నామందహాసమున మల్లికా ప్రసూనములు వికసించినట్లు, అమృతము తొణికిసలాడినట్లు, పారిజాతములు పరిమళించినట్లు, వీరనకుదోచినది. ఆతడు తన్ను మరచినాడు. విశ్వమునే మరచినాడు.

వీరన మనస్తత్త్వమును మందారవల్లి క్షణములో గ్రహించినది. పాపము ! దుర్జాతి సూనవుడు. నిముసములో నీరైనాడు. ఇక నాతని నొక కీలుబొమ్మవలె నాడింపవచ్చుననియు, నాతని సాహాయ్యమున నెట్టి కార్యమునైనఁ గొనసాగించు కొనవచ్చుననియు నామె నిశ్చయించినది. తనచెలి మధుర మందహాస మొక్కటి యైనఁజాలును; తన సర్వస్వముగూడ ధారపోయుట కాతడు సంసిద్ధుఁడే. ఈ మహాసమయము మించి పోకూడదు. మరల నామెయే యిట్లుపక్రమించినది.

మందా:- చెలీ ! ఎంత సిగ్గే నీకు. వారు రానంతకాలము వారిని గూర్చియే చింతనయూ. వచ్చినంతనే మూకీభావమా. నీ నోట నింతవరకొక్క పలుకైన రాకుండినందున వారెంత చిన్నబుచ్చుకొనుచున్నారో యెరుగుదువా? సర్వస

మర్ధులును, సర్వతంత్ర స్వతంత్రులును, అగు వీరన దండనాథులతోఁ జెప్పిన నీకోరి- లీడేరునుగాని, చచ్చుపెద్దమ్మలమగు మాతో మొరపెట్టుకొనిన నేమి ప్రయోజనము? (వీరనతో) బాబూ! మీరు రసికావతంసులు.. మీకు నేనుజెప్పుదాననా! మా చెలి కెంతసిగ్గో చూచితిరా. మీ వైపు మోమెత్తి చూచుటకుఁగూడ నామెకు శక్తి చాలకున్నది. ఇంత వ్రీడావతి నీప్రపంచమున మీరు చూచియుండరు. ఏమైన నింతటి లజ్జకూడదు. మీరింగితజ్ఞులుగాన సరిపోయినది. మరొకరైన నేమై యుండెడిది. (మాచలతో) చెలీ! ఎంతటి లజ్జావతివే. ఊరకనిల్చి నేల కాలురాయుచున్నచో నీ హృదయగతాభిప్రాయము నెవ్వరెరుంగ గలరు? (నవ్వుచు) వీరనగారు రసికశేఖరులే కావచ్చును; మహావీరులే కావచ్చును. కాని నీహృదయమిట్టిదని పోల్చుకొనుటకు వారేమి మాంత్రికులా?

మాచలదేవి మోమెత్తినది. వీరనకు త్రిలోక సామ్రాజ్యలక్ష్మియే మోమెత్తినట్లు తోచినది. ఆతని హృదయస్పంద మధికమైనది. ఆతురతతో, నోడలెల్లఁ జెవులుగా నాతఁడామె యమృత మధురస్వనము నాలింప నుత్సుకుఁడై నాఁడు.

మాచల:- (మందహాసముతో) మాంత్రికులు కారేమి? అట్లయిన నింతదనుక నెవ్వరు నాకరింపఁజాలని నా హృదయము నింత త్వరలో నెట్లు గ్రహింపగలిగిరి. (బొమ

ముడితో) నా హృదయమే నాయధీనమున లేనప్పుడు నన్నేమిచెప్పమందువే. మరల మరలనన్ను వేధింప కుము. అదియెవ్వారి యధీనమున నున్నదో వారినే యడుగుము. (వీరన వైపు సానూయముగ జూచును. మరల మధుర మందహాస దృగ్విలాసము)

వీరన కూపిరియాడుటలేదు. ఇన్ని భావసంఘర్షణ లోకక్కమారా. మరలమందారవల్లియే యిట్లుపలికినది.

మందా:- (నవ్వుచు) పోనిండు. నీ హృదయ మాయన కడ నున్నది. ఆయన హృదయము నీకడనున్నది. కావున నెవరియభీష్టములు వారికే తెలియుటలేదు. కాని మీ యిరువురి హృదయములు నాకుఁదెలియును గదా! కావున నీ యభీష్టములను, వారి యభీష్టములను గూడ నేనే యేకరువు పెట్టెదను. అన్యోన్య సాహాయ్యమున నిరువురి యభీష్ట సిద్ధియుఁగాగలదు.

వీరన హృదయము కుదుటఁబడినది. ఆమె కోరెక్కెట్టిదైనను సరియే అతడు తీర్చుటకు సంసిద్ధుడే. కాని యా కోర్కెయెట్టిదో యామెచెప్పకున్న నేమిగతి? ఇప్పటికి తరణోపాయము గానవచ్చినది. అతఁడు మందారవల్లి మోమువంకకే చూచుచున్నాఁడు.

మందా:- ఏమే చెలీ చెప్పమందువా?

మాచల:- (వీరనవైపుచూచి చిఱునవ్వునవ్వుచు) అట్లేకాని మ్ము. మా కోర్కెలతోపాటు నీ కోర్కెయుఁదీరవల యునుకదా !

మాచల కలకల నవ్వినది. అమృత లహరీశీతల శీకర ములు మేనఁజిలకరించినట్లయినది వీరనకు. అతఁడు గూడ నవ్వినాడు. మందారవల్లియు సోములును నవ్వినారు.

సోములు: ఇంతదనుకనీవుచెప్పు నీవుచెప్పనుటయేకాని, బాబు గారికున్న సంగతినెవ్వరును జెప్పకున్నారు. ఇప్పుడు మధ్యవర్తిత్వమును నేను నడపెదను. మఱేమియును లేదు బాబూ ! ఆమె కించుక స్వేచ్ఛ గావలయునని యిదివరకే నేను మనవి చేసితినిగదా ! అది ప్రభువు లను గ్రహింపనే యనుగ్రహించినారు. ఇఁక గోరునది స్వల్పమే. ఎంతకాలమీ కారాగారవాసము ? ఎందు లకు తన్నిట్లు నిర్బంధించినారు ? ఎవరు ? -ఇవియామె ప్రశ్నలు. ప్రభువు లనుగ్రహించినచోఁ జెప్పవచ్చును.

ఈ మాటలు వినినంతనే వీరన యదరిపడినమాట వాస్తవమే. కాని యంతలోనే మనసు కుదుట పరచు కొనినాడు. అహంకార మాతనిలో రేకెత్తినది. తానేమి ప్రతాపునకు బానిసయా ? అసలు తన వలపులాడిని నిర్బంధించి ప్రతాపుఁడు తనకు మహాపరాధము గావించినాఁడు. కావున నాతనియక్రమ కార్యకలాప

మంతయుఁ జెప్పినను దప్పిదము లేదు. ఈ చిన్న కోరిక యే తీర్ప లేకున్న చోఁ, దన్నుఁ గూర్చి యామె యేమను కొనును ? కావున సర్వము నెఱిగింపవలెను. కాని యంతలోనే యాతనికొకించుక చైతన్యము గలిగినది. మాచల మంచిదే. అమాయిక; కాని మందారవల్లి ప్రగల్భ. ఆమె యారహస్య విషయముల నాద్యంతము నెఱుంగుట పథ్యకరముగాదు. కావున మందారవల్లి వినకుండ నామెతోఁ జెప్పియుండిన బాగుండునేమో. కాదుకాదు. మాచలకు మందారవల్లి ప్రాణతుల్యము. ఆమె నెడబెట్టిన నీమెయు నెడబడును. అదియుగాక మాచలకు దెలిసిన విషయము లామెకుఁ జెప్పకుండునా? అట్లు చెప్పరాదని నియమించినచో మాచల తన్నేయను మానించునేమో! పాపము! వీరనదండనాథుఁడు విషమ పరిస్థితిలోఁ బడిపోయినాడు. మాచల మందారవల్లు లొండొరులను జూచుకొనినారు.

మందా:— ఏదో దీర్ఘాలోచనము గావించుచున్నట్లున్నారు. ఈ విషయమింత ముఖ్యమైనదనియు నింతటి దీర్ఘవిచారము నకుఁ దావొసంగుననియును, మా సకియకుఁ దెలియదు. పోనిండు. మిమ్మేల మేము నిర్బంధింపవలెను. మాకుఁ జెప్పరాని రహస్యములు మీకడనుండరాదా యేమి ? మీకడ దాచవలసినవి మాకు లేవుగాని, నిష్కారణ ముగా మీ మనసు నొప్పించినాము; క్షమింపుడు.

వీరన:- ఆ! క్షమించుట కేమియును లేదు. ఇదంతకలవరపెట్టు విషయముకూడ కాదు. మీకడనాకేమి రహస్యములు? రాజకీయమగు నొక కార్యసాఫల్యమునకై ప్రతాపుడు మిమ్ము నిర్బంధించినాడు. అతని కార్యము కొలది రోజులలోనే ఫలించును. ఆనాడాతడు మిమ్ము విడుదల గావించును. ఈలోపుననే, యీరోజుననే. మిమ్ము నేను విడిపింపగలను. కాని యాతనికి నాకునుగల మైత్రి యట్టిది. ఈ స్వల్పవిషయమున కాతని మనసు నొప్పించుటంత భావ్యముకాదేమో అని యోజించు చున్నాను. కాని మీ చెలికంటె నాకాతఁడధికుడుకాడు. కావలె ననిన, మీకీ రోజుననే విడుదల లభించునట్లు గావించెదను. మీ చెలి తన మధుర మందహాస ద్యుతిచే నా భవన మలంకరింపఁగలదు.

మందా:- అంత తొందర వలదులెండు. ఈ వారము రోజులలో నేమిపుట్టి మునిగినది మాకుఁగావలసినది స్వేచ్ఛ. అది మీరు ప్రసాదించియే యున్నారు. మాకు సర్వోపచారములు జరుగుచునే యున్నవి. ఇఁక మాకేమిలోటు. మీ రనినట్లీ స్వల్ప విషయమునకై రాజసోదరునితో నందును మీ పరమ మిత్రునతో మీరేల వైరము పెట్టుకొనవలయును? అట్టిది మాకు మాత్రము సమ్మతమగునా? మీ సుఖమే మాసుఖము. మీ యభివృద్ధియే మాయభివృద్ధి. వేయేల. మీ యానందమే మా యానందము. ఏమే చెలీ! నీ వేమందువు?

మాచల:- నేనేమందును? నే ననవలసినమాట లన్నియు నీవే చెప్పినావు. వారి యనుగ్రహమున్నఁ జాలును. మన కెందున్నను రాణివాసమే.

వీరన:- మీచెలి కోపించినట్లున్నది.

మాచల:- నాకేమియుఁ గోపము లేదు. మాస్వేచ్ఛకెట్టి యాతంకమును లేనప్పుడు మాకెచ్చటనున్న నేమి? కాని యిచ్చోటువీడినంతనే మమ్ము మఱతురేమో! ప్రభువులు బహు విషయాసక్తులు కదా.

రన:- ఎంతమాట! నిన్ను మరచుటా! ఈమేనఁ బ్రాణములుండగా వీరన నిన్ను మరువఁజాలడు. ఇప్పుడెన్ని మాటలు చెప్పిననేమి ప్రయోజనము? మున్ముందు నీకే నా మాటలయందలి సత్యాసత్యములు తెలియఁగలవు. (సోములుతో) సోములూ! వీరికి గావలసిన సదుపాయములన్నియు నీవు సమకూర్పవలయును. కించిల్లోపముగూడ నేను సహింపను జుమా! (మాచలతో) మీరీ యుద్యానమున స్వేచ్ఛగఁదిరుగవచ్చును.- ఇందెవ్వరితోనైనను బ్రసంగింపవచ్చును. ఇందలి బందీలతోఁ గూడ మీరు మాటాడుట కెట్టి యభ్యంతరమును లేదు. వారు మాత్రము మీతో నుద్యానవనమునఁ దిరుగ రాదు. నాకు వేళ యతిక్రమించుచున్నది. కొన్ని

యత్యావశ్యకములైన పనులున్నవి. కొలది రోజులు మాత్రమే. అపుడు మీయిష్టానుసారము విహరింప వచ్చును. (నవ్వుచు) నాకును, ఈ కార్యభారములు తొలగును.

మాచల:- తమదయ; మా మానప్రాణములు మీయధీనము-

—: 12 వ ప్ర క ర ణ ము. :—

విరూపాక్షాలయమునుండి దక్షిణముగాఁబోవు బాటపై నొక యశ్వశకటము పోవుచున్నది. అప్పటికి బారెడు ప్రొద్దెక్కినది. విజయనగరమంతయు గజఘటా భటకోటి సంకులమై మార్మ్రోగుచున్నది. విపణి వీథులలోని రత్నాలప్రోవులు బాలభానుని స్వర్ణారుణదీధితిలో మిలమిల మెఱసిపోవుచున్నవి. ఇరువంకల పుష్పలావికలు తమ నర్మగర్భోక్తులచేతను. విలాస విభ్రమములచేతను సరసుల నాకర్షింపుచు మనోజ్ఞ సురభిళకుసుమ రాజములను విక్రయించుచున్నారు. ఆ శకటముగణేశాలయమును సమీపించినది. ఆహా! ఆవిగ్రహమెంత యున్నతము ; ఎంత గభీరము ; ఎంత సుందరము. శిల్పకళా వైదగ్ధ్యమంతయు నిచ్చటనే మూర్తీభవించియున్నదే. ముప్పది యడుగులయెత్తును, అయిదారు గజముల వెడల్పును గల యాలంబోదరుఁ డెన్నియుగ్రాక్తైనను 'తృప్తాస్మి' యనడు కదా ! ఆ యాలయము నతిక్రమించి యాశకటము, దక్షిణము గానేగి, పంపాపుర దక్షిణ ద్వారమును జేరినది. అందుండి యింకను దక్షిణముగా బోయి, నరసింహాపురమును జేరినది.

అందున్న యుగ్రనరసింహాలయమును, శివాలయము నతిక్ర మించి, వీరభటావళి యుండు చంద్రశేఖర పురమును సమీపించినది. ఆశకటము నధిరోహించియున్న వారిరువు పురుషులు. అందొక డిట్లు సంభాషణ కుపక్రమించినాడు.

భీములూ! ఉగ్రనరసింహ విగ్రహమును, జూచితివా? ఎంత భయంకరముగానున్నది. పేరునకుఁదగినట్లు నిర్మించినాడు శిల్పి. అమ్మహాశిల్పి యెవ్వడోకాని రాతిని మైనమువలె నుల్చి నాడు. హిరణ్యకశిపు వధామర్షమున మండిపడుచున్న స్వామి యుగ్రరూపమును మన కన్నులయెదుటఁబ్రత్యక్షీకరింపఁజేసి నాఁడు. ఎంతటి యపూర్వరచనా చాతుర్యము. కరువలితిండి తేనిచుట్టలపై నాసీనుఁడై యున్నాఁడు స్వామి. ఇఁకనా చంద్ర శేఖరుని జూడుము. లింగమెంత యున్నతముగ నున్నదో సుమారు పండ్రెండడుగుల యెత్తుగనున్నది. స్వామి నిత్యాభి షేకమునకై తుంగభద్రానదీ నీరమాలయములోనే ప్రవ హించుచున్నది. ఇట్టి మహాకార్యము లాచరించిన యీ విజ యనగర ప్రభువులెంతటి ధన్యాత్ములు.

"దుగ్గనా! మనముపోవుచున్న పనియేమి? నీవు ప్రసం గించు విషయమేమి?"

దుగ్గన:- ఆఁ చాలునులెమ్ము. ఇట్టి దేవతాప్రసంగము కలికల్మ షనాశనము. లేనిపోనిరాజకీయములలో దిగుట కొంచ వితోఁదలగోకి కొనుట.

భీము:- అదియంతయు మనకప్రస్తుతము. కవిసార్వభౌము లాజ్ఞాపించినట్లు గావించుటయే మనవిధి. కాఁగాదనుట మన తలకుమించిన పని. ఇంతకును మన మిప్పుడు పడి పోవుచున్న కష్టమేమియును లేదు కదా !

దుగ్గన:- లేకేమి ? చదువు సంధ్యలుమానుకొని మనకేల యీగమనప్రయాసము. మా బావతోఁజెప్పివైచెదను.

భీములు:- ఏమి చెప్పెదవు.

దుగ్గన:- నే నీయూరనుండఁజాలనని. మా యక్కకు గూడనదియే యభిప్రాయము. ఈ పట్టణము విషయలంపటులకే గాని, మా వంటి యాధ్యాత్మిక చింతగల వారికిఁగాదు.

భీము:- ఓహో ! ఇప్పుడేకదా దేవతాసంకీర్తనము గావించినావు. నీవు నిజముగా విషయపరాఙ్ముఖుడఁవే. కాని యిప్పుడిప్పుడే యీ పట్టణములోని శిల్పకళానైపుణ్యమును బాగడినావే. ఇంతలోనే విరక్తియా నీవు కవిసార్వభౌమునకుఁ దగిన శిష్యుఁడవు కావు.

దుగ్గ: ఏల ?

భీము:- నీ బుద్ధికి నిలుకడ చాలదు.

దుగ్గ:- పోనిమ్ము. నేను గూడ నాయనగారి శిష్యత్వమునకు స్వస్తి చెప్పవలయుననే యోజించినాను. రెండు మూడు రోజులక్రితము నేనీ మాటననగా, ఆయన నొకక్క చిఱునవ్వునవ్వి యూరకొనినాఁడు.

భీము:- (ఆశ్చర్యముతో) ఏమంటివి? మీ గురుత్వమే నాకు వలదంటివా? ఎంత ధైర్యము! ఎంతటి యవినయము!

దుగ్గన:- ఇందు ధైర్యమున కేమున్నది. అవినయమున కేమున్నది. నాకేమి భయమా? నాకుఁదోచిన మాట చెప్పినాను. ఏమైనను నా కాతని మార్గములు నచ్చవు.

భీములు:- వెఱ్ఱివాఁడా! నీకింకను జిన్నతనము వదలినదికాదు. తన చిన్నిమఱది వి కదాయని శ్రీనాథ భట్టారకులు నిన్ను ముద్దు చేయుచున్నారు. నీవు కడకు మొద్దుగా మారుచున్నావు. సాధారణముగా నిట్టి సందర్భములో బాగుపడుట యరుదు. కాని కవిరాజు లఘుటనఘుటనా సమర్థులు. ఆయన యాశీర్వాదబలముండినఁజాలు నఖిల విద్యలు కరతలామలకములగును. చూడఁజూడ నీ మూర్ఖత నాకాశ్చర్య విషాదములను గలిగించు చున్నది. ఈ రారాజులతోడి పరిచయము, ఈ మహా మంత్రులతోడి మైత్రి, ఈ పండిత ప్రకాండులతోడి గోష్ఠి, ఈ మహారాజభోగములు, వేయేల, యీనాటి నీ మధురమహనీయ జీవనమంతయుఁగవిసార్వభౌముల తోడి బాంధవ్యఫలమేకదా! ఆయన యనురాగ భాగ్యమే లేనిచో నీకింతటి మహనీయుల దర్శన భాగ్య మబ్బియుండునా? ఇంతకును నీవు పూర్వజన్మమున మహాపుణ్యముఁ జేసినావు. కావుననే నీ యాటలిట్లు సాగుచున్నవి. ఆయన నిన్ను తన యంకతలమున నిడు

కొని యుపలాలించినాఁడు. నీవు తప్పటడుగులు వేయుచుండగాఁగని యానందించినాఁడు. నీ యస్పష్ట వాక్యముల విని మురిసినాడు. నీ భాగ్యవశమున నా యన కింతవఱకును బుత్రోదయము కూడ లేదుకదా ! మీ యక్కగారిమాట చెప్ప నేయక్కర లేదు. ఆమెకు నీవు చిన్నితమ్ముడవు. ఇంక నీ వాడినదే యాట; పాడినదేపాట. లేకున్న, మహామంత్రులును, మహాపండితులును, మహాకవులును, జంకుగొంకులు లేకుండ, శంకాతంకములు లేకుండ, మాటలాడజాలని శ్రీనాథకవిసార్వభౌములతో నిట్లసంగతముగ మాటలాడుట కెన్ని గుండెలు కావలయును ?

దుగ్గన:- (ఆశ్చర్యముతో) భీములూ! మా బావ అంత గొప్పవాడా ? ఆమధ్య నాతో నాతడేదో పలికినాడు. నేనంతగాఁ జెవియొగ్గి వినలేదు. ఇంటికిఁ బోగానే యాతని క్షమింపుమని వేడికొందును.

భీములు:- ఆతనిని నీవు వేడుకొననేల ? నీ వనని నాతని కపారమగు ప్రేమము. లేనిపోని పెడబుద్ధులుమాని, నీకు నీ భాగ్యవశమున సంప్రాప్తించిన యీ మహావకాశమును వదులుకొనకుము.

దుగ్గన:- భీములూ ! నీవు మా బావ నెంతకాలమునుండి యెఱుఁగుదువు ?

భీములు:- మీ బావగారును నేనును, ఒక యూరనే పుట్టి పెఱిగినాము. చిన్ననాటి స్నేహితులము. మీ బావగారాగర్భ శ్రీమంతులు. చిన్నటనాటనుండియు మహాప్రతిభాశాలి. పండ్రెండేండ్ల వయసునకే కావ్యనాటకాలంకారములు పూర్తిచేసినారు. పదునారవయేటికే మరుత్తరాట్చరిత్రయు, శాలివాహన సప్తశతియు రచించిరి. నాకు చదువంతగా నబ్బినదికాదు. కాని యాయన యనినఁజిన్ననాటినుండియు మహాగౌరవము. కమలనాభామాత్యులు నన్ను బుత్రతుల్యునిగఁ బ్రేమించెడివారు. మారనగారికిని భీమాంబగారికిని నేననినఁబ్రాణము. భీమాంబగారు మహాపతివ్రత. తపస్విని. నాతలిదండ్రులకుఁజిరకాలము వఱకు బిడ్డలు లేరఁట. అంతట నామెయొకనాడు మంతోదకమిచ్చి యేడాది తిఱుగులోగా మీకుఁబుత్రుఁడుదయించునని యాశీర్వదించినదఁట. ఆ యాశీర్వాదఫలముగానే నేను బుట్టినాను. కావుననే నన్ను మా తలిదండ్రులామహాసాధ్వి పేరనే పిలువఁజొచ్చిరి. మా నాయన యంతగా ధనవంతుఁడు గాడు. కమలనాభామాత్యు లప్పుడప్పుడు మా నాయనకు ధనసాహాయ్యము సేయుచుండిరఁట. నా తలిదండ్రులు నన్ను కవిసార్వభౌముల కప్పగించినారు. నాకుఁ జదువంతగానబ్బక పోయినను, వారి యనుగ్రహమున్నది గాన నిప్పటి కీస్థితికి రాఁగలిగినాను.

దుర్గన:- నీకు మడిమాన్యములును, దోటలు దొడ్లును గలవని మా యక్క నాతోఁ జెప్పినది.

భీములు:- అవినాకు పిత్ర్యములు కావు. నా భాగ్యమంతయు నాపుణ్య దంపతుల యనుగ్రహ ఫలమే.

దుర్గన:- ఓహో! మా బావకు దానగుణము కూడ కలదా. ఆయన యార్జన మాయన భోగములకే సరిపోదను కొనుచున్నాను.

భీములు:- వెఱ్ఱివాఁడా! ఆ మహనీయుఁడొక్క రోజార్జించిన ధనము, నీవంటి నావంటి వారికి జీవితాంతమును నిశ్చింతగాఁ గాలముగడుపుటకు సరిపోవును. ఆయన యార్జించిన ధనమే ప్రోగుపెట్టినచో నొక మహాపర్వతమంత కాఁగలదు. కాని యేనాటి దానాఁడే వ్యయమగును. ఆయన చేయు దానములన్నియు గుప్తదానములే. అవి యెఱిఁగినవారు ముప్పురే. దాతయుఁ బ్రతిగ్రహీతయు నీశ్వరుఁడును. ఆయన యనుగ్రహమున నిరుపేదలగు మహాపండితులెందరో లక్షాధికారులైనారు. అగ్రహారములను శాశ్వతభోగములుగా ననుభవించుచున్నారు.

దుర్గన:- నీవు నొకమంచి యగ్రహారమును సంపాదింప లేకపోయితివా ?

భీములు:- ఆ! నీవును నేనును గలసి యొక్కనాఁడే యగ్రహారమును సంపాదించుట. ఎంతటి యభిమాన మున్నను, మీ బావగారపాత్రదానమున కంగీకరింపరు. నేనేమి మహాకవినా ? మహాపండితుఁడనా ?

మగ్గన:- నీవిన్ని చెప్పుచున్నావుగాని మా బావయిప్పటి కొక్క యగ్రహారమును గూడ సంపాదింపలేదు. తుదకు నీకున్నపాటి భూవసతియు నాయనకు లేదు.

భీములు:- ఆ విషయము కొంచెమాలోచింపవలసినదే. ఆయన గూడ నిందు పొరపడుచున్నారేమోయని నాకప్పు డప్పు డనుమానము కలుగుచుండును. లేవను మాటయే మఱచి ధనవ్యయముచేయుట, అంతగా నుచితమని చెప్పజాలము. కాని యీపాటి లౌకికజ్ఞాన మాయనకులేదని చెప్పజాలముకదా! ఏదియెట్లున్న నట్లే జరుగును. ఆయనకు నీతులు చెప్పుటకు మన మెంతటివారము. ఇంతకు నొక్క విషయమును మనము మరువరాదు. (శ్రీ) నాథునివంటివారు కారణజన్ములు అట్టివారి జీవితములఁ గేవల మనుభవ జన్మలమగు మనము మనకొలత బ్రద్దలతో గొలుచుటకు యత్నించుట సాహసమని నాయభిప్రాయము. ఆ మహా ప్రవాహమెన్ని కేదారములను బండించునో; ఎన్ని గ్రామములను ముంచివేయునో; ఏయే మరుభూములను సారవంతముగఁ జేయునో; ఏ ఎడారిలోఁ దుద కంత రించునో; మనము నిర్ణయింపజాలము. తుదకాయన జీవితమార్గము నాయనయే యిదమిత్థమ్ముగా నిర్ణయింపఁ జాలఁడేమో. కారణజన్ముల జీవితములట్టివి. ఏదో దివ్యమగు మహాశక్తి వారియంతరాత్మ నావేశించి, వారిచే సకల కార్యముల నాచరింపఁజేయుచుండును.

ఇట్లు వారు మాటలాడుచుండగనే, వారిశకటము, అక్కచెల్లెలు గుండ్లను సమీపించినది.

దుగ్గన:- భీములూ! ఈ గుండ్లేల యిచ్చట నున్నవి?

భీములు:- ప్రౌఢదేవరాయలు పూర్వకాలపు యుద్ధపద్ధతులను గొంచెము మార్చినాడు. పూర్వము కత్తులు కటారులు, బల్లెములు, బాకులు, మొదలగువానితోనే యుద్ధము చేసెడివారు. ఇప్పుడు ఫిరంగియను నొక క్రొత్త యాయుధము వచ్చినది, దాని నుపయోగించు విధము మనవారి కింకను బాగుగ నలవడలేదు. దానిని బుడతకీచులే ప్రయోగింతురు. దాని నీగుండ్ల లోనుంచి, శత్రువులపైఁబ్రయోగింతురు. అది యగ్ని గోళముల వర్షించును. దానిధాటి కెవ్వరును నిలువఁజాలరు.

తరువాత నా శకటము కొన్ని మహాభవనముల నతిక్రమించి, పాతాళ శివాలయము దరికేగినది.

దుగ్గన:- ఇదేమి? భీములూ! ఇచ్చట నింతలోతుగా నెవ్వరాలయమును గట్టినారు?

భీములు:- ఇది పాతాళ శివాలయము. సుమారేడాది కెనిమిది మాసము లీగర్భాలయము నీటిలోనే మునిగియుండును. వేసవియందు మాత్రమే యిది యెండియుండును. ఇది బుక్కరాయల కాలమున నిర్మింపఁబడెనని యిచ్చటి ప్రజలనుచుందురు.

మఱికొన్ని సుందర భవనముల నతిక్రమించి వారి శకటము పోయినది. పోయిపోయి యొక రమ్యమగు సభామంటపము నెదుట నిలచినది ఆ సభామంటపము చంద్రకాంత శిలానిర్మితము; దారుస్తంభమయము, చిత్రవిచిత్ర తోరణాలంకృతము; మనోజ్ఞ ముక్తాహారాభిరామము. చారుచిత్ర విరాజితము. ఆ సభామంటపమున నొక యున్నత వేదికపై మహామంత్రియు సర్వసేనాధిపతియునగు లక్ష్మణ ఒడయ రాసీనుడై యుండెను. ఉభయపార్శ్వములఁ దటిల్లతలఁబోలు నంగనామణులు వింజామరలు వీచుచుండిరి. ఇరువంకల వేత్రహస్తులు బారులు తీరినిలిచియుండిరి. పార్శ్వము రాజకీయోద్యోగులు పరివేష్టించియుండిరి. కొందఱు మనుజులు సాగిలబడి మ్రొక్కి, కానుకలనర్పించి, లేచి, యంజలి ఘటియించి, తమతమ తగవులను విన్నపము చేసికొనుచుండిరి. కొందఱు దూరముననే నిలిచి యామహామంత్రి తీర్పుల నాలించుచుండిరి.

మహామంత్రి యించుక పొడవైనవాడు. కండలు దేఱి, పసిమి వన్నెతో నిగనిగలాడు నాతని బాహుద్వయమును, విశాల వక్షస్థలమును నాతని వీరత్వమునకుఁ దార్కాణములై యుండెను. విశాలము నున్నతమునగు నాతని లలాట మాతని బుద్ధికుశలతను వ్యక్తముచేయుచుండెను. వెడదలయ్యు సుతీక్ష్ణములగు నాతని కన్నులు, ఆతని సూక్ష్మపరిజ్ఞానమును, మానవ మన స్తత్వ గ్రహణ సామర్థ్యమును దేటదెల్లము చేయుచుండెను.

అనర్ఘ మణికుండల మండితములును, సువిశాలములును, అగు నాతని కర్ణములు, ఆతని ధర్మపరత్వమును బ్రకటించుచుండెను. ఆతనికన్నులలోనేదో యొక దివ్య తేజః పుంజముగలదు. ఆతని మాటలలో దుందుభి ధ్వానమువంటి యొక గభీరత గలదు. ఆతని ముఖములో నొకవిధమగు ప్రసన్నత గలదు. ఆతని జూచినంతనే యెంతటి యుద్ధతుండును నమ్రుండు గాక తీరదు; ఎంతటి గభీరుండును హృదయ మర్పింపక తీరదు. ఆతండు హాలాహలమును, అమృతమును, గర్భమున ధరించిన కలశ పాథోరాశి.

మహామంత్రి సభాభవనమున కెదురుగ, నొక విశాలమగు చావడి గలదు. అందు కరణములు లెక్కలు వ్రాయుదురు. రాజ్య సంబంధములగు నన్ని వ్రాతలును అందు వ్రాయంబడుచుండును. పరిచారకులు పరువులు వెట్టుచు నిటునిటుం దిరుగుచుండిరి.

అశ్వ శకటమా చావడి ముందేయాగినది. దుర్గనయు, భీములును శకటమునుండి క్రిందకు దిగి, యొక సేవకుని గాంచి, శ్రీనాథ కవిసార్వభౌములకడనుండి యెవ్వరోవచ్చినారని, మహామంత్రులతో నవకాశము చూచుకొని విన్నవింపుమని, చెప్పిరి. ఆ సేవకుండును ద్వారగతి నేగి, మహామంత్రికడ ముకుళితకరకమలుండై, కవిసార్వభౌములకడనుండి యెవ్వరో తమ దర్శనార్థమువచ్చి వాకిట నిలచియున్నారని మనవిచేసెను. వారిని లోనంబ్రవేశపెట్టుమని, మహామంత్రి కనుసంజ్ఞలోడనే

వాని కనుజ్ఞ యిచ్చెను. సేవకుఁడు పరుగు పరుగునఁబోయి వారితో, మహామంత్రి యనుజ్ఞ యయినదని చెప్పెను. అంతట వారిరువురును రెండమగఁలు ముందునకు వచ్చిరి.

దుగ్గన :- భీములూ ! నేనెందులకు ? నీవే పోయి బావగారి లేఖ నాయనకీయ రాదా !

భీములు:- అట్లుగాదు, నీవే పోవలయును. నేనొక్కడనే పోయిన నిఁక నాగోత్ర నామధేయములన్నియు వారికిఁజెప్పి, తొలుత వారికి నాయెడ నమ్మకము గుదురునట్లు కావింపవలయును. ఇంతకు వారికి నీవపరిచితుఁడవు కావు. నీకింతబిడియమెందులకు. రమ్ము. భయములేదు. ఆలస్యమునకిది తగుణముకాదు.

ఇట్లనుచు భీములాతని చేయిపట్టుకొని నడిపించుకొని పోయెను. మహామంత్రి యనతి దూరమునందేయున్న వారిని చూచి చిరునవ్వుతో

"ఓహో! దుగ్గనా ! ఏమోయి ! అంత సిగ్గు బడుచున్నావు. మీ బావగారు నిన్నంతఃపురములో దాచియుంచవలసినది, పౌరబడి రాజాస్థానములలోఁ ద్రిప్పుచున్నారు.

అచ్చటనున్న సభ్యుల చూపులన్నియు నొక్కమారే దుగ్గనపైఁబడినవి. మహామంత్రి యింతచనవిచ్చి యెవ్వరితోను మాటలాడుట వారెరుగరు. ఎవ్వరీ యదృష్టవంతుఁడని యాతని వైపొక్కమా రందఱు తిరిగిచూచిరి. చూచినంతనే వారి యాశ్చర్యమునకు మేరలేదు. ఆతఁడొక మహారాజుకాడు;

రాజకుమారుఁడునుగాడు; దండ నాథుఁడుకాడు; మహా వీరుఁడసలేకాడు. ఊన షోడశవర్ష ప్రాయుఁడగు నొకబాలుడు. ఏమాశ్చర్యము? మూర్ధాభిషిక్తులను గూడఁ దానుగా ముందు పలుకరింపని మహామంత్రి, యీబాలునితో వింతచనువుగా మాటాడుచున్నాడే.

ఈ పలుకరింపుతో దుగ్గనకు మాత్రము కొంచెమూ పిరియాడినది. మహామంత్రి పెద్దపులికాడు. భయములేదు. మరల మహామంత్రియే యందుకొనినాఁడు.

"ఏమయ్యా! ముగ్ధవలె మాటాడవేమి? కవిసార్వభౌములగు మీ బావగారు కుశలమేకదా?"

ఓహో! ఇదియా సంగతి. సభ్యుల కారహస్యము తేటతెల్లమైనది. ఈబాలుడు శ్రీనాథకవిసార్వభౌముల సుఁడది. అందులకే మహామంత్రుల కింతటి యనురాగము. సభ్యులందఱు నొండొరుల చూచుకొని నవ్వుకొనినారు. మహామంత్రులమాట సత్యమే. ఆబాలుఁడంతటి రూపసియే. భీములు దుగ్గన కొకింత గోకినాఁడు. దుగ్గనకు కొంతధైర్యము కలిగినది. కర్తవ్యము గుర్తువచ్చినది.

దుగ్గనః- మా బావగారు మీకడకే పంపినారు.

మహామంత్రిః- (నవ్వుచు) ఔను; నీవును నాకడకేవచ్చితివే. ఎంత చిత్రము.

సభ్యులందఱు పక్కున నవ్వినారు. దుగ్గనకు మరి నోటమాట వచ్చినదికాదు. అవనతముఖుఁడై యట్లే నిలువఁబడినాడు. అంతట నొక సభ్యుఁడిట్లుపలికినాఁడు. "అట్లుమూగవై యూరకుందువేమి ? కవిసార్వభౌము లేమి చెప్పినారో మనవి చేసికొనుము. (భీములువైపుచూచి) ఏమయ్యా ! నీవు నట్లుచూచెద వేమి ? ఆ బాలుఁడు భయోద్విగ్న మనస్కుఁడైయట్లున్నాఁడు. నీవే మనవి చేసికొనుము"

మహామంత్రి:- మా దుగ్గన సామాన్యుఁడని మాయభిప్రాయము కాబోలు. మఱొక రెండు మూడేదు లోపికపట్టుడు. అతఁడుగూడ వారి బావగారిని మించిన కవిత్వమును జెప్పును. అప్పుడాతడు గూడ నాస్థానములలో నసర్గళ ధాటిని బ్రకటించును.

ఈ మాటల సందడిలో దుగ్గన కొంచెము తెప్పిరిలినాడు. మరల భీము లాతనిని మునుపటివలెనే హెచ్చరించినాఁడు.

దుగ్గన:- ఈ లేఖను మా బావగారు తమకిమ్మని చెప్పి పంపినారు. (అందిచ్చును)

మహామంత్రి:- అమ్మయ్య ! బ్రతికినాము. ఏదీ ఆ లేఖ నిటుదెమ్ము.

ఒక పురుషుడద్దాని నందుకొని మహామంత్రుల కందిచ్చినాఁడు. ఆయనయు నందలి యక్షరముల పొంక మును గమనింపుచుఁ జదివినాఁడు. చూచుచుండగనే మహామంత్రి వీరన మండలము గభీరమైనది. అంతయు నొక్క నిముసములోఁ జదివి; తలయూపి "సరే; దుగ్గన! మీరుపొండు. అన్నట్లడుగ మరచినాను (భీములువైపుచూపి), ఈతడెవ్వరు?"

దుగ్గన:- ఈతని భీములందురు. మా బావగారి బాల్య స్నేహితుఁడు.

మహామంత్రి:- అట్లా; సరేమంచిది; మహారాజ సందర్శనము చేసి, వెంటనే నచ్చటికి వచ్చుచున్నానని, మీ బావ గారితోఁ జెప్పుము.

దుగ్గనయు భీములును, అచ్చటినుండి మరలివచ్చి, యశ్వశకటము నధిరోహించిరి. శకటము కదలినది. కొంతదూరము నడచినది. దుగ్గన యొక్క దీర్ఘనిశ్వా సమువిడిచి,

"అమ్మయ్య! నాకిప్పుడూపిరియాడుచున్నది. ఆయన ముందర నా ప్రాణములే పోవుననుకొంటిని"

భీము:- అట్లందు వేమి? మహామంత్రులంత చనవిచ్చిమాటాడిరే?

దుగ్గన:- అవు నామాట వాస్తవమే. కానియాతని జూచినం తనే నాకు భయకంపములుదయించినవి. ఎంత గాంభీ ర్యము వహింతమన్నను హృదయము నీరైనది.

భీములు:- అదినిజమే. నేను నమ్మలేతిని. అనేకులిట్లే చెప్పు చుందురు.

దుర్గన:- నిజమే; ఆతని ముఖము వీక్షించినంత మాత్రమున, నాతనియెడ భక్తితాత్పర్యములు గలుగును.

భీము:- ఆతఁడొక మహాపురుషుఁడు.

దుర్గన:- నిస్సందేహముగ

13 వ ప్రకరణము.

రాత్రి సుమారు జామున్నర గడచినది. విద్యానగర మప్పుడే మాటుమణుగుచున్నది. కాని యచ్చట మదనుఁడు కొలువుఁదీర్చియే యున్నాఁడు. విటవిటీవర్మగర్భ సంభాషణ ములును, బానోన్మత్తుల వికటాట్టహాస ప్రలాపములును, జూదరుల పందెపు బింకములును, నడుమనడుమ రక్షకభటుల యదలింపులు నా ప్రశాంత వాతావరణమునకు భంగమును గల్పించుచునే యున్నవి. అట్టి సమయమున వీరన తన రమ్య హర్మ్యమున మనోజ్ఞమృదుల పర్యఙ్కమునఁ బవళించి యున్నాఁడు. ఆతఁడు నిద్రించుచుండుట లేదు. అట్లని జాగరూ కుఁడును గాదు. సగము తెలివి; సగము నిద్ర— ఒక విధమగు మాంద్యావస్థలో నాతని సర్వావయవములు నున్నవని చెప్ప వచ్చును. ఆతని మస్తిష్కమునఁ దరంగములవలె వివిధ భావ ములు పుట్టుచున్నవి. అణగుచున్నవి. ఆ భావము లెంత వఱకుఁ బోవును? వాని పరిణామ మేమి? అవి యన్యోన్యాశ్రయ

ములా? పరస్పర విరుద్ధములా? అను ప్రశ్నముల కాతండు తన మనస్సులోఁ దావిచ్చుట లేదు. ఆతఁడచంచలుఁడై యున్నాఁడు. భావ పరిభ్రమణమును నిరంతరమై యట్లే యున్నది.

అనతి దూరముననే యొకదీపము తేజః పుంజమును విరజిమ్ముచున్నది. కాని యా తేజమాగది యంతట నావరించి యుండలేదు. మూలమూలలఁ జీకటులు దాగుకొనియే యున్నవి. ఇంచుక వాయు సాహాయ్యమే లభించినచో నవి యాదీపమును, గబళించి, విజృంభింపఁ దఱి వేచియున్నవి. కాని వానికప్పటి కాయదృష్టము పట్టలేదు. దీపకాంతు లప్రతిహతముగనే యున్నవి. అంతలో వీరన యులికిపడి లేచి నాడు. నిజముగా నాతని సమాధికి భంగము కలిగినది. ఆతని కర్ణపుటముల కెద్దియో చప్పుడు వినవచ్చినది. మంజు మంజీర శింజినీ స్వనము, మణికంకణ స్వర్ణనూపురారవ మాతని కర్ణ కుహరముల సోకినది. ఆతఁడు కనువిచ్చి నలువంకలఁ జూచి నాడు. తన పర్యంకమునకుఁ జేరువనే యొక సుందరాంగి నిలిచి యుండుటను గమనించినాఁడు.

ఆ జవ్వని సర్వాభరణ భూషితయై యున్నది. ఆమె కొప్పున గులాబులు గుమగుమలాడుచున్నవి. ఆమె మేనిచాయ నలుపనియే చెప్పవచ్చును. కానియది నిగ్గులు దేఱి యింద్రోపల కాంతిచ్ఛటల నీనుచున్నది. ఆమె కన్నులంతగా విశాలములు కావు. కాని యవి లే నిగారంపుఁ బిత్తరి తళుకుఁ జూపులచేఁ

దళత్తళల నీనుచున్నవి. ఆమె నాసిక సుందరమైనదేకాని యించుక పెద్దది. సామాన్యముగఁ గవులు వర్ణించు దొండపం డామె యధరమునకు సాటిగాదనియే చెప్పవచ్చును. చిఱునవ్వు తోడి యామె పెదవులు, విటజనహృదయముల నారని చిచ్చును రగులఁగొల్పుననుట, యతిశయోక్తి కాదు. ఆమె చూపులు చంచలములు; నడక చంచలము; హృదయము చంచలము; భ్రూవిన్యాసము చంచలము. ఆమె పేరును జంచలయే.

ఆమెను జూచినంతనే వీరన తొలుదొల్త కొంచె ములికి పడినాఁడు. కాని యంతలోనే తెలివొంది, "చంచలా! ఏల యింత రాత్రివేళ నిచ్చటికి వచ్చితివి?" అని ప్రశ్నించినాఁడు.

ఆ ప్రశ్న మామె కర్ణ రంధ్రములఁ బడీపడుటయే తడవుగా నామె మోముదమ్మి ముకుళించినది; నేత్రము లరుణా రుణములైనవి; పెదవు లించుక చలించినవి. కాని యామె నోట నొకమాటయైనను వెలువడదాయెను. అట్లే నీరవయై నిలచి యున్నది. వీరన మరల నామె నా ప్రశ్నయే వేసినాఁడు. ఆమె యప్పటికిని మాటలాడలేదు. వీరనకు మత్తు బాగుగ వదలిపోయినది. ఆమె మౌన మాతనికి గోపకారణమైనది. అంతట.

" ఏ మట్లు మాటలాడక నిలచెదవు? నీకేమైనఁ బిచ్చి యెత్తినదా? చెప్పుట కిద్దియును లేనిచో నీ గృహమును వీడిపొమ్ము" అని గర్జించినాఁడు.

వీరన పలుకుల నామె యాలించినది. ఒత్తుకొని వచ్చు క్రోధోద్రేకము నణచుకొనుచు నిట్లు సమాధాన మిచ్చినది.

" మీధర్మమాయని నాకింతవఱకు, బిచ్చి మెత్తలేదు. మీ మాటలు వినుచుండిన నింక నెత్తునేమో చెప్పఁజాలను. నీ వెందులకిచ్చటికి వచ్చినావని కదా మీరు నన్నడుగుచున్నది. ఆ ప్రశ్నకు నేనేల సమాధాన మీయవలయును? మీకుఁదెలియదా? ఇంతకుముం దెప్పుడైన మీరు నన్నిట్టి ప్రశ్ననడిగి యున్నారా? మున్నెందులకు వచ్చెడిదాననో యిప్పుడు నందులకే వచ్చినాను. ఏ మంత పరాకుసామీ!

వీరన:- పరాకేమియును లేదు. నే నిప్పుడు బహు క్లిష్టములగు రాజకీయములలోఁబడి కొట్టుకొనుచున్నాను. ఇప్పుడు నీతో నాకు మాటాడుటకుఁ గూడ నవకాశము చాలదు.

చంచల:- అట్లా; నే నావిషయము నెఱుఁగను కాని పూర్వమిట్లెన్నఁడును జరిగియుండలేదు. ఎంతటి మహాకార్యములందు నిమగ్నులైనను, మీరు నా సాంగత్యమును బాసి యెఱుఁగరు. ఉసిరి నేను లేకున్న మీ మనసు, ఉత్సాహ పూరితము గాదనియు, గార్యనిర్వహణమునందుఁ జురుకుతనము తగ్గుననియు, బలెండి వారు. ఇప్పుడిట్లేల పలుకుచున్నారో నాకుఁ దెలియుట లేదు. ఇప్పటి కించుమించుగాఁ బదునేను రోజులైనది. మీరు కన్నెత్తి నన్ను చూచుటయైనను లేదు. కారణ

మేమిః? మున్నొకరు నాడైనను, నన్ను వీడియుండెడి వారా? ఇప్పుడే మాకు రానేల? నాయందేమైన లోప మున్నదా? లేక ... ...

వీరన:- ఆఁ లేక .... మఱేమి? ఊరకుండు వేమి? సంశ యింప నేల? సమస్యను బూరింపుము?

చంచల:- పూరించుట కేమున్నది? మీకుఁ దెలియని విషయము కాదు కద నేను పూరించుటకు.

వీరన:- (ఎగతాళిగ) నీ బంగారునోట నామాటలు విన వలయునని యున్నది.

చంచల:- (ఇంచుక క్రోధకంపిత స్వరమున) అవును. ఇప్పుడు మీరు నన్నెగతాళి చేయక యేమిచేయుదురు? పండు వంటి కాపురమా భంగమైనది. అన్నము పున్నము నెఱుఁగని యమాయికుఁడగు భర్తయూ దూరమై నాఁడు. తలి దండ్రులు చిన్ననాటనే పోయిరి. తీపి మాటలు చెప్పి, వలచినట్లు నటించి, యఱచేతిలో వైకుంఠమునుజూపి, యఖిలైశ్వర్యములకు నీవే యధి కారిణి వగుదువని నచ్చఁ జెప్పి, మాయమాటల మోస గించి, తుదకీనాడిట్లెగతాళి చేయుటయా? నే నిచ్చటికి వచ్చి యారునెలలైనను గాలేదే? ఇంతలోనే నేనింత చులకన యగుదుననియు నింతలో నేనా పాపమిట్లు బద్ధ లగుననియుఁ గలలోనైన నే నూహింపలేదు. నా వలపున కిదియా ఫలము?

వీరన మొగ మెఱ్ఱవడినది. క్రోధాగ్ని యాతని సర్వావయవముల సముజ్జ్వలింపఁ జేయుచున్నది. చూపులు తీక్ష్ణములైనవి ముకుపుటము లదరుచున్నవి. భ్రూమధ్యము సంకుచితమైనది. కాని యప్పుడు కూడ నాతఁ డుద్రేకము నడంచు కొనినాఁడు.

వీరన:- ఏమి? ఇప్పుడు నీకేమి లోపము వచ్చినది? అన్న వస్త్రములకా? ధనధాన్యములకా? దాసదాసీ జనములకా? నీకేమిలోపము? దీనికై యింత దూరము రానేల? సోములున్నాఁడు కదా! వానిచేఁగబురంప లేక పోయితివా?

చంచల:- పాడు సోములు; వానిపేరుచ్ఛరించిన పాపము. ఎట్టి దుర్ముహూర్తమున వాని మాటల నాలింప చెవి యొగ్గితినో,— నాశీలమును సర్వమును జెఱచుకొంటిని. బంధుకోటి కెడమైతిని. నలుగురినోట 'ఛీ' యనిపించుకొంటిని. ఎన్నియైనను, ఎంతటి యపకీర్తి పాలైనను, మీయండఁజూచుకొని గర్వించియుంటిని. ఎంతటివారిని లక్ష్యము చేయక సంచరించితిని. నా మామగారు నా విద్యా సంపదకు మెచ్చి నన్ను 'విద్యా' అని పిలిచెడివారు. అట్టి మహానీయుఁ డిచ్చటికివచ్చి, ''అమ్మా! ఇట్టి యకార్యమును నీవాచరింపరాదు. ఇది మన యుభయ వంశములకును అపకీర్తి హేతువు. ఇది వాడ వాడలఁ బ్రాకక మున్నే మరల నాతోరమ్మా. ఏదో

చిన్నతనముగావున మాయమాటలు నమ్మి మోస పోయి యుందువు. ఇట్టి చంచల చిత్తులను నమ్మరాదు. నీవంటి యమాయికల నెందఱినో వీరు చెఱచి యుందురు. కామోద్రేక మున్నంత కాలము లేని పోని వలపు లుపచరింతురు. ఆకాశ హార్మ్యములం జూపుదురు. కాని యా యుద్రేక మడగినంతనే యలుక పిడుచకంటె నికృష్టముగాం జూతురు. నామాట నమ్ముము. పండువంటి సంసారమును బాడుచేసి కొన కుము" అని బ్రతిమాలి చెప్పినాడు, కాని యానాడు కండకావరముచే నాకుం గన్నులు కానరాలేదు. పాప పుణ్యములం బరిగణింపక యమ్మహాత్ముని నవమా నించి పంపినాను. నాపాపమీనాటికి బ్రద్దలైనది. ఆ మహాత్ముని మాట లీనాటికి సత్యములైనవి.

వీరన:- సత్యమైనదికద! ఇంక నిటనుండ నేల? నీయిచ్ఛవచ్చిన చోటికిం బొమ్ము. నాకెట్టి యభ్యంతరమును లేదు. అంత యభిమానముం జూపిన మీ మామగారి కడకే పొమ్ము.

ఈ వాక్యము లాలించి నంతనే చంచల కోపము మిన్ను ముట్టినది. ఆమె సర్వావయవములు క్రోధో ద్రేకమున సంచలింపం దొడగినవి. అప్పుడామె కాత నిప్పైంగల మక్కువ యంతయు నంతరించినది. గౌరవ మంతయు నశించినది. క్రోధకంపిత స్వరముతో నామె యిట్లు పలుక సాహసించినది.

చంచల:- అవును; ఇప్పుడు నేనెచ్చటికిఁ బోయిన నీకేమి? దయతో నీవట్టి యనుజ్ఞ యిత్తువని నాకుఁదెలియును. కాని యంతటి పున్నెమునకు నేను నోచుకొనలేదు. కులస్త్రీ మర్యాదను మంటగలిపి కులటనై నీతోలేచి వచ్చిన నేనెట్లు తిరిగి యత్తవారింటికిఁ బోగలను? సన్నిహితేగిన యెవ్వరికైనను నాపాడు మొగమెట్లు చూపగలను? నేనెంత పాపకార్య మాచరించినను, నాకింకను బౌరుషము లేకపోలేదు. కాని యిప్పుడు నేనేమి చేయగలను? నాకు సర్వ ధ్వంసమైనది.

వీరన:- చంచలా! ఎందులకీ యుపన్యాసము. నిన్నిప్పుడు నేనేమి మోసము చేసితిని? ఊరకే యెందుల కాడిపోసెదవు? నీ మనస్సులో నేమియున్నదో స్పష్టముగాఁ జెప్పుము?

చంచ:- పదునేను దినములనుండి మీ రేల పరాఙ్ముఖులై యున్నారు.

వీరన:- ఇంతకుముందే చెప్పితినికదా! కొన్ని రాజకీయములలోఁ జిక్కుకొని యుంటిననియు నందుచేఁ దీరుబడిలేక పోయినదనియు.

చంచల:- అది వట్టి యబద్ధము. ఇట్టి రాజకీయములు మీ కెప్పుడును గలవు. మీ ప్రణయ ప్రవాహ మన్యథా మఱలినది.

వీరన యించుక చలించినాఁడు. ఆడువారికిఁ గర్ణపిశాచి యుండునా యేమి? మాలను దాను వలచినట్లామె యెట్లు గ్రహించినది? సోము లేమైనఁ జెప్పలేదుకద. వాడు త్రాగుబోతు. ఆ మైకములోఁ దన ప్రణయ వృత్తాంతమంతయు నామెతోఁ జెప్పినాఁడేమో. ఇదియా సంగతి. ఇప్పుడు కోపించుట సంభావ్యము కాదు. ఆడువారి కిది నైజగుణమే. ఈమె నెట్లయిన ననునయించి పంపుటయే కర్తవ్యము.

వీరన:- ఓహో! ఇదియా నీ యనుమానము. ఇంత వఱకు నేమో యనుకొనినాను. నీవు వట్టి బేలవు. నీ సౌందర్య విలాస విభ్రమములకుఁ జిక్కిన యీ వీరనకు అన్యథా చింతనమేల కలుగవలయును? మాధ్వీఫల రసాయనము గ్రోలువాని కుప్పనీరు రుచించునా? నీవే చెప్పుము? వెఱ్ఱిదానా! అనన్య సామాన్యమగు నీ సౌందర్యము, నీ జవ్వనము నింకెవ్వరికి గలవు? పూర్వ జన్మమున వీరన మహాపుణ్యమును గావించినాఁడు. అందులకే నీవంటి యతిలోక సామాన్య సౌందర్యవతి యాతనికిఁ జిక్కినది.

ఈ మాటలాడుచునే వీరన మంచమునుండి క్రిందకు దిగినాఁడు. మెలమెల్లగ నామె దరిఁజేరి ముంగురులు సవరింపుచు, బుజ్జగించుచు, మరల నుపక్రమించినాఁడు.

వీరన:- ఇటు చూడుము; నీకేమి లోపము? ఈ సుందర భవనము నీ యది. ఇందలి యనర్ఘ వస్తు సంచయ మంతయు నీయది. వేయేల? ఈ వీరనయే నీవాడు. నీ కేమికావలెనో అడిగి జూడుము? నీ వాంఛితమును దీర్పనినాడు, నా ముఖమును జూడకుము. అంతే కాని, ఊరక నన్ననుమానించిన నేమి చేయగలను?

చంచల:- మీరు రసికులు; నిత్యనూతన ప్రియులు.

వీరన:- (ఇంచుకనవ్వి) నీ మాట నేను కాదనజాలను. నేను రసికుండనే. నూతన ప్రియుండనే. కాని నీ సౌందర్యము నిత్య నూత్నము; నీ జవ్వనము నిత్యనూత్నము; నీ హావ భావ విలాసములు నిత్యనూత్నములు. ఇంక నా కన్యవాంఛ యేల?

చంచల:- నా వాంఛిత మెద్దియైనను మీరు నెరవేర్తురు గదా!

వీరన:- ఓ విస్సందేహముగా.

చంచల:- అయిన మా చలను విడిచి పెట్టుడు. ఆమె యిందు న్నంత కాలము నా మనసు కుదుట బడదు.

వీరన నిశ్చేష్టుండైనాండు. కొంతసేపాతని నోట మాటకూడ వెలువడలేదు. ఆమెకట్టి కోర్కె కలదని యాతండు కలనైన నూహింపలేదు. ఇప్పుడామె కేమని సమాధాన మిచ్చుట? వ్యతిరిక్తమగు సమాధాన మిచ్చిన నామె కాగ్రహము కలుగక మానదు.

మాచల నట్లే యుంపవలెననిన నామె యనుమాన మినుమడించును. వీరనకు ముందునకు, బోయిన నూయి, వెనుకకు భోయిన గోయి. ఆతని కనేక మార్గము లెదుట గోచరించినవి. నిజమాలోచింపగాఁ జంచలపై నాతనికెట్టి ప్రేముడియును లేదు. ఆతని మన సంతయును మాచలపై నున్నది. ఇప్పట్టునఁ జంచల తోడి సాంగత్యము వదలివేయుటయే యుత్తమమని యాతనికిఁ దోచినది. కాని యదియంత సాధ్యమైన పని కాదు. ప్రతాపుని భార్య మోహనాంగి నీమె బాగుగ నెఱుఁగును. ఆమెయు నీమెయు నొక్క యూరనే పుట్టి పెరిగిరి. చంచల తండ్రి నారాయణశర్మ మోహ నాంగి తండ్రియింటఁ బురోహితుఁడు. ఆమెయు నీమెయుఁ గలసి కొన్నాళ్ళు విద్యాభ్యాసముఁ గావిం చిరి. ఇప్పుడు చంచలను వీడిన నామె మోహనాంగితో మొరపెట్టుకొనును. ఆమె ప్రతాపునితోఁ జెప్పను. అప్పుడే విషయ మంతయుఁ దీగతీయ డొంకయంతయుఁ గదలిన చందమగును. కావునఁ జంచలను వీడుట యసాధ్యమగు కార్యము. ఆమె నెట్లో యొప్పించి పంపు టయే యుత్తమకార్యము. కాని యట్లు కావించుట కుపాయ మెద్దియు నాతనికి గోచరింపలేదు. ఏవోకల్ల బొల్లి మాటలు చెప్పి యామె నొప్పింపవలయును. ఈ యాలోచనా సముద్రమునఁబడి వీరన కొట్టుకొను చుండగా, మరలఁ జంచలయే యిట్లు పలికినది.

చంచల:- ఏమట్లు యోజించు చున్నారు? మాయోపాయ ములనన్వేషించుచున్నారా? ఇకఁ బూర్వపు టెత్తులు పారవు క్రొత్తవేవైన యోజింపుఁడు.

వీరన కరిశాలుమంట నెత్తికెక్కినది. కాని క్రోధ మునకది తరుణము కాదు. ఓర్మి వహించి, కపటో పాయమున నామెను మోసగింపవలయును అంతట వీరనకొక మంచి యుపాయము తోఁచినది.

వీరన:- నీ ధోరణి నీదేకాని నామాట నొక్కటియు నాలింపవు కదా! మాయోపాయములు, మాయమాటలు, అని యొక్కటేపాట. మాచల విషయమున నీకిట్టి యను మానమేల కలిగినదో నాకుఁ దెలియుటలేదు. ఆమె నచ్చటికి దెచ్చిన వాఁడను నేను గాను. ఆమెను గారా గారముననుంచినదియు నేను గాను. ఆమెను బ్రతాపుడు వలచినాడు. కొలదికాలములో నాతనిమార్గము నిష్కంటక మగును. అప్పుడామెను బెండిలి యాడు నంట. కావున నీ విషయమున నీవు నిశ్చింతగా నుండ వచ్చును. ఆ కారాగారము నప్పుడప్పుడు పరీక్షించు పని మాత్రమే నాపైఁబెట్టినాఁడు. అంతకంటె నే నేమియు నెఱుఁగను. ఎవ్వరో కిట్టనివారి మాటల నాలించి, నన్నిట్లాడి పోయుట నీవంటి వివేకవతికిఁ దగిన పనికాదు.

ఆతని పలుకులన్నియుఁ జంచల సమగ్రముగ నాలించినది. ఆతనితో నింక వాదించినఁ బ్రయోజనము లేదనియు, వాదించిన కొలదియు నాతఁడేవో కుయుక్తులఁ బన్నుచునే యుండుననియు, నాతని వంచనకుఁ దగిన ప్రతీకారము వంచనయే యనియు, నేదో యుపాయమున నాతనికిఁ దెలియకుండ నా కారాగారమునుండి మాచలను దప్పించుటయే యప్పట్టునఁ జేయదగు పనియనియు, నామె యూహించినది. అట్లాతఁడు సరసంపుఁ బలుకులు పలుకుట తన్ను వంచించుటకే యని యామె చక్కగా గ్రహించినది. తొలుత నాతఁడేదో జాగరూకత చాలమినట్లు విరసముగా మాటలాడినాఁడు. లేకున్న నాతని ధోరణియే యదికాదు. ఆతనిది కార్యవాదమేకాని ఖడ్గవాద మెన్నటికినిఁగాదు. ఆతఁడు తేనె పూసిన కత్తి. ఆత్మ వంచనయు జగద్వంచనయు నాతనికి వెన్నతోఁ బెట్టిన విద్యలు. ఈ యూహాలన్నియుఁ జంచల హృదయమున నొక్కమారే మెఱసిపోయినవి. మోసమునకు మోసమే ప్రతీకారము.

చంచల:- మాచలతోడను గీచలతోడను నాకేమి పనిలెండు. మీకు నాపై సంపూర్ణమగు ప్రేమ కలదు. అదియే నాకుఁ బదివేలు. నా కంతకంటె కావలసిన దెద్దియును లేదు.

వీరన ప్రాణము కుదుట పడినది. ఆమెతోఁ బ్రేమాలాపములాడ నుత్సహించినాఁడు. కాని చంచల యానాడు ప్రేమాలాపములు వినుటకు రాలేదు. ఆమె హృదయ మన్య

కార్యాసక్తమై యున్నది. కావుననే యాతని వారించి, యామె
" ఈ ప్రేమాలాపములకేమి లెండు. నేనెచ్చటికిఁ బోవుదును.
మీరెచ్చటికిఁ బోవుదురు. మీరేదో కార్యాంతరాసక్తులరై
యున్నట్లున్నారు. మరల వచ్చెద"నని పలికి క్షణములో
నాతని విడిచిపోయినది. ఆమె తనగదిదాటి కొలదిదూర మేగి
నంతనే వీరన తన పాన్పుపైఁబడి నిట్టూర్చి " అమ్మయ్య!
శని వదలినది." అని పలికినాఁడు. తరువాత నానాటి చిత్త
విక్షోభ మడంగుటకై యొకింత మద్యమును గ్రోలి శయ్యపైఁ
బవళించినాఁడు.

14 వ ప్రకరణము.

వీరనకును జంచలకును జరిగిన సంభాషణమును బట్టి
మా చదువరులు చంచల పూర్వ వృత్తాంతమును గొంతవఱ
కైన నూహించియే యుందురు. కాని చంచలా పూర్వ వృత్తాం
తము సంపూర్ణముగ వివరించుట మా విధి.

చంచల యొక యుత్తమ బ్రాహ్మణవంశమున జనించి
నది. ఆమె తండ్రి నారాయణశర్మ; తల్లి జగ్గమ్మ. ఆ దంప
తుల కామె యొక్కతెయే సంతానము కావున నల్లారుముద్దుగఁ
బెరిగినది. ఆమె మొదటిపేరు మంగమ్మ. ఇంట నామె
యాడినదేయాట; పాడినదే పాట. అట్లు పదేండ్లు గడచినవి.
అంతట నామె తల్లి విషూచిజాడ్యముచే మరణించినది.
ఆమె మరణించిన కొలదికాలమునకే భార్యా వియోగమును
భరింపలేక, యామె తండ్రియు మరణించినాఁడు.

నారాయణశర్మ పురోహితవృత్తిచే జీవించుచుండెను. ధనికుల ప్రాపకమును సంపాదించి, విశేష ధనమార్జించినాఁడు. మరణించుటకుఁ బూర్వమాతఁడు తన చిన్ననాటి స్నేహితుడును, విశేష లౌకిక జ్ఞాన సంపన్నుఁడునగు శ్రీధరశాస్త్రిని రావించి, తన యాస్తిపాస్తులన్నియు నాతని కొప్పగించి, తన కూతు నాతని కప్పగించినాఁడు. శ్రీధరశాస్త్రి యుత్తమ బ్రాహ్మణుఁడు; వేదవేదాంగ విదుఁడు. పారమార్థిక చింతగలవాఁడు. నారాయణ శర్మయనిన నాతనికిఁ బ్రాణము కావు. నాతని పుత్రిక యెడ నాతనికిఁ బుత్రికావాత్సల్యమే. నారాయణశర్మ మరణముతో నది ద్విగుణీకృతమైనది. ఆతని పుత్రి నెట్లయిన నభివృద్ధిలోనికిఁ దేవలెనని యాతని యాశయము. అందుల కాతని కొక వరమోపాయము గోచరించినది. తన యేకైక పుత్రుఁడగు నీశ్వరభట్టున కిచ్చి యామెను వివాహము గావింపవలెనని యాతఁడు కృత నిశ్చయుఁడైనాడు. తండ్రి మాట కెన్నడు నెదురాడని యీశ్వరభట్టు వివాహమున కంగీకరించినాఁడు. పండ్రెండేండ్లు పూర్తికాకమునుపే చంచలకు వివాహమైనది. వివాహమైన యొకటిరెండు సంవత్సరములలోనే యామె కాపురమునకు వచ్చినది.

చంచలయుఁ బ్రతాపునిభార్య మోహనాంగియు, జిన్ననాటి స్నేహితురాండ్రని ముందే చెప్పియుంటిమి. మోహనాంగి తండ్రి విక్రమవర్మ ప్రౌఢదేవరాయల తండ్రి కాలమున దండనాథుఁడై మహాప్రసిద్ధిగడించి, యపార ధనమార్జించి, వార్ధకమునఁ జంద్రగిరిలో నివాసమేర్పరచుకొని, యుండెడి

వాఁడు. ఆతనికి లేక లేక వయసు ముదిరిన తరువాతఁ బుట్టిన సంతానము మోహనాంగి. నారాయణశర్మ యాతని శ్రో త్రీతుఁడు. బహు శాస్త్ర పారంగతుఁడైన నారాయణశర్మపై నాతని కపారమగు గౌరవముండెడిది. అన్యోన్య మైత్రిని, వారిరువురి కుటుంబములు నీరక్షీరములువోలె నొప్పెడివి. కావున బాల్యమున మోహనాంగియుఁ జంచలయు, నొక్క గురువునొద్దనే విద్యాభ్యాసము గావించిరి. ఇరువురును నృత్త గీతాదులయందుఁ బ్రావీణ్యము సంపాదించిరి. నైష్ఠికుఁడయ్యు నారాయణశర్మ పుత్రీవ్యామోహమునఁ నట్టి విద్యావ్యాసంగమునఁ దనపట్టికెట్టి యభ్యంతరమును గల్పింపలేదు. బాల్యమున మహాధనికులును, బరమ నాగరకులునగు క్షత్రియుల యిండ్లలో మెలగిన దగుటచేఁ జంచలకు సామాన్య సంసారులనినను, వారిజీవిత విధానమనినను, జిన్నతనముననే నిరసన భావము కలిగినది. తండ్రి మరణానంతర మామె వినుకొండ వచ్చినది. అంతతో మోహనాంగికి నీమెకుఁ గొంత యెడబాటు కలిగినమాట వాస్తవమే. కాని యప్పుడప్పుడు లేఖా ప్రోక్తలు జరుగుచునే యుండెడివి. చంచల కాపురమునకువచ్చిన రెండు మూఁడేండ్లలోనే మోహనాంగికిఁగూడ వివాహమైనది. వివాహానంతర మామె విజయనగర మేగినది. కాని యప్పుడుగూడ, నీమెకు నామెకు నుత్తర ప్రత్యుత్తరములు నడచుచునే యుండెడివి. మోహనాంగి తన యుత్తరములలోఁ దాననుభవించుచున్న యపార భోగ భాగ్యములను, వినోద విలాసములను వివరింపు చుండెడిది. ఆ యుత్తరములు చదివినప్పుడల్ల

చంచలకట్టి జీవితముపై నాసక్తి జనించుటయేకాక, తన యానాటి జీవితముపై విరక్తియుఁ గలుగుచుండెడిది. చంచల భర్త, ఈశ్వరభట్టు, సాంగవేదవేది. పరమ నైష్ఠికుఁడు. శ్రీధర శాస్త్రియు నిష్ఠాపరుఁడే కాని యపార లౌకిక జ్ఞాన సంపద కలవాఁడు. ఈశ్వరభట్టు కేవల ఛాందసుఁడు. చంచల కాతనితోడి కాపురము నరకతుల్యమైనది. కాని యేమిచేయఁ గలదు. ఒకొక్కప్పుడు తన తండ్రియే యుండిన నట్టి సంబంధము చేయునాయని విలపించుచుండెడిది. కాని తన దుఃఖమును దానే దిగమ్రింగవలయును. హృదయ విదారకమగు తన బాధ ఒరులకెరిగింపరానిది. మఱియుఁ దన భర్తపై నామెకు గౌరవము లేకపోలేదు. ఆతని తపోనిష్ఠయు, వివిధ శాస్త్ర పారంగతత్వమును, ఆమె నాశ్చర్య చకితను గావించెడివి. ఆమెయుఁ జదువుకొనినదే కావున నాతనియెడ నామెకు గురుభావ ముండెడిది. భక్తియుండెడిది. కాని యామెవాంఛలు వేరు; ఆతని యాశయములు వేరు. ఈశ్వరభట్టు సుందరుఁడని చెప్పఁజాలము కాని యాతఁడు దృఢకాయుఁడు; సమున్నత దేహుఁడు. కాకపోయినను మరుగుజ్జు మాత్రము కాదు. చిన్నతనమున వచ్చిన మసూచి జాడ్యముచే నాతని ముఖమంతయు గంటులు దేరియుండును. మంచిముహూర్తము లభింపక పోవుటచే నాతని శ్మశ్రుకేశములు తఱచుగాఁ బెఱిగియేయుండును. పట్టుబట్టలుకూడ నాతని మడికిఁ బనికివచ్చెడివి కావు. ఆహార విహారములలో నాతఁడెంత మాత్రము నశుచి నంగీకరించెడి వాఁడుకాదు. తమలము సేయుటయుఁ దలదువ్వుకొనుటయు

సమూల్య భూషణాంబరాదుల ధరించుటయు నాతనికి హేయ కార్యములు. అతని యపార జ్యోతిషపరిజ్ఞానమును, ధర్మ శాస్త్ర విశ్వాసము నాతని నిత్య సాంసారిక జీవనముపైఁగూడఁ దమ ప్రభావమును జూపుచునే యుండెడివి. ఆతడు కావ్య నాటకాలంకారాదులఁ జదివియు నరసికుఁడు; వేదవిదుడయ్యు ధర్మసూక్ష్మ మెఱుఁగనివాఁడు. భోగభాగ్యములు కలవాఁ డయ్యు విరక్తుఁడు. ధనికుఁడయ్యు మహాలోభి. అట్టివానియెడఁ జంచలకెట్టి భావము లుండునో చదువరులే యూహించు కొందురుగాక. ఆతనిపై నామె తన వలపు నిలుపఁ జాలని దాయెనని మాత్రమే మేము చెప్పగలము.

ఇట్లొక నాలుగైదు సంవత్సరములు గడచినవి. వీరనకు వినుకొండలో బంధుగులు గలరు. రాజమహేంద్రవరపు రెడ్ల కడ కేదో రాజకీయపుఁ బనులకొరకు వచ్చిన వీరన, తిరుగు దలలో వినుకొండకేగినాఁడు. వీరన బసచేసిన యింటికిని జంచల యింటికిని అంతగా దూరములేదు. సోములుకూడ నాతని తోడనే యున్నాఁడు. వచ్చిననాడే చంచలయాతనిఁ జూచినది. ఆతఁడు నామెను జూచినాఁడు. చూపులలోఁ జూపులు కలసి నవి. ఒకరి భావము లొకరికి భాషాసాధనము లక్కఱలేకయే యర్థమైనవి. మగనిపై మక్కువలేని చంచల కాతని విలాస చేష్టలమందానందమును గలిగించినవి. ఆతని నాగరక వేష మును గాంచినంతనే యామెకుఁ గోరిక లీరికలెత్తినవి. ఎట్ల యిన నాతనిగూర్చి తెలిసికొనవలెనని యువ్విళులూరుచున్న యామెకు సోములు దైవమువలె గోచరించినాఁడు. ఒకనాడు

తనపతి దేవతార్చనకుఁ బువ్వులుగోయు నెపమునఁ బెరటిలో నడయాడుచు నాప్రక్కబాట నేగుచున్న సోములును గాంచి యామెయే పలుకరించినది. వీరన యాజ్ఞానుసారము సోములు కూడ నా సుముహూర్తమునకే యెదురుచూచుచున్నాఁడు. వారియింట నది యొక్కటియే యేకాంతస్థలమని సోములు ముందే గ్రహించినాఁడు. ఆ వివిక్త స్థలమున నామె యున్నప్పుడామెతో నెట్లయిన మాటలాడి, యిచ్చకములాడి, మచ్చుమందుజల్లి: యామెను వశము గావించుకొని, తన యజమానుని కామ తృష్ణకుఁగానుకగా నామె నర్పింప వలెనని యాతని యాశయము. అడబోయిన తీర్థమెదురైన యట్లామెయే పలుకరించుట, యాతనికి బ్రహ్మానంద సంధాయకమైనది. పిలిచీ పిలుచుట తోడనే, అతఁడామె దరికేగి నిలిచినాఁడు.

చంచ:- ఏమయ్యా! నీవీయూరికిఁ గ్రొత్త వానివలెనున్నావు.

సోములు:- అవును; కాని నీవెట్లిది గ్రహించితివి?

చంచల:- నిన్నీ చుట్టుప్రక్కల నెప్పుడును జూడలేదు.

సోములు:- అదా! మేమీయూరికిఁ గ్రొత్తవారమే మాది విజయనగరము.

చంచల:- యేమనుచున్నావేమి? నీతో నింకెవ్వరైనఁ గలరా?

సోములు:- లేకేమి? మాయజమాని వీరన దండనాథులు లేరా?

చంచల:- (ఆతురత నడచుకొనుచు) మీ యజమానులు విజయనగరమున దండనాథులా?

సోములు:- అవును; అయిన ... ...

చంచల:- ఏమియును లేదు. సార్వభౌమ సోదరులు ప్రతాప రాయల నెఱుఁగుదురేమో యని.

సోములు:- (చకితుడై) ఏమి? నీకాయనతో నేమి పని?

చంచల:- నా కాయనతో నేమియుఁ బనిలేదు. ఆయన భార్య నా చిన్ననాటి స్నేహితురాలు.

సోములు:- మోహనాంగీ దేవియా.

చంచల:- అవునామెయే, ఆమెయు నేనునొక్క కంచమునఁ దిని యొక్క మంచమునఁ బండుకొనినారము. ఒక యూరనే పుట్టి, యొక్కచోటనే పెరిగి, యొక్క గురువు నొద్దనే విద్యాభ్యాసము గావించినారము. ఆమె యదృష్ట వంతురాలు. కావుననే వలచి వలపించుకొనగల మగ నిని జేపట్టి మహారాజభోగము లనుభవించుచున్నది. నే నొక నిర్భాగ్యురాలను. కావుననే యీ యింట దాసినై యున్నాను.

సోములు:- నీవట్లనుకొననేల? తలఁచుకొనిన నిముసములో నీవు సంతటి దానవు కాగలవు. అట్లే భోగభాగ్యముల నోలలాడ గలవు. నీ సౌందర్య విలాస విభ్రమములు

చూచి మనసు నిల్పఁగల మగవాఁడెవఁడు? అయిన నంతటి సాహసము మీవంటివారికడ నుండదు. పోనిండు. నాకేల? ఈ యధిక ప్రసంగము. ఇంక నే పోయెదను.

చంచల:- ఉండుండుము. రెండుమాటలే. మీ రెప్పుడీయూరు వీడుదురు?

సోములు:- సరిగాఁ జెప్పఁజాలను. కాని త్వరలోఁబోవచ్చును.

చంచల:- ఉన్న దినములలోనైన నప్పుడప్పు డగపడు చుండువు కదూ! మఱేమియు బనిలేదు. మా మోహనాంగిని గూర్చి యడుగవలెనని. ఆమెనుగూర్చి యెంత వినినను నాకుఁ దనివి తీరదు. మఱొకమాట. ఎప్పుడు నీ స్థలముననే యీ సమయముననే మఱువకుము.

సోము:- అట్లే.

తరువాత వారెన్నిమోమారు లాస్థలముననే కలసి మాటలాడిరి. పిట్ట వలలోఁ బడినదని తొలిరోజుననే సోములు గ్రహించినాఁడు. వారి ప్రసంగములలో నామె వీరనను గూర్చిన సర్వవిషయములు దెలిసికొన్నది. వీరన రెడ్డి కులమునకుఁ జెందిన వాడనియు, నాతని వీరారెడ్డియనియుఁ బిలుచు చుందురనియు, నాతనివంటి రసికుఁడాంధ్ర కర్ణాట దేశముల నింకొకఁడు లేడనియు నామె గ్రహించినది. తన్నాతఁడు వలచి యున్నాఁడనియు నెఱిఁగినది తన యంగీకారమును

గూడ సూచించినది. సోములే యీ సంధాన కార్యము నతి నిపుణముగా నిర్వహించినాఁడు. తుదకుఁ జంచల యీయూరనే పాపకూపమునఁ బడిపోయినది. తరువాత నొక నిశీథమున మారువేసము వైచుకొని, వీరనతో విద్యానగరముఁ జేరినది. ఆమె యుదంతమంతయు నామె విద్యానగరమున కేగిన కొలది దినములకే యామె భర్తకుఁ దెలిసిపోయినది. పరపురుషునతోఁ బోయిన యామె ముఖము జూచుటకుఁగూడ నాతఁడంగీక రింపలేదు. ఆతని ముందామె నామ ముచ్చరించుటకుఁ గూడ నందఱును భయమందుచుండిరి. కాని యామె మామగారు మాత్ర మామె తండ్రిని దలంచుకొని యామెకొఱకై సర్వ విధముల యత్నించినాఁడు. కాని ప్రయోజనము లేకపోయినది. మోహనాంగి చేతను, ఆమె తండ్రి చేతను గూడఁ జెప్పించి నాఁడు. కాని ప్రయోజన మిసుమంతయు లేకపోయినది.

తనకు వీరనపైనే, ప్రేమగలదనియు, నాతఁడే తన హృదయేశ్వరుఁడనియు, ప్రేమ మూలకముగాని వివాహము వివాహము కాదనియు నామె వారితో వాదించినది. ఆమె విజ్ఞానమంతయు నట్లమార్గమునఁ బోయినందులకై విచారిం పుచు, నామె మామగారామెచేఁ దిరస్కృతుడు నవమానితుఁ డునై, తిరిగి స్వగ్రామమున కేగినాఁడు. మోహనాంగి, ప్రతా పునితో వీరన దుశ్చేష్టలను జెప్పి, యాతని మందలింపుడని కోరినది. కాని యాతఁడామె మాటలను లక్ష్యము చేయలేదు సరికదా యుపరి, వీరన మంచిపనియే చేసినాఁడనియు, నయ్యది తన కమందానందమును గూర్చుచున్నదనియు,

లోకములోని యరసికుల భార్యలను రసికులగుచు రుద్ధరించి యనుభవించుట సత్కార్యమే యగుననియు నుపన్యసింప మొదలిడినాఁడు. ఆతని యా యుపన్యాస ధోరణికి జడిసి మోహనాంగి యూరకొనినది.

లేచి వచ్చిన క్రొత్త రోజులలోఁ జాల భూలోక స్వర్గమునే యనుభవించినది. దినదిన నూత్న భోగములతోడ నామె యీ విశ్వమునే మఱచినది. దివారాత్రములను భేద మునుగూడ మఱచి, యచ్చేడియఁ దన ప్రియునితో, విలాస వినోదములఁ దేలియాడినది. కౌముదీ విలాస భాసురంబు లును గోరకిత కుసుమిత ఫలిత తరుషండ మండితంబులునగు నుద్యానవనముల విహరించినది; పుండరీక మండల మండితంబు లగు లీలోద్యాన వన కాసారంబులఁ జలక్రీడ లాడినది. రమ ణీయ హర్మ్యములఁ బుష్పశయ్యలఁ బవళించి, ప్రియునితో నర్మగర్భ సల్లాపములఁ జొక్కినది. సురభిళ కుసుమ మాల్యాను లేపనముల మురిసి పోయినది. వేయేల—అనన్య సామాన్య మదన సామ్రాజ్యమునే తన కైవసముఁ జేసి కొన్నది.

ఆమె భవనము దాసదాసీ జనములచేఁ గలకల లాడి నది. ఆమె శరీర మనర్ఘ మణిమయాభరణములచే మిలమిల లాడినది. సంతోష పారవశ్యమున నామె ముఖ వికాసము జిగి మీరినది. మాంసాశనాదులచే నామె జవ్వనము బిగి తేఱినది. చింతయును వంతయును లేక, పొంతయును బోరును లేక ఆమె జీవనము నిష్కంటకమై నిత్యనూత్న శోభావహమై

యొప్పారినది. కాని యీ సౌఖ్యమెంత కాలమో నిలచినది కాదు. క్రొత్త రుచి; ప్రాత రోత యను సామెత వీరనయెడ వర్తించి నట్లింకెవ్వరియెడను వర్తింపదు. ఆమెపై నాతనికిఁగల మొదటి మొగ్గరము రానురాను క్షీణింప జొచ్చినది. అనన్య సామాన్యమగు మంచాల రూప విలాసములఁ జూచిన తరువాత నాతనికిఁ జంచలపై ననురాగ లేశమును లేకుండఁ బోయినది. కాని లోకజ్ఞుఁడగు నాతఁడా విషయమును బహిరంగముచేయ డాయెను. మోహనాంగి కామె నెచ్చెలియగుటయే యాతని కామె యెడగల భయమునకుఁ గారణము. నిజముగా మోహ నాంగికిఁ జంచలపై మునుపటి యనురాగములేదు. కాని, యాబాల్య ప్రవర్తితమగు నా స్నేహలత నామె మొదలంటు నఱుక జాలక పోయినది. ఇంతకు నామె ననురూప వరునకిచ్చి పెండిలిచేయని లోప మొకటియున్నది కదా! ఆమె పెండిలికతఁ దలచుకొనినప్పుడెల్ల మోహనాంగి, యామెయెడ కరుణార్ద్రి యగుచుండెడిది. ఆమె తండ్రిని దలంచి నప్పుడుగూడ నామె హృదయ మనుకంపాచలిత మగుచుండెడిది. కావున వీరనఁ జంచలను విడుచుట యసంభవము. ఇంతకు నామె యున్నచో నేమి ప్రమాదము? వీరన యధీనమున నట్టివారెందఱో గలరు. అందఱిలో నీమె యొకర్తె. అని వీరన మొదట సమాధాన పడినాఁడు. కాని యీమె యాదఱివంటిది కాదు. చంచల కులట కాదు. ఆమె వీరనను మనసారఁ బ్రేమించినది. ఆమె హృదయము నాతని కర్పించినది. ఆమె కాతనితోడిదే లోకము. అట్టి యామె వీరన యన్యాసక్తుఁడగుట జూచి యోర్వలేక

పోయినది. అందులకే యొంటరిగా నా నిశీథమున వచ్చి యాతని హృదయమును గ్రహించి, యాతని మనసుం ద్రిప్పుట కుపాయాంతరము నన్వేషించి, తన సదనమునకుం బోయినది.

మఱునాటి యుదయముననే యామె మోహనాంగి కడ కేగినది. మోహనాంగి యామెను జూచినంతనే లేచివచ్చి కౌగిలించుకొని, తన శయ్యపైం గూరుచుండం బెట్టుకొని ముచ్చటలాడం జొచ్చినది. కాని చంచల యామె ముచ్చటలు విని యానందించుటకు రాలేదు. ప్రతాపుఁడు మాంచలయెడ ననురక్తుఁడై యున్నాఁడని తెల్పి, యామెకు మాంచలపై నీర్ష్యాసూయల గల్పించి, యామె సాహాయ్యమున, మాంచల నచ్చోటి నుండి తప్పింప వలయునని యామె కోరిక. తన యీ కోరిక కొనసాగుటకై సమయము వచ్చినంతనే యామె యిట్లుపక్రమించినది.

చంచల:- చెలీ! మాటి మాటికిని నీ మగని కూరిమిని గూర్చియే ప్రసంగించుచుందువు గాని, మగవారి కూరుములు నీటిపై వ్రాతలను మాటను నీవు మఱచితివా?

మోహ:- అందరు మగవారు నట్లే యుందురా? మగవారిలో మాత్రము స్థిర ప్రణయము గలవారు లేరా?

చంచల:- ఉన్నారో లేరో; ఆవిషయమంతయు నాకేల? నీ మగని విషయమున మాత్రము నీవు కొంచెము జాగరూకతతో నుండవలయును.

మోహ:- ఏమి జాగరూకత; త్రాటితోఁ గట్టి వేయుమందువా? బందిఖానాలో నుంచుమందువా? (నవ్వును)

చంచల:- (కోపము నటించుచు) చెలీ! ఇది నవ్వులకు సమయము కాదు. నీ మగనిని నీవు బంధికానాలో నుంచుట కాదు. ఆతఁడే యొక బంగారుబొమ్మను దెచ్చి, పర్వతారామ కారాగారమున దాచియున్నాఁడు. నేడో రేపో ఆమెను బయటకుఁ దీయును. అప్పుడా యొయ్యారి ప్రవేశమును నీ నిష్క్రమణము నొక్కమారే జరుగఁగలవు. ఆతని హృదయమునుండి యింతకు మున్నెన్నడో తొలగింపఁబడితివి. ఇంక నాతని భవనమునుండియే తొలగింపఁ బడగలవు. నీ మంచికోరి చెప్పుచున్నాను. అటుపై నీ యిష్టము.

మోహ:- (ఆశ్చర్యముతో) చెలీ! నీ మాటలు నిజమేనా? నాతో వేళాకోళములాడుచుండ లేదు కద!

చంచ:- నిజముగాక మరేమి? నీతో నే నెన్నడైన నబద్ధములు చెప్పినానా? హాస్యము లకిదియా తరుణము?

మోహ:- ఈ విషయములు నీకెట్లు తెలిసినవి? నీపై ననుమానముచేఁ గాదు. ఉత్కంఠచే నడుగుచున్నాను.

చంచ:- అడుగుము. నే నేమి చెప్పనన్నానా? తొలుదొల్త సోములీ విషయములు నాకుఁ జెప్పినాఁడు.

మోహ:- సోము లెవరు?

చంచ:- మా ఆయనకుఁ గూర్మి నెచ్చెలి కాఁడు.

మోహ:- ఓహో! అట్టులనా:

చంచ:- ఆతని మాటలంతగా విశ్వసింపఁదగవని నీ యభిప్రాయము కాఁబోలు. ఆతని మాటపైనే యాధారపడి, నే నిచ్చోటికి వచ్చియుండ లేదు. నీవలెనే నేనును దొలుత నాతని విశ్వసింపలేను. తరువాత మా ఆయన నడుగగా నందొకమాటయు నసత్యము లేదని చెప్పినారు.

మోహ:- ఎంత మోసము. చెలీ! ఇప్పుడేమి చేయుమందువు.

చంచ:- ఏమిచేయుమందునా? మాచల నెట్లయిన నీ ప్రదేశమునుండి తప్పింపుమందును.

మోహ:- తప్పించిననేమి ప్రయోజనము. అన్యోన్యము ప్రేమగల వారలిరువురు నెట్లయినఁ గలసికొందురు.

చంచ:- అన్యోన్య ప్రేమ యనుచున్నావు. మాచలకుఁ బ్రతాపునిపైఁ బ్రేమగలదనియా నీ యభిప్రాయము.

మోహ:- అవును.

చంచ:- అట్లెన్నటికిఁగాదు. మాచలకే యాతనిపైఁ బ్రేమయున్నచో నాతఁడామెను కారాగారమున నేల యుంచును.

మోహ:- అవునవునామాట నిజమే. చెలీ! నీవు చిన్ననాటి నుండియు మంచి బుద్ధి సూక్ష్మత గలదానవు సుమా! మఱియు సకాలమున నీవిషయమును నీవునాకుఁ జెప్పనిచో నాకాపుర మేమై యుండెడిదో — నేను నీఋణ మెట్లు తీర్చుకొనఁ గలనో.

చంచ:- నీ ఋణమునుగూర్చియు నా ఋణమునుగూర్చియు తరువాత నాలోచింతము. ముందుఁ గర్తవ్యముఁ జూడుము.

తరువాత వారిరువురు నా భవన ప్రాంగణమునఁగల లీలోద్యానవనమున కేగిరి.

15 వ ప్ర క ర ణ ము.

అది కారాగారమున నొక మూలగానున్న గది. అందొక దీపము మినుకు మినుకుమని వెలుఁగుచున్నది. అందొక చాపపై నొక యంగన శయనించియున్నది. ఒక చేతిపై తలనానుకొని యెడమ వైపు త్రిగిలి యామెయున్నది. ప్రక్కనున్న చిన్న కిటికీనుండి చల్లని వెన్నెల యామెపైఁ బడుచున్నది. పాఠక మహాశయా! నీవెప్పుడైన నిదాఘ తాపమున నెండి సన్ననిపాయ మాత్రమే మిగిలియుండిన చిన్ని సెలయేరును జూచి యున్నావా? గ్రీష్మ భానుని చండ ప్రతాపమున కాఁగలేక, వాడి భూమిపైఁ బడి పొరలాడుచున్న పుష్పిత లతామ తల్లిని జూచి యున్నావా? ప్రాచీమూలమునఁ గళా మాత్ర శేషుఁడైయున్న హిమాంశుని జూచి యున్నావా? జలా

శయమునుండి తీసి యొడ్డునఁ బారవైవగా శోషించియున్న పద్మమును దిలకించితివా? మంత్రౌషధిరుద్ధమై, యటునిటుఁ గదలలేక యూరక బుసకొట్టుచున్న నాగాంగనను విలోకించితివా? పై వానిలో నెద్దాని నైనను నీవు చూచియున్నచో, నచ్చట నాకటికి నేలపైఁ బండుకొనియున్న యయ్యబల, దీనావస్థ నొకించుకయైనను గుర్తింప గలవు. ఆహా! విధి చెయిదములు దుర్వాహ్యములు కదా! శిరీష కుసుమ పేశలములు, హంసతూలికాతల్ప శయన యోగ్యములు నగు నామె మృదులాంగముల కాకటికినేల యాశయ్యాతలము? ఎంతటి దురవస్థ! నా డశోకవన మధ్యమున, నేకవేణీధరయు, మలినాంబర ధారిణియునై నుపవాస కృశదేహయునైయున్న సీతామహాసాధ్వియే జ్ఞప్తికి వచ్చుచున్నది. ఆమె యట్లే శయనించి యున్నది. చలన మావంతయు లేదు. ఇంతలోఁ బైనుండి యాగది తాళముఁ దీయుచున్న చప్పుడైనది. ఆమె యులికిపడి లేచినది. ముప్వురు మనుజులా గదిలోఁ బ్రవేశించిరి. అందు మొదటి యాతఁడు ప్రతాపుఁడు. రెండవవాఁడు సోములు; మూఁడవది యొక వృద్ధదాసి. ఆ ముప్వురిలో నా వృద్ధదాసి యామెకు సుపరిచితయే. ప్రతిదినము నోగిరమును దెచ్చి, యచ్చటనిడి, కొంతతడవాగి, ప్రతాపుని గుణగణములు కీర్తించి, యాతని పొందొల్లనిచో, నామరణమును గారాగారవాసమేయని బెదరించి, మఱియు నచటనుండి కదలుట, యా వృద్ధదాసి కలవాటు. ప్రతాపుఁడును సోములును నామెకుఁ దెలిసినవారే, ప్రతాపుఁడచ్చటికి రెండుమారులే వచ్చి

యున్నాఁడు. రెండు మారులు నాతఁడచ్చట రావణుని పాత్ర నభినయించినాఁడు. ఇప్పుడాతఁడు కీచకుని పాత్ర నభినయింప నున్నాఁడు. ఆ సుందరీ రత్నమును జూచినంతనే యాతని సర్వావయవములును బులక లెక్కినవి. ఆరోజున నాతఁడా కొన్న పులివలె నున్నాఁడు; కోడి పిల్లను జూచిన గ్రద్దవలె నామె నొక్క పాటున గ్రహింప నభిలషించినాఁడు. పురుగులఁ దినుటకుఁ గోడపై వేచియున్న బల్లివలెఁ దదేక ధ్యానమగ్నుఁడై నాఁడు. ఆబోతువలె నుబలాటపడినాఁడు. పందివలె గురగుర లాడినాఁడు. పిల్లివలె కస్సుబుస్సు మనినాఁడు. మొట్టమొదట నుద్రేక పారవశ్యమున నామెతో నేమి మాటలాడ వలెనో యాతనికిఁ దోచినది కాదు. ఒక్క యుదుటున నామెపై నుఱుకి పడి, మదకరి మహాహ్రదమును గలచివైచినట్లు, కల గుండు గావించిన గాని, కుక్కుట న్యాయము నవలంబించిన గాని, చిరకాల ప్రవర్ధిత స్వకీయ కామోపశాంతి కాదని ప్రప్రథమమున నాతనికిఁ దోచినది. కాని యా యూహ క్షణ మాత్రమే నిలిచినది. అట్లుగావించినఁ దానామె వలనఁ బొందఁదలచిన యానందములో సగము కూడఁ బొందుట కవకాశము గలుగదని యాతఁడు గ్రహించినాఁడు. బలాత్కారము వలనఁ దనకానంద భంగమగుటయేకాక, తన రసికతకుఁ గూడ భంగము వాటిల్లునని, యాతని కానిముసము నకుఁ దోచినది. కావుననే యాతఁడామె తన్నుఁ జూచినంతనే దిగ్గున లేచుటగాంచి,

ప్రతా:- సుందరీ! సర్వమంగళా! నన్ను జూచినంతనే యేల నీకీ యదరిపాటు? నేనేమి రాక్షసుడనా? నన్ను నీ వానిగ నేలుకొని, యఖండ భోగభాగ్యముల నానందించుట మాని, యీ నిత్యోప వాసములచే నీకారాగారమునఁ గృశింపనేల? ఈ కటికి రానేల పైఁ బవళింపనేల?

సర్వమంగళ:- అది నా యభాగ్యము.

ప్రతాపు:- నీకీ దీనవాక్యము లేల? అఖండాంధ్ర కర్ణాట మహాసామ్రాజ్యాధినేత కధీశ్వరివై, దాసదాసీజనంబు లూడిగంబులు సేయ, సభ్యంతర రమ్య హార్మ్యముల, హంసతూలికా తల్పమున నధివసింపదగిన నీకీ దీన వాక్యములేల? ఒకమాఱు నీ క్రేగంటిచూపు నాపైఁ బరపుము; నేనీ శృంగార మహాసామ్రాజ్య పట్టభద్రుఁడ నగుదును. ఒకమాఱు నీ చిఱునవ్వు చిన్ని వెన్నెలలచే నన్నలరింపుము. చిరకాల ప్రవర్ధిత మదీయ హృదయతాప ముపశాంతిఁ బొందును. ఒకమాఱు మధుర మధుర మధునిష్యందములగు నీ కలికి పలుకల నా వీనుల విందొనర్పుము. విరహ శిఖి శిఖాతప్తమగు నా హృదయవల్లి కమృతధారా సంసేచన మగును కాని యిట్టి దీనాలాపములు నీకేల?

సర్వమ:- అయ్యా! ఈ దీనురాలిపై నీకేల దయరాదు. నన్నేల

యిట్లు నిష్కారణముగ నలయించు చున్నావు. నీకు నే నెట్టి యపకృతియును గావింపలేదు. నన్ను నీవు కామిం చుట కేవల మధర్మ్యము. దూష్యము. రాజు ప్రజలకుఁ గన్నతండ్రి వంటివాఁడు. నీవో రాజ సోదరుడవు. కావున నీవును నట్టివాఁడవే. అట్టియెడఁ గన్నబిడ్డనే కామించు నవివేకు లుందురా? హేయమును, తుచ్ఛ మును ధర్మ బాహ్యము నగు నీకామమును వీడుము. నన్ను నాతండ్రికడ కంపివేయుము.

ప్రతా:- పిచ్చిదానా! నేను నీకడ కిప్పుడు ధర్మశాస్త్ర ప్రసం గము చేయుటకు వచ్చియుంటి ననుకొనుచుంటివా? ఈ ధర్మ పన్నములు మాకును దెలియును. నీ వేమి పరాంగనవా నిన్ను గాంక్షించిన మాకుఁ బాతకము గలుగుటకు? అవివాహితయు, ననన్యరూప లావణ్య వతియునగు నంగనను వాంఛించుట శాస్త్ర దూష్య మగునా? మఱియు, ధర్మము రాజానుమతమై యుండును. ధర్మాధర్మముల విచారించువాడుఁ రాజు కాని, నీ ధర్మశాస్త్ర కర్తలుకారు. ఐహికములగు నఖిల భోగములును రాజుల కనుభవ యోగ్యములే అట్టియెడఁ దన యుద్యాన వనముననే యున్న పువ్వుఁ దీగె నాఘ్రాణించుట కాతని కధికారము లేదా? తన తోటలోని మధుర ఫలరసము నాస్వాదించుట కాతని కొరుల యనుజ్ఞ కావలెనా? ఈ ధర్మపన్నములు చెప్పి

మమ్ము వంచింపఁ బూనకుము? ఇట్టి వనేకములు మేమును వినియున్నారము. (సవ్యంగ్యము) నీకు విద్యా వైదుష్యమున్నచో, నా యంతఃపురమునఁ జూప వచ్చును లెమ్ము; లెమ్ము; దారికిరమ్ము.

సర్వమం:- నీవు నీతిదూరుఁడవు. నీ వంటివానికి నీతులు గఱపుట, బూడిదలోఁ బన్నీరుపోయుట. ఇక నానిశ్చితాభిప్రాయమును వినుము. నీవు తలక్రిందుగఁ దపమాచరించినను, నేను నిన్ను బరిగ్రహింపఁజాలను. పరిగ్రహింపను. నీయిచ్ఛ వచ్చినట్లొనరించు కొనుఁము. బలాత్కరింప నెంచితివా, బలవన్మరణమే నాకు శరణ్యము.

ప్రతా:- నీకింత వంతమేల? నన్నేలఁ బ్రేమింపఁజాలవు? నేనేమి సుందరుఁడను గానా? రసికుఁడనుగానా? భోగ్య భాగ్యములకు లోపమా?

సర్వ:- ఇట్టి ప్రశ్నల కన్నింటికి సమాధానము చెప్పవలసిన బాధ్యత నాకేమియును లేదు. నీ యైశ్వర్యము నాకుఁ దృణప్రాయము. నాజీవిత పథమును నిర్ణయించువాఁడు మాతండ్రికాని నీవు కావు.

ప్రతా:- అట్లయిన నీ తండ్రినే యిటకు రప్పింతును. అతని మాటపై నైన నన్ను బరిగ్రహింతువా?

సర్వామం:- నా జనకుఁడు నీకడ సేవకుఁడాయేమి? నీ యను పాజ్ఞలలో నుండుటకు, నీయిచ్ఛవచ్చినట్లు ప్రవర్తించుటకు. ఆయన సర్వతంత్ర స్వతంత్రుఁడు. ప్రౌఢదేవ రాయ రాజదేవేంద్రులకుఁ బ్రాణతుల్యుఁడు.

ప్రతాపు:- (వికటముగా నవ్వి) ఓసి వెఱ్ఱిదానా! నీ వింకను బెరటి త్రోవనే యున్నావు. (ఎగతాళిగా) ప్రౌఢదేవ రాయ రాజదేవేంద్రులకుఁ బ్రాణతుల్యుఁడైన నీతండ్రి యిప్పుడీ కారాగారముననే యున్నాఁడు. కావలసినఁ జెప్పింతును. చూడుము.

సర్వ:- హా తండ్రీ—అని మొదలు నరికిన తరువువలె నేల కొరగెను.

అంతట నొక సేవకుఁడు వడివడిగాఁ బ్రవేశించి, "మహాప్రభూ! మహాప్రభూ!" అని పిలిచెను. ప్రతాపుఁడు, క్రోధకంపిత స్వరముతో "ఏమిరా! ఏమి నీపుట్టి మునిగినది. అంత తొందరగాఁ బిలుచుచున్నావు. నీకేమి యున్మాదము సంభవించినదా? ప్రేలాపన పుట్టినదా?"

సేవ:- అట్లుకాదు మహాప్రభూ! మహారాజు కడనుండి యొక యాంతరంగిక సేవకుఁడు వచ్చినాఁడు. తొందరగా మిమ్ముఁజూడ వలెననుచున్నాఁడు.

ప్రతాపుని ముఖచ్ఛాయ క్షణములో నల్లవడినది. ఆత
డించుక తడవు నీరవుఁడైయుండి, తరువాత గంభీరముగా సరే
నీవు పొమ్ము; ఆతని నందే యుండుమనుము. నేనిదే త్వరలో
నీవెన్వెంటనే వచ్చెదను. సేవకు డామాటతో నేగెను. ప్రతాపు
డును గారాగారమును జాగరూకతతోఁ బరిశీలింపవలెనని
సోములుకుఁ జెప్పి, యా సేవకుని వెంబడినే పోయెను. కాని
వారిలో నెవ్వరికినట్లు మూర్ఛ మునిఁగియున్న యా యింతికి
శైత్యోపచారములు గావింపవలెనను నూహయే పొడమ లేదో,
లేక వారిహృదయమున నట్టి కరుణాతిశయమునకుఁ దావే లేదో
మనము నిశ్చయముగాఁ జెప్ప జాలము. కాని యట్టి కార్యము
మాత్రము జరుగలేదని నిశ్చయముగాఁ జెప్పఁగలము. కాని
ఆ రాజునకు మాత్రమా కలువకంటిపై జాలికలిగినది.; మూర్ఛ
మునిఁగియున్న యామె నాతఁడు తన యమృత కిరణ ప్రసా
రముచే ననునయించుచుండెను. ఆమె కాశీతల చంద్ర కిరణ
ప్రసారముచేఁ గొంత తెలివి వచ్చినది. కాని యా చైతన్యము
గల్గుటయు నామె కాసమయమునఁ జేటుగనే పరిణమించెను.
మూర్ఛలో నున్నంతకాలము, నామె చిత్తము నిర్మలమై
యుండెను. తెలివి వచ్చినంతనే యామె హృదయమును శకలీ
కృతముఁ గావించు నామె తండ్రి కారాగార నివాసము జ్ఞప్తికి
వచ్చెను. తోడనే యామె చిత్త మాకులిత మాయెను. తన
తండ్రి కిట్టి విపత్పరంపరలు తన మూలముననే కలుగుచున్న
వని యామె తలంచెను. మున్ను ప్రతాపుఁడు తనచేఁ దిర
స్కృతుఁడగుటచేతనే తన తండ్రిని గారాగారమున నుంచెనని

యూమె తలపోసెను. ప్రతాపుఁడు తన జనకునిఁగూడ నడిగి తిరస్కృతుడైయే యుండుననియు నందులకే యట్టి యకార్య కరణమునకుఁ గడంగెననియు నామె యభిప్రాయము. ఆతఁడు ప్రతాపుని విషయమున సుముఖుఁడే యైయున్నచో, నా విష యమునుగూర్చినతోఁ బ్రస్తావించియే యుండుననని, యూమె నిశ్చయము. కావుననే యూమెచిత్తము మఱియు సంక్షోభింపఁ జొచ్చెను. కాని యూమె చేయునది యేమికలదు? అబల అందును నిబద్ధ. పరిపరి విధముల నామె యూహాలు పోవు చుండెను. కన్నీరు మున్నీరై పారుచుండెను. ఇట్లింనుమించుగా నొకజాము కాలముగడచెను. అంతలో నామె నెవ్వరో మెల్లగఁ బిలుచుచున్న సడి యూమెకు వినవచ్చెను. తొలుత నామె యుపేక్ష వహించెను. కాని యూ పిలుపు మరల మరల విన వచ్చుటచే నామె కాపిలుచు వారెవ్వరో తెలిసికొనవలెనను కౌతుకము కలిగెను. మెల్లగ మోమెత్తి యూమె ద్వారము వంకఁ జూచెను. అచ్చటనొక యంగనామణి నిలచియున్నట్లామెకుఁ దోచెను. ఆమె రూప మంతగా నామెకు దృష్టి గోచ రము కాలేదు. "ఎవ్వరుమీరు?" అని యూమె ప్రశ్నించెను. ఆ యంగన "నేను నీహితవుఁగోరు దానను" అని మాత్రమే ప్రత్యుత్తరమిచ్చెను. 'పేరు?' అని యూమె మరల నడిగెను. "పేరున కేమిలెమ్ము; ముందుగా దీపమును గొంచె మెత్తుము అనంతర మన్నియంశములను గూర్చియు మాటలాడుకొన వచ్చును." అప్పుడా గదిలోని దీపము చమురు తగ్గిపోవుటచే మినుకు మినుకు మనుచున్నదని సర్వమంగళ గ్రహించినది.

వెంటనే యొకమూలఁ బడియున్న యాముదపు సీసాను దెచ్చి యాదీపపు ప్రమిదలోఁ బోసినది. పోసినంతనే దీప ముజ్జ్వల కాంతిపుంజముల గది యంతట వెదజల్లఁ జొచ్చినది. ఆ కాంతిలో సర్వమంగళ యాయంగనను, విస్పష్టముగఁ జూడ గలిగినది. అంతవఱకు నామె యాగది యావలనుండియే పిలుచుచున్నదని యామె యూహ. ఇప్పుడామె యాశ్చర్యము నకు మేరలేదు. ఆ గదిలోనికెట్లామె వచ్చినది? ఏమో; సోములు గది తాళము వేయలేదేమో? అట్లైన్నటికిని గాదు. ఆతఁడీ విషయమున నెప్పుడు నేమరి యుండఁడు. ఇఁక నామె యెట్లు లోనికి వచ్చినది? ఈ సందేహమూరక యాలోచించినఁ దేలునది కాదు. ఆమెనే యడుగవలెను. మఱియు నామె రూప లావణ్యములు కూడ సర్వమంగళ కాశ్చర్య జనకములుగనే యున్నవి. అంతటి యపరూప సౌందర్యవతి నామె యెచ్చటను జూచి యుండలేదు. మఱియు నామె మనోజ్ఞ వసనాలంకృతయైయున్నది. కావునఁ దాసవలె కారాగారమున నామెయు నిర్బధింపఁబడియుండదు. అయిన నీమె యెవ్వరు? ఎందుల కిచ్చటికి వచ్చినది? ఎట్లు లోనికివచ్చినది?—— ఈ భావ పరంపర, సర్వమంగళ నొక్క క్షణకాలము స్తబ్దను గావించినది. ఆమె నోట నొక్కమాటయు వెలువడలేదు. అట్లే నీరవయై నిలిచి యున్నది. అంతట నానూత్నస్త్రీయే యిట్లుపక్రమించినది.

"సర్వమంగళా! నీవు నన్నెఱుఁగవు. కాని నేను నిన్నె ఱుంగుదును. అదియు నెంతకాలమునుండియో గాదు. ఈ కారాగారమునకు వచ్చిన యనంతరమే నిన్ను గూర్చి నాకుఁ

దెలిసినది. నేనును నీవలెనే యిందు నిర్బంధింపఁబడినాను. కాని యీమధ్యనే నాకుఁగొంత స్వేచ్ఛ యనుగ్రహింపఁబడినది. కావుననే, నేనిప్పు డిచ్చోటి కీలాగున రాఁగలిగినాను. నా పేరు మాచలయని యందురు."

సర్వమం:- (మౌనము) ....

మాచల:- నీ కొకించుక సాహాయ్యము నేను చేయఁగలను. సత్యమును వచించుచున్నాను. నేను నీ హితమునే కోరుదానను.

సర్వ:- (మౌనము) ... ...

మాచల:- నీవు నన్ను నుమానించు చున్నావా?

సర్వ:-నేను దుఃఖజీవిని. నా జీవిత సర్వ స్వాయమానమగు నాపితృ సంసేవనమే నాకు దూరమైనది. ఇంక నాకీ జీవితమున నేమికలదు? ఇట్టి దురవస్థలఁ బొల్బడియున్న నన్నేల నీవు వంచింపఁ జూచెదవు. నీకుఁ బ్రతాపుని మన్ననయే కావలసినచో నింక మార్గాంతరములే లేవా? ఈ దుఃఖ భాగినినే యలయింప వలయునా? నన్ను నా విచారములలో మున్గి యుండనిమ్ము. నిన్ను బ్రతిమాలుకొందును. నన్ను వీడిపొమ్ము.

మాచల:- సర్వమంగళా! నీవు నన్నుమానించుటకుఁ గారణము లేక పోలేదు. ఈ నారూప వేషములు నేను జెప్పు నా కారాగార నివాసమున కనుగుణము గాలేని

మాట వాస్తవమే. కాని యీ విపరీత పరిస్థితికిఁ గారణాంతరమును గలదు. అది తరువాత నీకెఱిగించెదను. ముందొక్క మాట నాకుఁజెప్పుము. నీజనకునిఁ జూడ నీ కభిలాష కలదా? లేదా?

సర్వ:- అయ్యో! అభిలాషకలదా? యని యడుగు చుంటివా? ఇప్పుడు నా జనకుని నాకుఁ జూపిన వారికి నా చర్మముఁ జెప్పులు కుట్టియైన నిచ్చెదను. శత్రు మిత్రభేదముఁగూడ నాకఁ నావశ్యకమే.

మాచల:- అట్లయిన నా వెంటరమ్ము.

సర్వ:- నీ ముఖమునఁ బ్రసన్నతగలదు. సిరితాండవించుచున్నది. లక్ష్మీప్రసన్నమగు నిట్టి ముఖపద్మముఁ గలవారు సాధారణముగా వంచింపఁ జాలరు. అదివారి ప్రకృతికి విరుద్ధము. పాపపుణ్యముల భారము నీపైనే యిడి నిన్ను నేననుసరించు చున్నాను. పద.
తరువాత వారిరువురు నాగది వీడి యీవలికివచ్చిరి వచ్చియొక యుద్యానవనమునఁ బ్రవేశించిరి.

సర్వ:- ఇది కారాగారము కదా! ఇందీ యుద్యానవనమేమి?

మాచల:- ఇది నిజముగాఁ కారాగారము కాదు. విద్యానగర స్థాపనకుఁ బూర్వ మిందొక దుర్గముండెడిది. అది నాటి యానెగొందిరాజుల యధీనమున నుండెడిది. మతంగ పర్వత ప్రాంతారణ్యములలో నున్నదీని యునికియే

యిప్పుడు చాలమందికిఁ దెలియదు. ఇప్పుడిది ప్రతాపుని యధీనమున నున్నది. తన కహితులగు వారి నందఱ నాతడిందు బంధించి యుంచుచున్నాఁడు.

సర్వ:- ప్రతాపునకు మేమేమి హానిచేసితిమి? మమ్మేల యాతడిట్లు కారించుచున్నాఁడు?

మాచల:- దానికిఁ గారణములు చాలఁగలవు. అవి క్రమముగా నీకుఁ దెలియఁగలవు. నిన్నుబంధించుటకు మాత్రము ముఖ్య కారణము నీయందాతనికిఁగల ప్రేమయే.

ఇట్లు ప్రసంగించుచుఁ బోవుచుండగా వారొక ద్వారమును సమీపించిరి. ఆ ద్వారము దాటినంతనే యనతి దూరమున నొక గదుల వరుస కాన్పించెను. అందొక గదికిఁ జేరువగా నాగి మాచల "ఇచట నేయుండుము. ఇప్పుడే దీపమును దెచ్చెదను," అని సర్వమంగళతోఁ బలికి చరచర నడచి పోయినది. సర్వమంగళ భయచకితయై యచ్చట నట్లే నిలచి యున్నది. అంతలో నామె దీపమును గొని మరలవచ్చి" "నేనునిన్ను మోసగింతుననుకొంటివా? భయచకితవై యట్లు నిలచి యున్నావు" అనినవ్వుచు నామెతోఁబలికి, యొక చేతితో నొక గదిని జూపుచు, "రమ్మాగదిలోనే నీ తండ్రి యున్నాడు." అని చెప్పుచు, నామె కరమును గ్రహించి, యాగది వంకకు నడచిపోయెను. గది సమీపించినంతనే సర్వమంగళ చేతికి దీపమునిచ్చి, తాళముఁ దీసినది. ఆగదిలో నొక తుంగచాపపై నాశీనుఁడై యేదియో జపించుకొనుచున్న

తన జనకుని సర్వమంగళ చూచినది. ఆతనిఁ జూచినంతనే యామె హృదయము నీరైపోయినది. పట్టు పరుపులపైఁ బవళించు భాగ్యవంతునకా యీ కఠిన పాషాణశయనము? రారాజుల యాస్థానసీమల మణి మయాసనము నలంకరించు మహాపండితునకా, యీ కారాగార నివాసము? డిండిమ భట్టారకుని శరీర చ్ఛాయ యించుక వాడియున్నది. బలిసిన గడ్డముచే నాతని ముఖమండల మదృష్ట పూర్వమైన గాంభీర్యమును వహించియున్నది. చేతినొక జపమాల మాత్రమే యున్నది. కన్నులరమోడ్చుకొని యాతఁడు జపముచేసికొనుచుండెను. తలుపుతీసిన చప్పుడు వినినంతనే యాతఁడు కన్నులు తెఱచెను. తనయెట్టయెట్టదుట నున్న యాయిరువురు వ్యక్తులను జూచినంతనే యాతని యాశ్చర్యమునకు మేరలేక పోయెను. ఆతఁడు తన కన్నులనుఁ దానే నమ్మజాలకపోయెను. అది భ్రాంతియా? సత్యమా? అను నిర్ణయ మాతనికిఁ గుదురక పూర్వమే సర్వమంగళ, యొక్క యుదుటనఁబోయి, యాతని మెడఁ గౌగిలించుకొని, 'నాన్నా' అని యొక్క కేక వైచి, వెక్కి వెక్కి యేడువ దొడగెను. డిండిమ భట్టారకుని కన్నుల వెంబడికూడ నశ్రుజలము నిరత మగుచుండెను. కాని యవి దుఃఖాశ్రువులు కావు. హర్షాశ్రువులు. ఆతనినోటఁగూడ " అమ్మా" అనునొక్క మాట మాత్రమే వెలువడెను. వారిరువురు నైదారు నిముసముల ల్లే చలనములేక యుండిరి. అంతట నాతఁడే తెలివిఁదెచ్చుకొని, యామెను "తల్లీ! నీ వెట్లిచ్చటికి రాఁగలిగితివి. ఆ కఱకు రక్కసుని బారినుండి యెట్లు

తప్పించుకొని వచ్చితివి ?" అని ప్రశ్నించెను. సర్వమంగళ యాతని ప్రశ్నకెట్టి సమాధానము నీయలేదు; గదిలో నొక ప్రక్కను నిలిచియున్న మాచల నాతనికిఁ జూపెను. డిండిమ భట్టారకుఁ డంతవఱకు మాచల నానవాలు పట్ట లేదు. ఇప్పుడామెను జూచినంతనే యాతని యాశ్చర్యము మిన్నుముట్టెను. ఆ త్రిలోక సుందరి నాతఁ డెచ్చటనో చూచినట్లు జ్ఞప్తి మాత్రమున్నది. కాని యెచ్చట జూచెనో, సరిగా నెఱుక లేదు. క్షణకాల మాతఁడు నిశ్చలుఁడై యుండి యప్రయత్నముగా "నీవు మాచలవుగావా తల్లీ?" అని ప్రశ్నించెను.

మాచల:- అవును మహాశయా! ఆ యభాగ్యను నేనే నన్ను మీరు సరిగానే గుర్తించినారు.

డిండి:- చూచినంతనే నిన్ను నేను గుర్తింపలేకపోయిన మాట వాస్తవమే. కాని యించుక యోజించి నంతనే, నిన్ను ప్రతాపుని యాస్థానమునఁ జూచి నట్లు స్ఫురణకు వచ్చినది.

మాచల:- అవును మహాశయా! నేనును, మిమ్మచటనే చూచినాను. కాని తమతో సంభాషించు భాగ్య మానాఁడు నాకుఁగలుగ లేదు.

డిండి:- (ఇంచుక నవ్వి) దానికేమిలెమ్ము? - కాని యీ స్థల మున నిన్ను జూచుట నా కాశ్చర్య కరముగ నున్నది. ఈ మహా నరకమునకు నీవేల వచ్చితివి?

మాచల.- ప్రతాపుడు నన్నుగూడ నిందే బంధించినాడు.

డిండి:- (ఆశ్చర్యముతో) ఏమి? నిన్నుగూడ బంధించెనా? ఏమి వాని కండకావరము?

మాచల:- జగద్విఖ్యాత పండితులును, మహాకవులును, ప్రౌఢదేవరాయ సభా భవన హీరమణులును, అగు, మిమ్మే బంధించిన, యీ సాహసికి, నన్ను బంధించుటొక లెక్కయా స్వామీ?

డిండి:- కాలము సమీపించిన వాని కుచితానుచితజ్ఞానము నశించునను విషయము నీ వెఱుంగుదువు కదా! వానికి కాలము ... ...

మాచల:- (తత్తరముతో) స్వామీ! స్వామీ! క్షమింపుడు.

డిండి:- ఏమి తల్లీ! అంతటి సంభ్రమునకుఁగారణము?

మాచల:- తమ రమోఘ వాక్కులని మద్గురు దేవులు చెప్పగా వినియున్నాను. తమ నోటనట్టి కఠోర శాపవాక్కు, ...

డిండి:- మాచలా! నీ యభిప్రాయమును నేను గ్రహించితిని. కాని నీ ప్రార్థన మిప్పట్టున నిరర్థకము. ఆ మూర్ఖుఁడింతకుఁబూర్వమే శాప దగ్ధుడైనాఁడు. నేను మాత్ర మిప్పుడేమి చేయగలను? నా వాక్యమున కన్యథాత్వము లేదు.

మాచల:- (దీనముగ) తాము నిగ్రహానుగ్రహ సమర్థులు. దయదలచినఁ దమ కసాధ్యముగు కార్యము లేదు. అతఁడు మీ కొనర్చిన యపకృతి క్షమింపరానిదే. అయినను, మీ క్షమాగుణమును నే నంజలిమోడ్చి యర్థించుచున్నాను. అతని కొసంగిన శాపమును మరలింపుఁడు.

డిండి:- (ఇంచుక తడఁబాటుతోడ) బిడ్డా! నీ వాతని ప్రేమించితివా? నిజము దాపక చెప్పుము.

మాచల:- (మెల్లగ) అవును మహాత్మా! అతఁడే నా సర్వస్వము.

డిండి:- (నిట్టూర్చి) తల్లీ! నీ ప్రేమ మస్థాన పతితమైనది. ఆ నరరూప రాక్షసుని నీ వెట్లు ప్రేమించితివమ్మా!

మాచల:- మీరు రస హృదయులు; మహాకవులు; మీ రెఱుంగనిదేమి కలదు? ప్రేమ వెల్లువ పొంగి పొరలు నప్పుడు, యుక్తా యుక్త జ్ఞానము నశించును గదా!

డిండి:- (నిట్టూర్చి) బిడ్డా! నీ స్థితిఁజూచిన నాకు నిజముగా జాలి కలుగుచున్నది. కాని యా పాపాత్ముని యెడ నా హృదయము కరగుటలేదు. అతని యపచార మెంత మాత్రమును క్షంతవ్యముకాదు.

సర్వమంగళ:- నాన్నా! నీ విట్లనుట పాడిగాదు. ఈమె నాకుఁ గావించిన యుపకారము మరువరానిది.

ఈమెయే లేకున్న నే నిప్పుడిట్లు చూడగలిగియుందునా?.
ఇప్పటి మన యానందమున కీమేయే కారకురాలు.
ఈమె ఋణము మన మెన్నటికిని దీర్చుకొనలేము
ఈమె ప్రార్థనమును ద్రోసి పుచ్చరాదు.

డిండి:- (మౌనము)

సర్వమంగళ:- నీ వట్లూరకున్న సరికాదు సాన్నా! ఈమె తరపున నేనును నిన్నంజలిబట్టి ప్రార్థించుచున్నాను. నే నీమెకుం జాల ఋణపడియున్నాను. నీ వీమె కోర్కె చెల్లింపక తప్పదు.

డిండి:- (ఇంచుకనవ్వి) సరి; సరి; ఒకరికిప్పు డిద్దరయిరి. ఈ ప్రపంచమున నా శాపమును ప్రత్యాహరింపఁగల మహాత్ముఁడొకఁడేయున్నాఁడు. కాని యాతఁడిప్పుడు మీకు లభించు నవకాశమును లేదు. అవకాశము లభించినను మాచల, యీ శాపమును ప్రత్యాహరింపు మని యాతనిఁగోర జాలదు. కోరినను, ఆతఁడందుల కంగీకరింపఁడు. నా కపకృతియొనర్చిన వాని నాతఁ డెన్నటికిని క్షమింపఁజాలఁడు.

సర్వ:- (ఆశ్చర్యముతో) ఆతఁడెవ్వరు ?

డిండి:- (మెల్లగ) శ్రీనాథుఁడు, ఈ కాలమున శాపానుగ్రహసమర్థులము మేమిద్దరమే. నే నాత్మస్తుతిఁ గావించుకొనుట లేదు. అతిశయోక్తులు చెప్పుట లేదు. ఇప్పటి మీ యవస్థనుబట్టి యిట్లు చెప్పవలసివచ్చినది.

(మాచలతో) ఏమమ్మా! శ్రీనాథుఁడు నీకు గురువు కదా! ఆయనకడ నీవు చనవుకలిగియుందువు. ఆయన నర్థింపరాదా?

మాచల:- అన్నియు నెఱిఁగియున్న మీరే యిట్లన్న నే నేమి చెప్పగలను. మీ వంటి మహాత్ముల కపకృతిఁ గావించిన వాని ననుగ్రహింపుడని కోరినచో, నాయన నా కోర్కెఁదీర్పకపోవుటయే కాదు. నా ముఖముఁగూడ నిఁక నెన్నడుఁ జూడడు. ఆయన పట్టుదల నాకు బాగుగాఁ దెలియును. నీళ్లముంచినను పాలముంచినను, మీరే నాకు దిక్కు.

డిండి:- సరే; మాచలా! నీ వినయ విధేయతలు నాకు నచ్చినవి. నీవు శ్రీనాథ కవీశ్వరునకుఁదగిన శిష్యురాలవు. (ధ్యానస్తిమిత లోచనుఁడై కొంతసేపుండి) ఈ వచ్చు భానువారం కాక యావలి భానువారము నాఁడాతఁడు విద్యానగర రాజదర్శనము చేయరాదు. చేసినచో నాతనికి మృత్యువు తప్పదు. ఆ యొక్క దినము నాతఁడు రాజసన్నిధికిఁబోకుండఁ జూడగల్గితివేని, నీ ప్రియుఁడు నీకు దక్కును. ఇప్పట్టున నీకు నేను చేయఁగల సాహాయ్య మింతే. (సర్వమంగళతో) ఏమమ్మా! నీకు సంతోషమైనదా?

మాచల:- అనుగ్రహింపఁబడితిని.

సర్వ:- ఇదేమి నాన్నా! ఇప్పుడు కూడ నొక హంసపాదు నిల్పినావే.

డిండి:- నేనేమి చేయుదునమ్మా! ఇప్పుడు గూడ నానోట నా వాగ్దేవత యట్లేపలికినది. వాని యదృష్టమింతే. (మాచలతో) అమ్మాయీ! మాటల సందడిలో నిన్నడుగ మఱచినాను. నీవుఁగూడ నిర్బంధముగ నుంటి వంటివే. ఇచ్చోటికెట్లు రాఁగలిగితివి? సర్వమంగళను గూడ నెట్లు తెచ్చితివి! ఈ కఱకు రక్కసులు సాధారణముగ లోబడువారు కారే.

మాచల:- కఱకు రక్కసుల నాడించు జగన్మోహిని లేదా మహానీయా?

డిండి:- (మందహాసముతో) ఓహో! అదియా సంగతి. సరే. తెల్లవారుచున్నది. నేను కార్యములు నిర్వర్తించుకొనవలెను.

మాచల:- మేమును బోవలెను. సర్వమంగళను యథాస్థానమునఁ బ్రొద్దు పొడువక పూర్వమే నిలుపవలయును. నమస్కారము.

కన్నుల నశ్రుబిందువు లురలుచుండగా సర్వమంగళ తండ్రిని వీడలేక వీడలేక వీడును.

మాచల:- సర్వమంగళా ! విచారింపకుము. కొలదికాలము లోనే మన మందరము నీస్వర్గమునుండి బయల్పడును పాయము నాలోచించుచున్నాను. త్వరలోనే కార్య సిద్ధియగు సూచనలు కానవచ్చుచున్నవి.

సర్వ:- ఏమవి ?

మాచల:- తరువాత సావకాశముగఁజెప్పెదను. చీకటు లుండఁగనే నీగదిలో నినుజేర్పకున్న నా యాచోరు దక్కదు. ముందుపద :—

16 వ ప్రకరణము.

బాలభానుని స్వర్ణారుణ కిరణజాలము, విద్యానగర రాజ ప్రాసాదముపైఁబడుటచే నయ్యది సురాలయముపోలె, నొప్పారుచున్నది. అప్పుడపుడే వర్తకులు తమ యంగ డులును తెఱచుచున్నారు. పుష్పలావికలు తమ యంగడుల నమ్మోన సురభిళ కుసుమ స్రజములచే నలంకరించు చున్నారు. రాజమార్గ మప్పటికే జనసంకులమై యున్నను, అట్టుత్రోవలలో నచ్చటచ్చట మాత్రమే జనులు గోచరిం చుచున్నారు. రాజభటులు మాత్రము తమ తమ స్థానము లలో యథానిర్దిష్టముగ నిలిచి. యాతా యాత జనవ్రాత మును బరస్పర సంఘర్షణము నుండి రక్షింపుచున్నారు. దేవాలయములలోని ఘంటానినాద మర్చా సమయమును సూచింపుచుండెను. అట్టిసమయమున నొక మహాపురుషుఁడు

రాజమార్గము వెంబడిఁబోవుచుండెను. ఇరు కెలంకుల వేత్రహస్తులు బరాబరులు చేయుచుండిరి. అతనికి ముందుగ, మంగళ తూర్యారావములు, మిన్నుముట్టుచుండెను. వంది మాగధులు స్తోత్రములు చేయుచుండిరి. ముక్తామణిస్థగితములగు నేడు గొడుగులనుబట్టి పరిచారికలు ముందు వెనుకల నేగుచుండిరి. అందొక్కొక్క గొడుగున కొక్కొక్క రంగు గలదు. అతఁడమూల్య వస్త్రాలంకృతుఁడై యుండెను. అతఁడు రాజనగరు సమీపించుసరికి కచ్చటనున్న ప్రజలందరు "మహామంత్రులు వచ్చుచున్నా"రని యొకరితో నొకరు గుస గుస లాడుకొనుచు, యథాయథలై యటు నిటుఁ బర్వులిడుచుండిరి. రాజ ప్రాసాదమునకు ముందున్న యొక్కొక్క కక్ష్యనాతఁ డతిక్రమింపఁగనే యొక్కొక్క ఛత్రము ముడువఁబడెను. ఇట్లేడుకక్ష్యల నాతఁడతిక్రమించెను; ఏడు గొడుగులును ముడువఁబడినవి. ఏడవ కక్ష్య దగ్గరనే పరివార మంతయు నిలిచిపోయినది. అతఁడొంటరిగ రాజ ప్రాసాదమును బ్రవేశించినాఁడు.

ఆప్రాసాద రాజము పద్మాకృతి గలిగి యతి మనోజ్ఞమై, స్వర్ణ తోరణా లంకృతమై యుండెను. అందుఁ బ్రథమ ద్వారమున కెదురుగ, గజదంత నిర్మితములగు రెండు సింహములుండెను. వివృతములగు వాని యాస్యములలో హిరణ్మయ గోళము లుండెను. ఆ గోళములపై "రాజ్యము వీరభోజ్యము" అని వ్రాయఁబడి యుండెను. ఆ ద్వారము నతిక్రమింపఁగనే మహామంత్రి; యొక పెద్ద చావడిలోఁ బ్రవేశించెను. అందుఁ

గడు మెత్తని పట్టుదిండులుగల మణిమయాసనము లనేకము లుండెను. దాని యుపరి భాగమంతయుఁబట్టు చాందినీలచేఁ గప్పబడి యుండెను. క్రింది భాగమంతయు రత్న కంబళిచేఁ గప్పబడి యుండెను. అందు విద్యానగర చక్రవర్తి తన యమాత్యులందఱితోఁ గూడి మంత్రాంగము చేయును. మహా మంత్రి యా చావడి నతిక్రమించి, పై యంతరువునకేగు మెట్ల కేఁగెను. అచ్చట నిలిచియున్న ద్వారపాలకులలో నొకఁడు, సత్వరముగ లోనికేగి, ప్రధానామాత్యుల రాకను సార్వ భౌమున కెఱిఁగించెను. సార్వభౌముఁడు కను సన్నచేతనే యనుజ్ఞ నొసంగును. ప్రధానామాత్యుఁడు లోనికేగి యందలి యొక యున్నతాసనమున నాసీనుఁడాయెను. కొంతవఱకిరు వురును మౌనముగానే యుండిరి. అంతట సార్వభౌముఁడే యీ క్రింది విధముగా నుపక్రమించెను.

సార్వ:- ప్రధానామాత్యా లీయకాలాహ్వానమునకుఁ గార ణము నూహించియే యుందురు.

ప్రధా:- చిత్తము మహాప్రభూ! నే నీ యాహ్వానమున కొక కారణము నూహించినమాట వాస్తవమే. కాని యది యెంతవఱకుఁ బ్రభు చిత్తమున కనుకూలముగ నుండునో, మున్ముందు తెలియవలెను.

సార్వ:- కవిసార్వభౌములు కూడ నిప్పుడే వత్తురను కొను చున్నాను.

సార్వభౌముని యీ వాక్యము ముగిసీ ముగియకుండగనే, ద్వాఃస్థిత సేవకుఁ డరుదెంచి, శ్రీనాథుని రాక నెఱింగించెను. సార్వభౌముఁడు తన యాసనమునుండి లేచెను. ప్రధానామాత్యులుగూడ లేచిరి. అంతట, వజ్రకుండల మండిత గండ భాగుండును, భస్మత్రిపుండ్రాంకిత విశాల ఫాలభాగుండును, శిఖా నిక్షిప్త బిల్వదళుండును, చేత కౌశేయ వసనుండును, స్ఫటిక రుద్రాక్షమాలాలంకృత వక్షో భాగుండును, శుచిస్మితుండునగు నొక దివ్యమూర్తి యందుఁ బ్రవేశించెను. రాయలాతని కెదురేగి, యర్ఘ్యాసనాసీనుం గావించెను. మువ్వురును సుఖాసీనులైన యనంతరము, రాయలే మరల నుపక్రమించెను.

రాయలు:- కవిసార్వభౌములకు నా యాహ్వాన మకాలము నందినదేమో యని చింతిల్లుచున్నాను.

శ్రీనాథుఁడు:- అట్టిదేమియును లేదు. ఉపరి మీ యాహ్వానము సకాలముననే యందినది.

ప్రధా:- కవిసార్వభౌముల యీ వాక్యము గంభీర భావ సూచకమై యున్నది. అర్థానిని మఱింత విస్పష్టము సేయవలెనని మనవి.

రాయలు:- మహామంత్రులు యథార్థముగా బల్కిరి. సకాలమను మాట గభీర సూచకముగానే యున్నది.

శ్రీనాథు:- మఱి రాయలవారి 'అసమయ'ము మాత్రమట్టిది

కాదా! సరస్వతీ సేవాపరాయణులగు వారి వాక్యములలోఁ బొల్లు పదములుండుట యసంభవము.

రాయలు:- లేదు; లేదు; నేనాపదములో నెట్టి యంతరార్థము నూహించలేదు. అసమయ మనగాఁ దాము స్నాన సంధ్యాద్యనుష్ఠానములలో నున్నప్పుడనియే నా యభిప్రాయము.

శ్రీనాథుః- సకాలమనఁగా నట్టివి ముగిసిన తరువాతనే యని నా యభిప్రాయము.

ముప్పురును నవ్వుకొనిరి. ఆతనియుక్తి ప్రత్యుక్తి నైపుణ్యమునకు రాయలు మెచ్చుకొనెను. కాని యది ముప్పగకును నవ్వులాటకు సమయముగాదు. మరల ముప్పురును గభీరతా ముద్రను వహించిరి. ఆ నిశ్శబ్ద వాతావరణమును భేదింపుచు, రాయలే మరల నిట్లుపక్రమించెను.

రాయలుః- మనము ముప్పురమును గలసి యిప్పుడొక క్లిష్ట సమస్యను బరిష్కరింపవలసియున్నది. అందలి సత్యాసత్యములమాట యటుండగా, నద్దాని వలన మన రాజ్యమున నచ్చటచ్చటఁ గుట్రలుకూడఁ దలసూపుచున్నవి. ఈ విషయ మింతకుఁ బూర్వమే పరిష్కరింపవలసియుండెను. కాని కారణాంతరములచే నేనే యుపేక్ష వహించితిని. ఇంక నుపేక్షించుటకు వీలులేదు. అత్యుపేక్షవలన ననర్థము లనేకములు గలుగవచ్చును.

శ్రీనాథు:- సార్వభౌముల నింతగా వేధించు నా క్లిష్ట సమస్య యెద్దియో వినగోరుచున్నాము.

రాయలు:- దానికి మూలకారణమెద్దియో నా కింకను దెలియ రాకున్నది. కాని యీ విషవృక్షము శాఖోపశాఖలతో మన రాజ్యమంతటఁ బ్రాకుచున్నది. డిండిమ భట్టారకులు కానరాక పోవుటయు, వారెందుండిరో కూడ దెలియ కుండుటయు, నీ సమస్యను మఱింత క్లిష్టముగాఁ జేయుచున్నవి.

శ్రీనాథు:- అగునది విచారకరమగు విషయమే కాని, వారితో నీ విషమ సమస్యకుఁ గల సంబంధమేమి?

ప్రథా:- సంబంధము విదితమే. డిండిముల నెవ్వరపహరించిరో వారే ఈ రాజ్యమునఁ గుట్రలు పన్నుచున్న రాజ ద్రోహులు.

రాయలు:- మహామాత్యుల యూహ సత్యమే కావచ్చును. కాని వినుకొండ వల్లభరాయాదులగు రాజ ప్రతినిధు లంపికొనిన మహాజరులు, మహామంత్రులు చిత్రగించియే యుందురుకదా!

శ్రీనాథు:- వల్లభరాయఁడా? ఆతనికీ కుట్రలతో నేమిపని?

ప్రధా:- ఆతనికీ కుట్రలతో నెట్టి సంబంధమును లేదు. నిన్న నాతఁడే కాక మఱికొందఱు రాజ ప్రతినిధులు పంపిన మహజరులు వచ్చినవి. గూఢచారుల వలన వారు కొన్ని రహస్య విషయములను గ్రహించిరి. రాజ భక్తిపరులగుట వారా విషయములను గూర్చి వెంటనే మాకు వ్రాసిరి. అట్లు పంపిన లేఖలలో వల్లభ రాయనిది ముఖ్యముగా గణనీయమైనది. అందాత డనేక విషయములను గూర్చి యుద్ఘాటించి వ్రాసినాఁడు. అందును డిండిమ భట్టారకుల పుత్త్రుని గూర్చియు కల బరిగ సుల్తాను గూర్చియు నాతఁడు వ్రాసిన యంశము లవశ్యపరిగణనీయములు.

రాయలు:- మహామంత్రుల బుద్ధి నైశిత్య మనుపమానము; ప్రశంసార్హము. నిశ్చయముగా నీ విషయమును గూర్చి ప్రస్తావింప దలంచియే మిమ్మిరువుర రావించి తిని. కవిసార్వభౌముల కా విషయమును సవిస్తరముగాఁ జెప్పుడు.

ప్రధా: రాజనాథుఁడు పురప్రముఖులతో, రాయలవారే యన్యాయముగా దన జనకుని, బంధించి, యాతని జాడయైనఁ దెలియరాకుండఁ జేసిరనియు, దనతండ్రి పరాజయమునకు, ప్రభువుల శ్రీనాథ పక్షపాతమే కారణమనియు, చంద్రశేఖర క్రియాశక్తి యట్టి విద్వత్పరీక్ష గావింప నసమర్థుఁడనియు, జెప్పుచున్నాఁడఁట.

పురప్రముఖులలో గొందఱకు డిండిమునివిన నపారభక్తి విశ్వాసములు కలవు కదా! అందుఁ గొందఱాతని మాటలను విశ్వసించి రాయలవారియెడ ననూయా పరులగు చున్నారఁట. కావున నట్టి యపప్రథను బుట్టించుచున్న రాజనాథుని, బట్టి బాధింప వలయునని, యాతని ప్రథమ ప్రార్థనము. రెండవది కలబరిగె సుల్తానునకు సంబంధించినది. రెండుమూఁడు నెలల నుండి సుల్తాను సైన్య సంపాదన విషయమున నత్యంత శ్రద్ధను జూపుచున్నాఁడఁట. విద్యానగరమునుండి ప్రతిదినము నొక వార్తావహుఁడాతని కడకువచ్చి యెవ్వియో రహస్యములను దెల్పి కాగితములనిచ్చి మరలు చున్నాడఁట. కావున విద్యానగరమున నాతని కెవ్వరో గూఢచారులు గలరనియు, వారును సామాన్యులుగాక, రాజ్య తంత్రమును సర్వము నెఱింగిన వారనియు, నట్టి రాజ ద్రోహులనుబట్టి శిక్షింపవలె ననియు నాతని రెండవ ప్రార్థనము. ఆ రాజ ద్రోహులను బట్టుకొనుటకై తానును విశ్వప్రయత్నము చేయు చున్నాడఁట. కాని యాతని ప్రయత్నమింకను సఫలము కాలేదట. వారియునికి రాజధాని యందే కల దనియు, వారి నచ్చట బాధించుటయే సులభ కార్యమనియు నాతఁడు మరల మరల వ్రాసి నాఁడు. ఇంతవఱకుఁదాను వ్రాసిన యంశములు సర్వదా సత్యములనియు, నవ్వాని యెడ నుపేక్ష

వహించుట మూలముననే చేటు దెచ్చుననియు, నిష్కర్షగా వ్రాసినాఁడు. వల్లభరాయఁడు రాజభక్తి విశ్వాసములు కలవాఁడు సమర్థుఁడు. ఆతని వాక్యములు విశ్వాసార్హములనియే నా యభిప్రాయము.

శ్రీనాథ:- ఆతఁడు వ్రాసిన విషయమింతేనా? మఱేమైనఁ గలదా?

ప్రధా:- వ్రాసిన యంశము లనేకములు గలవు. అందుఁ బ్రధానములివియే. తక్కినవి వీనినే సమర్థింపుచున్నవి. సుల్తాను సేనాపరిమితిని గూర్చియు నద్దాని బలాబలముల గూర్చియు విపులముగ వ్రాసినాఁడు. విద్యానగర సైన్యమునందలి లోపాలోపములను గూడఁ జర్చించి, దాని నభివృద్ధిపఱచు మార్గములనుగూడ సూచించినాఁడు.

రాయలు:- (శ్రీనాథునితో) తమకు నాతనికి నపారమైన మైత్రి గలదఁట.

శ్రీనాథు:- (చిఱునవ్వుతో) అదియు నందుఁజెప్పినాఁడా?

ప్రధానా:- ఇంచుక సూచించినాఁడు.

రాయలు:- ఆతఁడును మహాకవియే కదా; ఈ మధ్య క్రీడాభిరామమను పేర నొక వీథిని రచించినాఁడఁట.

ప్రథా:- కాని యీ గ్రంథమును శ్రీనాథ కవిసార్వభౌముతే రచించిరనియు, నాతనికిని దమకును గల స్నేహము కారణముగా, నా గ్రంథము నాతనిపేరనే వెల యించిరనియు నొక కింవదంతి పండిత లోకమునఁ గలదు.

రాయలు:- అదెట్లు పొసగును. ఆ గ్రంథమునఁ బ్రత్యక్ష ముగ నాతఁడు రచించినట్లే కలదఁట కదా!

ప్రథా:- కాని యందలి ప్రత్యక్షరమునను శ్రీనాథ కవి సార్వభౌముల ప్రయోగ వైచిత్రియు, శయ్యాసౌ భాగ్యమును గోచరింపు చున్నవఁట.

శ్రీనాథు:- మహామంత్రులు జపము విడిచి లొట్టలలోఁ బడుచున్నారు. మన మిచ్చట సమావేశమగుట క్రీడాభిరామ కర్తృత్వ నిర్ణయమునకుఁ గాదుకదా! ఇప్పుడు కర్తవ్య మెద్దియో నిర్ణయింపుడు.

రాయలు:- కర్తవ్యమునకేమున్నది? రాజనాథుని భట్టు నవశ్యముగాఁబట్టి బంధింపవలయును. రాజ ప్రతి నిధులందఱు నా విషయము నేకగ్రీవముగ నంగీ కరించియున్నారు. నిన్ననే ప్రతాపరాయలు కూడ నిచ్చటికివచ్చి తన యభిప్రాయమున జెప్పినాఁడు.

శ్రీనాథు:- ఏమని?

రాయ:- రాజనాథుని బంధింప వలయుననీ. ఇట్టి రాజ ద్రోహమునకు శిరచ్ఛేదమే తగిన శిక్షయని యాతని నిశ్చయాభిప్రాయము.

శ్రీనాథు:- ధర్మసూక్ష్మము లాతనికిఁ దెలిసినట్లెవ్వారికిని దెలియవు. నిజమే రాజద్రోహమునకు శిరచ్ఛేదమే తగిన శిక్ష.

రాయలు:- మీరుకూడ రాజనాథుని శిక్షార్హుడనియే నమ్ముచున్నారు కదా!

శ్రీనాథు:- అట్లున్నటికిని గాదు, రాజనాథుఁ డెంతమాత్రమును శిక్షార్హుఁడు కాడు. సార్వభౌములొక ముఖ్య విషయమును మఱచుచున్నారు. రాజనాథుని తండ్రి నెవ్వఁడపహరించెనో, అతఁడే, యీ యుపప్లవను గల్పించినవాఁడు, అతఁడే కలబరిగె సుల్తానుతో నుత్తర ప్రత్యుత్తరములు నడుపుచున్నవాఁడు. అతఁడే రాజద్రోహి. శిక్షార్హుఁడు.

రాయలు:- కాని యాతఁడెవ్వఁడో తెలియ రాలేదు కద. అదే క్లిష్ట సమస్యగా నున్నది.

శ్రీనాథు:- రాజేంద్రా! సుల్తానుతో నెవ్వఁడు కలియఁజూచును. ఎవ్వఁడు నీ రాజ్యము నాశించునో వాఁడు, ఎవ్వఁడు నీ రాజ్యమున కాశించును. ఎవ్వఁడు నీయనంతర మీ సింహ పీఠము నధిష్టింప నర్హుఁడో యాతఁడు సామా

న్యాల కట్టి కుట్రలవలనఁ బ్రయోజన మెసుమంతయు నుండదు సరికదా, సుల్తానట్టి వారిని విశ్వసించి, నీపైఁ గత్తికట్టుటకు యత్నింపఁడు. ఈ రాజద్రోహి నిశ్చయముగా రాజ కుటుంబములోని వాఁడును, నీకత్యంత సన్నిహితుఁడునై యుండును.

ప్రథా:- ఈ సిద్ధాంతమున కన్వయించువారిద్దరే కలరు. సార్వభౌమపుత్త్రులో ? తత్సహోదరులో ? ఇందెవ్వరని తమ యభిప్రాయము.

శ్రీనాథు:- సార్వభౌముని పుత్త్రులాతని తరువాత నెట్లును రాజ్యార్హులే యగుచున్నారు ? వారేల యిట్టినైచ్యాను సంధానమును గావింపవలెను.

ప్రిథా:- కాని యిరువురును రాజ్యమునకు రాజాలరు కదా !

రాయలు:- కవి సార్వభౌము లీవిషయమున నిశ్చయముగా నమార్గమునఁ బోవుచున్నారు. నా పుత్త్రులపైఁగాని నా సోదరులపైఁగాని నాకెట్టి యనుమానమును లేదు. వారికి నాయెడ నపారభక్తి విశ్వాసములుగలవు.

శ్రీనాథు:- నాబుద్ధి యమార్గముననే పోవుచున్నదో, కుమార్గముననే పోవుచున్నదో, నేను నిశ్చయముగాఁ జెప్పఁజాలను. నేనట్టి పరిస్థితిలోఁ జిక్కికొంటిని. అమాత్యశేఖరా! మీరుచెప్పుఁడు. ఏది బలవత్తరము? ప్రత్యక్షమా? శబ్దమా?

ప్రధా:- ప్రత్యక్షమే బలవత్తరమని భాగ్గుల యభిప్రాయము. వారు శబ్దము నంగీకరింపనే లేదు. శంకరాదులు శబ్దము నంగీకరించిరి. కాని వారి యభిప్రాయానుసారముగను బ్రత్యక్షమే బలవత్తరము.

శ్రీనాథు:- అయిన నీయుత్తరమును దిలకింపుఁడు.

ప్రధా:- (అందుకొని చదివి) ఆశ్చర్యకరముగ నున్నదే. ఏమిది? ఇట్లగునని కలలోఁగూడ ననుకొనలేదు.

రాయలు:- ఏమది? అంత ఆశ్చర్యకరమగు నంశమం దేమి కలదు?

ప్రధా:- ప్రభువులే చిత్తగింతురుగాక.

రాయలు:- (అందుకొనిచదివి) ఏమిది? ప్రతాపుఁడా? కలబరిగె సుల్తానుతోఁగలిసి నాపైఁగుట్రలు పన్నుచున్నాఁడా? విశ్వసింపఁజాలను.

ప్రధా:- విశ్వసింపక గత్యంతర మేమున్నది. ఇది ప్రత్యక్ష ప్రమాణము కదా!

రాయలు:- ప్రత్యక్షమైనంత మాత్రమున సర్వదా అంగీకార్యముగాదు. ఇంద్రజాలికుఁడు చూపు వస్తు సముదాయము, ప్రత్యక్ష సిద్ధమేయయ్యు, క్షణములో నంతరించును. ఈలేఖ కల్పితము కాఁగూడదా?

ప్రధా:- రాజముద్రయుఁ గల్పితమేనా ప్రభూ?

రాయలు:- (మరల లేఖఁజూచి) ఇందు రాజముద్ర కూడఁ గలదు. కావున నీలేఖ కల్పిత మనరాదు.. (కోపముతో) ఔరా! ప్రతాపా! నాపైనే కత్తిఁగట్టు చుంటివిగా? ఎంతటి మోసము?

రాయల ముఖము క్రోధోద్రేకముచే నెఱ్ఱవడి పోయెను. ఆతని కన్నులు నిప్పులు గురియుచుండెను. ఆతని సర్వాంగములును గంపించుచుండెను. క్రోధకంపిత స్వరముతో నాతఁడిట్లు పలికెను.

రాయలు:- అమాత్యశేఖరా! ప్రతాపు నిప్పుడే పోయి బంధింప వలయును. (పండ్లు పటపట గీటుచు) రాజద్రోహి; భ్రాతృద్రోహి. వాని ముఖమింకఁ జూడరాదు.

శ్రీనాథు:- ప్రభువులించుక శాంతి వహింపవలయును. ఇట్టి విషయములయెడఁ బ్రశాంతత్వ మత్యావశ్యకము.

రాయలు:- ఇంకను శాంతి వహించుట యనఁగా నెట్టిది? వాని ద్రోహము ప్రత్యక్ష దృష్టమే కదా!

ప్రధాని:- అది నిజమే మహాప్రభూ! కాని, యిప్పట్టున నీతని బంధించిన నీతని యనుయాయులందఱు, నెవరికివారే సద్దుసద్దుగ నడగిపోయి తప్పించు కొందురు. సమయము దొరికినంతనే మరలఁ గుట్రలు పన్నుదురు. ప్రతాపుని యనుయాయులుకూడ సామాన్యులు కారనియే నా యభిప్రాయము.

రాయలు:- అయినఁ గర్తవ్యము?

ప్రధా:- ప్రతాపునిపై నొక కన్నుంచి యాతని చర్యల గను నింపుచుండుట. నిపుణులగు గూఢచారులను రాజ్యమందంతటను నియోగించి, శత్రు రహస్యములను దెలిసికొనుట, రాజధానియందుఁగూడ గూఢచారుల నియోగించి, ప్రతాపుని యనుయాయు లెవ్వరో తెలిసికొనుట. శత్రు రహస్యము సమూలముగను బ్రతాపుని యనుయాయివర్గము నిశ్శేషముగను దెలిసిన పిదపఁ బ్రతాపుని సపరివారముగ బంధించుట కర్తవ్యములు.

రాయలు:- (అమాత్యునితో) కవిసార్వభౌములు మనకొనర్చిన సాహాయ్య మనుపమానము. వారికి మనయెడఁగల యనురాగ మపారము. (శ్రీనాథునితో) ఆర్యా! యీ లేఖ తమ కెకడ లభించినది?

శ్రీనాథు:- ఒకానొక పనిపై మా దుగ్గనయు భీములును, విద్యానగర ప్రాంతారణ్యములఁ బడిపోవుచుండగా, మార్గమధ్యమున, నీలేఖ యొకవార్తావహుని కడ వారికి దొరికినది.

రాయలు: ఆవార్తా వహుఁడేమైనాఁడు? ఆతనిఁ బట్టి బాధించిరా?

శ్రీనాథు:- బాధించిరి. కాని వాఁడు మధ్యే మార్గముననే విషముఁ దిని మరణించినాఁడు.

రాయలు:- అటులనా; కాని యీ లేఖకుఁ బ్రత్యుత్తరము రాకపోవుట చేతను, వార్తావహులుఁ గూడఁ దిరిగి రాకపోవుట చేతను, వారనుమానములకులోనై తదన్వేషణపరులై యుందురని నాయభిప్రాయము.

ప్రధా:- అందులకే యిప్పట్టునఁ బ్రతాపునిపై మనమెట్టి చర్యయుఁ దీసికొనరాదని నేను మనవి చేసికొని యున్నాఁడను. ఏమియు నెఱుఁగనట్లే మనము నటింపవలెను.

శ్రీనాథు:- ప్రధానామాత్యుల యభిప్రాయముతో నే నేకీభవించు చున్నాను.

రాయలు:- సరే; మీయిరువురి యభిప్రాయమును నేకమైనప్పుడు, అది యవశ్యాచరణీయమేకదా!

ప్రధా:- ప్రభూ! నాదొక చిన్న మనవి.

రాయలు:- ఏమి?

ప్రధా:- తమకడ కిరువురు సేవకులను బంపుదును. వారిని తమ కడ నహర్నిశములు నుంచుకొనవలయుననియు, వారిని వీడి యొక్క క్షణముగూడ నుండరాదనియు! నా ప్రార్థన. ప్రభువులు నిదురించునప్పుడు గూడ వారు మీకడనే యుందురు.

రాయలు (నవ్వుచు):- అట్లేకానిండు.— కవిసార్వభౌమా! యీ లేఖను బట్టియు, నిది సంపాదింపఁబడిన విధమును బట్టియుఁ జూడగా, మీకింతకుఁ బూర్వమే యీరాజద్రోహుల యానుపానులు సర్వమును దెలిసినట్లున్నవే. కాని మన సంభాషణ ప్రారంభమున మీరేమియు నెఱుఁగనట్లే నటించిరి.

శ్రీనాథుః- నేను నటించుటలేదు. ప్రభువుల యభిప్రాయ మీవిషయమున నెట్లున్నదో తెలిసికొనుట నాకు ముఖ్యకర్తవ్యము. ప్రభుచిత్తము సమార్గముననే పోవుచున్నచో నద్దానినిఁ బ్రోత్సహించుటకును, అమార్గమునఁబోవుచున్నచో, నద్దానిని మరలించుటకును నిశ్చయించితిని. ధర్మజిజ్ఞాసువులము మాత్రమే మేము. రాజు ధర్మకారకుఁడు. ధర్మప్రతిష్ఠాపన సమర్థుఁడు.

రాయలు:- (నవ్వుచు) కవిసార్వభౌములు మహా గంభీరులు.

17 వ ప్రకరణము.

అది శ్రీనాథ భవనప్రాంగణము. కవిసార్వభౌముఁ డిటునటు పచారు చేయుచున్నాఁడు. క్షణ క్షణమునకు నాతని ముఖ విలాసాదులు మారుచున్నవి. ఒక్కొక్కప్పుఁ డాతని భ్రూయుగళ మాకుంచితమగుచున్నది. విశాలోన్నత లలాటమున ముడుతలు గన్పట్టుచున్నవి. నడుమ నాతఁ

డొక్కకు మారాగుచు, మరల నడుచుచు, మరల నాగుచు, నేవేవో సంజ్ఞలు చేతితోఁ జేసికొనుచుఁదిరుగుచున్నాఁడు. అప్పటి యాతని ప్రవర్తన మాతని చిత్త సంక్షోభమును దెలియఁజేయుచున్నది. ఆతనితోడనే దుగ్గనయు భీములు నున్నారు.

శ్రీనాథు:- భీములూ! మన మిప్పుడొక విషమ పరిస్థితిలోఁ జిక్కుకొంటిమి. ఏమందువు?

భీములు:- అవునే; నిజముగా విషమమగు పరిస్థితియే. ఒక వంక రాయలను గాపాడవలయును, వేఱొకవంక మన ప్రాణముల కపాయము రాకుండఁజూచుకొనవలెను. ముందు గోయి వెనుక నూయి; ఎటుకదలుటకును వీలుండదు.

శ్రీనాథు:- నిజముచెప్పితివి; మన మిప్పుడేమిచేయవలెనో, ఎట్లు చేయవలెనో, నాకుఁదెలియుట లేదు.

దుగ్గన:- తెలియుటకేమున్నది; ప్రథమ కర్తవ్య మీ యూరు వీడుట; ద్వితీయ కర్తవ్యము మన యూరు పోవుట. ఈ రాజకీయపు రొంపిలోఁబడినఁ దప్పించుకొనుట మహాకష్టము.

నాథు:- ఈ సమయమున మీరాచలమే యున్నచో ......

శ్రీనాథుని వాక్యమింకను ముగియనే లేదు. మా

చలయు మందారవల్లియు నచ్చోటికే తెంచి, మహాకవి పాద పద్మములపై వ్రాలిరి. ఆనంద పారవశ్యముచే శ్రీనాథుఁడు తన కన్నులను దానే నమ్మజాలకపోయెను. దుర్గనయు భీము లును స్థాణువులవలె నట్లే నిలిచియుండిరి.

శ్రీనాథు:- ఏమిది ? మాంచలయా ? ఎట్లువచ్చితివి ? ఇన్ని నాళ్లెచ్చటనుంటివి ? మందారవల్లియు నీతోనే యున్నదా ? అంతయు నింద్రజాలమువలె నున్నదే ?

మాంచలదేవి మహాకవి పాదపద్మముల నుండి లేచి, యా పాదధూళి శిరముపై నుంచుకొనినది. మందారవల్లియు నట్లే చేసినది. శ్రీనాథుఁడాయిరువుర నాశీర్వదించి, "అమ్మా! మీ యుదంత మంతయు, నామూలాగ్రముగఁ జెప్పుడు. వినఁ గుతూహలముగనున్నది" అని యనినాఁడు.

అంతట నామె, తాను మందారవల్లితో లీలోద్యా నమున విహరింపుచుండగాఁగొందఱు పురుషులు వెనుకనుండి వచ్చి, తమ కన్నులకు గంతలుగట్టి, తమ్ముబంధించి, యొక శకటమునఁబడవైచి, మారుమూల సందుల ద్వారమునఁదీసి కొనిపోయి యొక కారాగారమున నిర్బంధించుటయు; నందే డిండిమ భట్టారకులు నాతని పుత్రికయు నుండుటయు, నతి దుస్సహములగు కష్టముల ననుభవించుచుండుటయు, శ్రీనా థునితోఁజెప్పినది. శ్రీనాథుఁ డంతయుఁబ్రశాంతముగ నాల కించెను.

శ్రీనాథు:- అమ్మా! అట్టి మహనీయుని, పుంభావ సరస్వతిని, దుస్సహాకష్టముల పాల్జేసిన, యా పాపాత్ముఁడెవ్వఁడో నీకుఁదెలియునా ?

మాచల:- తెలియును. ఆతఁడు మీకును దెలిసినవాఁడే. విద్యానగరమున నాతని పేరు తెలియనివారు లేరు.

దుగ్గన:- ఎవ్వఁడాతఁడు ? సార్వభౌముఁడు కాఁడు కదా !

మాచల:- శివశివా (చెవులు మూసికొనును.)

శ్రీనాథు:- (కోపముతో) దుగ్గనా !

దుగ్గన:- అపచారము ; క్షమింపుఁడు. ఆమె వర్ణన మట్లుండుటచేఁదొందర పడితిని.

శ్రీనాథు:- సరిలే ; దానికేమి ; అమ్మా ! నీ వందుండి యెట్లు తప్పించుకొంటివి ? సవిస్తరముగఁ జెప్పుము ? నిన్నాతఁడెట్టి యిక్కట్టులకును లోఁజేయలేదు కదా !

మాచల:- నన్నాతఁడు హింసింపలేదు ; నేనక్కడనున్నంత కాలము నన్నుఁ జూచుటకే రాలేదు.

శ్రీనాథు:- అమ్మా ! దాచకఁ జెప్పుము ; మున్నాతని నీ వెఱుంగుదువా ?

మాచల:- (మౌనము) ... .

శ్రీనాథు:- సరే ; తరువాతి సంగతి ? నీ వెప్పుడైన డిండిములనుగాని, సర్వమంగళనుగాని చూచితివా ?

మాంచల:- చాలసారులు చూచితిని. ఒకమారు సర్వసుంగ శినుఁగూడ నామె జనకుని దఱికిఁదీసికొని పోయితిని.

శ్రీనాథు:- వారిరువురు నొకచో బంధింపఁబడలేదా?

మాంచల:- లేదు. దూరదూరమున నున్న గదులలో బంధింపఁ బడిరి. నాకించుకస్వేచ్ఛ లభించినది. ఆ యావరణలో నా యిచ్ఛవచ్చినట్లు సంచరించుటకు నా కనుజ్ఞ దయచేసినారు. నా యిచ్ఛవచ్చిన వారితో నేను బోయి మాటాడవచ్చును. వారు మాత్రము నా దగ్గరకు రావీలులేదు. నేనెట్లయిన నందుండి తప్పించు కొని వచ్చుటకుఁ బ్రయత్నము చేయుచుంటిని. కాని ఫలసిద్ధి మాత్రము కాలేదు. ఎవ్వరో యొకరు, కావలా కాయుచు మేలుకొనియే యుండెడివారు. ఇట్లుండగా, నిన్న రాత్రి నేనును నా నెచ్చెలి మందార వల్లియు నుబుసుపోకకై యుద్యానవనమున సంచ రింపుచుండగా, నెవ్వరో పురుషులు మా కన్నులకు గంతలుకట్టి, కాలుసేతులు బంధించి, యొక శకట మునఁబడవైచిరి. శకటము వాయువేగ మనోవేగము లతోఁబోయినది. కొంత దూరము పోయిన తరువాత, నా యశ్వశకటమాగినది. మమ్మిరువురను గ్రిందకు దింపి, వారు మఱలిపోయిరి. పోవునప్పుడు మాత్రము, వారు మా బంధముల నన్నిటిని విప్పిపోయిరి. వారతి

త్వరితగతినే గూటచేతను, హఠాత్సంభవమగు నా విప రీత పరిస్థితిచేతను, మేము వారి ముఖములు చూచుట కవకాశములేక పోయినది. తరువాత మేమిట్లు నటుం జూడంగా నది పిరుపాక్ష దేవాలయమని, తెలిసినది. కూడి కూయుపటకు సందేశయనించి, యిప్పుడిచ్చోటుం జేరితిమి.

భీములు:- ఇదియెనితయు నద్భుతావహమైయున్నదే. మొందట నిన్నేల బంధించిరి? తరువాత నిన్నేల విడిచిరి? అంతయు నయోమయముగానున్నది.

శ్రీనాథు:- అయోమయము నికేమున్నది? అంతయు స్ఫటిక మయమే. అంతయు సుస్పష్టమే.

భీములు:- ఎట్లు?

శ్రీనాథు:- ఈమెను బంధించిన వారొకరు; విడిచి పుచ్చిన వారింకొకరు.

మాచల:- (ఆశ్చర్యముతో) అదెట్లు గురుదేవా! నన్ను విడిపించిన యాపుణ్యాత్ములెవ్వరు?

శ్రీనాథు:- పుణ్యాత్ములో పాపాత్ములో నేనది చెప్పంజాలను. ఉన్న విషయమిది. నిన్ను బంధించినవారికి నీపైంగోపము లేదు. ఉన్నచో నీ కట్టి స్వేచ్ఛ యెన్నడును లభింపదు. కాని వారికి నీయెడంగొంచ మనుమానము కలిగియుండును. వారి యానుపానులు నీకేమైన

దెలిసినవేమోయని వారి యనుమానము. తెలిసినచో, వానిని నీవు నాకుఁదప్పక చెప్పెదువని వారినిశ్చయము. కావున వారి కార్యసిద్ధియగు వఱకు నిన్ను నిర్బంధనలో నుంపఁదలంచిరి. డిండిముల యెడ నారికి గోపకారణము కలిగియుండును. కావుననే యాయన నట్టియిడుముల పాల్సేయుచున్నారు. సర్వమంగళ యెడ వారికేమైన దురభిప్రాయము కలదేమో. లేకున్న నామెను వేఱుగా నేల యుంచవలయును? ఇఁక డిండిమ భట్టారకుల విడువకుండుట చేతనే వారికిఁ గార్యసిద్ధియింకను గాలేదని నిర్ణయింప వచ్చును. అట్టియెడ నిన్నుమాత్ర మెట్లు విడువగలరు? నిన్ను బంధించిన వారికినీ వీవలనున్న భయకారణమిదు; నిన్ను వదలిన వారికి, నీవు కారాగారమున నున్ననే భయని దానమవు. ఇట్లు భిన్నాశయముల కాస్పదము లైన యీ బంధమోక్షములు రెండు నేక కర్తృకము లెన్నటికిని గాఁజాలవు. మఱియు నిన్ను బంధించిన వారికి, విడిపించిన వారత్యంతాప్తులైయుండురు.

మాచల:- అదెట్లు గ్రహించితిరి?

శ్రీనాథు:- లేకున్న నీ కన్నులకు గంతలుకట్టరు. నిన్ను బంధించిన స్థలమెచ్చట నున్నదో, నీకుఁదెలియ రాదని వారి యుద్దేశము. అందు బంధమోక్ష కారకు లిరువురు నొక్కటే యభిప్రాయముగల వారే

మాచల:- గురుదేవుల బుద్ధిసూక్ష్మత యప్రతి మానము.

శ్రీనాథు:- నీవు నన్ను బ్రశంసింపవలయునని నే నీ యంశము లన్నియుఁజెప్పలేదు. నాయుద్దేశము వేరు. నిన్ను బంధించినవారి యాశయమింకను సఫలీకృతము కాలేదనియు, నా ఫలసిద్ధికై వారు సర్వప్రయత్నములను జేయుచునే యుండురనియు, బంధ విముక్తి కలిగినంత మాత్రమున నీవు ప్రమత్తురాలవై యుండరాదనియు, నీపాటికి నీ జాడలరయుటకై గూఢచారులు పట్టణమంతయు దిరుగుచుండురనియు నా యభిప్రాయము.

మాచల:- అయిన నే నిప్పుడేమి చేయవలయును ?

శ్రీనాథు:- నీవు చేయవలసిన పని చాలఁగలదు. సకాలమునకే నిన్నిటకుఁబంపిన పరాత్పరుని యనుగ్రహ విశేషము శ్లాఘ్యము. అమ్మా ! నీవు నేర్చిన విద్యలన్నియు నీనాఁడు సఫలీకృతములగుచున్నవి.

మాచల:- అనుగ్రహింపఁబడితిని.

శ్రీనాథు:- నీవు సర్వశాస్త్రములు నాకడ నభ్యసించితివి. నాట్య, సంగీతములలో నపార ప్రజ్ఞను గడించితివి. వీనికిఁదోడు ఖడ్గసాధనమునందును, బాకు పట్టుటయందును, నీ వగణ్య నైపుణ్యమును సంపాదించితివి. ఇట్టి సర్వతోముఖప్రజ్ఞా విశేషముగల నీవు, గురుతరమగు నొక కార్యభారమును వహింపవలయును.

మాచల:- గురుదేవుల యాజ్ఞను శిరసావహింప సంసిద్ధురాలను. నా సర్వస్వమును మీ యధీనము. మీరు కోరిన, నా ప్రాణముల నర్పించుటకుఁగూడ నేను వెనుదీయుదానను గాను.

మందారవల్లి:- మహాశయా! నేనును మా నెచ్చెల తోడిదాననే సుడీ.

శ్రీనాథు:- అవునమ్మా! నీవు నంతటిదానవే. నాకా విషయము వేఱుగఁజెప్పవలయునా? కాని నీవు కొంత కాలము మీ - నెచ్చెలి నెడబాసియుండవలెను. కార్యగౌరవమట్టిది. ఇందు తర్క వితర్కముల కవకాశము లేదు.

మందా:- చిత్తము. తమ యాజ్ఞానుసారమే నడచుకొనెదను.

శ్రీనాథు:- మీ సఖి వచ్చువఱకు నీవు మా యింటనే యుండుట శ్రేయస్కరము.

మందా:- చిత్తము.

మందా: (మాచలతో) సఖీ! నీవు మొన్న నాతోఁజెప్పిన వృత్తాంతమును గురుదేవులతోఁగూడఁజెప్పరాదా? అయ్యది వారికేమైనఁబ్రయోజనకారియగునేమో.

మాచల:- అవునవును. మరచినాను. ఎంత పొరపాటు.

శ్రీనాథు:- ఏమది? అంత ముఖ్యవిషయమా?

మాచల:- ముఖ్యమో కాదో నేను నిశ్చయముగాఁజెప్ప జాలను. కాని నేను విన్నయంశముల నున్నవి యున్నట్లుగాఁజెప్పెదను. తరువాత మీకుఁదోచినట్లు నిర్ణయింపుఁడు. (ఇటునటు సాభిప్రాయముగఁజూచును.)

శ్రీనాథు:- ఇచ్చట నెవ్వరును బైవారు లేరు. అందఱును మన యాంతరంగికులే. చెప్పుము.

మాచల:- నేను కారాగారమున నున్నప్పుడొకనాటిసాయంసమయమున నా యారామవాటికలో నిటునటుఁదిరుగాడుచుంటిని. అట్లుతిరుగుచు నందొకమూలకు దూరమున నున్న యొక బావికడకుఁబోయితిని. అందుఁబుష్పజాతు లనేకములు గలవు. నాకుఁగావలసిన గూలాబులేరుకొని వత్తమని నా యభిప్రాయము. అంతలోఁజీకటులు నలుమూలల నలముకొన్నవి. ఒకరిముఖ మొకరికిఁగానవచ్చుటలేదు. నే నచ్చటి పుష్పసౌరభమున కమందానందము నందుచు నందే కొంతవడికు మసలితిని. అంతటఁజంద్రోదయమైనది. అమృతకిరణునిచల్లని వెన్నెల లాయారామమంతయుఁబ్రసరించి, యందలి పుష్పనికుంజములకు నూత్న విలాసము నొసంగినవి. ఆ చల్లని వెన్నెలలో, నా మందపవన ప్రచలిత కుసుమిత నికుంజపుంజములలో నే నొక చంద్రకాంత శిలావితర్దిపై నాసీననై, యా ప్రకృతిశోభనవలోకింపుచు, నట్లే మైమఱచి, కొంతసేపుంటిని.

దుర్గ:- (భీములుతో మెల్లగ) ఈమె, మా బావ కవిత్వము వలె, నసలు విషయమును జెప్పక యనావశ్యక వర్ణనలం బెంచుచున్నది. ఈమె యుద్యానవన విహార వర్ణన మెవ్వరికిం గావలయును.

భీములు:- (మెల్లగ వారించి) మాటలాడకుము. ఆమె వినం గలదు.

మాచల:- అట్లెంతసేపుంటినో నాకే తెలియదు. అంతలో నా సమాధికి భంగముం గలిగింపుచు నేదో యడుగుల చప్పుడువలె వినవచ్చినది. మొదట దొంగలేమోయని మిగుల భయమందితిని. అంతలోనే యా దుర్గము మహా బలిష్ఠమై యుండుటయు నద్దానిద్వార మెల్లపుడు మూయంబడియే యుండుటయు, జ్ఞప్తికి వచ్చినవి. అంత దొంగలను భయము తొలంగిపోయెను. ఇంక వారెవ్వరో, అట్టిసమయమున వారచ్చట నేమి చేయుచుండిరో తెలిసికొనవలెనను కుతూహలము జనించినది. అప్పుడు వారికిం గానరాకుండ నా సమీపమున నేయున్న యొక నికుంజమున దూరితిని. వారును, నేనను కొనినట్లే, అచ్చోటికే వచ్చి, యటు నిటుం జూచి, యందెవ్వరును లేకుండుట కలరి, యా చంద్రకాంత శిలావితర్దిపైనే యాసీనులైరి.

శ్రీనాథు:- వారెందరు ? నీవు వారిని జూచితివా ?

మాచల:- వారిద్దరు. వారిముఖములు నాకిదివరకు పరిచితములుకావు. వారియుడుపులనుబట్టిచూచినచో, వారంత నాగరకులవలెఁ గానరాలేదు. కోర మీసములును, బుంజురు వెండ్రుకలు, నరుణారుణములై, భయంకరము లగు నేత్రములును, వారెట్టి క్రూరసాహస కార్యము నకైన వెనుదీయువారు కారని, నాకు సుస్పష్టము చేసినవి. వారుచేయు వికార చేష్టలను బట్టియు, వెకిలి నవ్వులను బట్టియు, నలుపక్కల గుప్పుమని యలము కొనుచున్న దుర్వాసనను బట్టియు వారు తీవ్రమగు మద్యమును గ్రోలియుండిరని నే నూహించితిని. వారు త్రాగియుండుటచే, వారి వాక్యము లస్పష్టములై యన న్వితములై యుండెను. వారి వికటాట్టహాస ధ్వనిలో వారి యస్పష్ట వాక్యములు తఱచుగ నంతరించి పోవు చుండెను.

దుర్గన:- (భీములతో) తుదకేమో చెప్పఁబోవునదేమి ? ఉద్యాన వనమున విహరించితిననియుఁ గ్రూరాకారులగు నిర్వురు మనుజులను జూచితిననియునా ?

భీము:- (మెల్లగ) ఉష్; నీ నోరు మూయవుకదా !

మాచల:- కాని వారి ప్రసంగమును నే నంత శ్రద్ధగా నాలకించుటకుఁ గారణము కలదు. వారి మాటలలో సార్వభౌముని నామము రెండు మూడు మారులుచ్చరింపఁ బడినది.

శ్రీనాథు:- ఎట్లు? సార్వభౌముని నామమే? మఱెవ్వరి పేరైన విన వచ్చెనా?

మాచల మౌనముతోఁ దలవంచుకొని యూరకొనును. ఆమె కన్నులు చెమ్మగిలుచుండెను.

శ్రీనాథు:- బిడ్డా! ఇది గుర్వాజ్ఞ.

మాచల:- చిత్తము; రాయలసోదరుని పేరును విన వచ్చినది.

శ్రీనాథు:- ప్రతాపుఁడా?

మాచల:- ఔను.

శ్రీనాథు:- ఇంకను నీవు వినినదేమైన నున్నదా? సవిస్తరముగఁ జెప్పుము.

మాచల:- బృందావనమనియు, హత్యయనియు, విందులనియు విరుకు సందులనియు నేవో పదము లసన్వితములై విన వచ్చినవి.

శ్రీనాథు:- (తలపంకింపుచు నించుక సేపుండి) అమ్మా! అంతయు నర్థమైనది. వారి వాక్యము లనన్వితములు నర్థశూన్యములును గావు. వానిలో బ్రహ్మాండమంత యర్థమున్నది. ఈ నీ యుపకృతి యమూల్యమైనది.

మాచల:- అనుగ్రహింపఁ బడితిని.

శ్రీనాథు:- బిడ్డా! నీ వృత్తాంతమంతయుఁ జెప్పితివి కాని నిన్ను బంధించిన వాని పేరైనను జెప్పితివి కావే

మాచల:- గురుదేవా! మీ దివ్యబుద్ధి కగోచరములగు విషయములు గలవా? నేను వేఱ చెప్పనేల?

శ్రీనాథు:- (గభీరముగ) అమ్మా! సర్వశాస్త్రముల నామూల చూడముగఁ జదివిన నీకు నే నుపదేశింప వలసిన దేమి యును లేదు. కాని యొక్క ముఖ్యాంశమును మాత్రము మఱువకుము. ఆర్యధర్మ మతికఠినమైనది. తన్నిర్వహణ ముపట్ల, మనుజుఁ డైహిక సుఖములను బరిత్యజింప వలెను. లోకక్షేమము నాలోచించి, ధర్మసంగ్రహము ను గణించి, నీ కేది యుచితమని తోచిన నదియే చేయుము.

మాచల:- గురుదేవా! ఇదే నా ప్రతిన వినుఁడు. తుచ్ఛములగు నైహికవాంఛలకులోనై నే నెన్నడు నధర్మ పక్షము నవ లంబింపను. 'బ్రహ్మదత్త వరప్రసాదులును', బ్రహ్మ వేత్తలును, బ్రహ్మాండాది మహాపురాణ విజ్ఞాన ధనులును, నధ్వర్యువేదశాఖాధీతి నిష్ణాతులునగు మద్గురు దేవుల, నిర్మల యశశ్చంద్రికలఁ గళంకితము గావింపను. హేయమగు నా శరీర సౌఖ్యమునకై దేశ

మంతయు నగ్నిజ్వాలాముఖమునఁ బడిపోవుచుండగాఁ జూచుచు నూరకుండుదానను గాను. ఇదె మీ పాదము లాని ధర్మదీక్షను గ్రహించుచున్నదానను. గురుదేవా! ఆనతిండు; ఈ దేహము మీది.

అందఱు నాశ్చర్యచకితులైరి. ఆమె ముఖమండలమున, దివ్యమగు నొక తేజఃపుంజము తాండవించుచుండెను. ఆమె వాక్యములలో నమరవాణి నర్తించుచుండెను. ధర్మదేవత ధనుష్టంకారము చేయుచుండెను. శ్రీనాథుని కన్నులవిరళా నందాశ్రు పూర్ణములయ్యెను. తనపాదములపై వ్రాలియున్న యయ్యుదార చరిత్రశిరమును దన పవిత్ర దక్షిణ హస్తమున స్పృశింపుచు,హర్షగద్గద స్వరము నిట్లాశీర్వదించెను.

"అమ్మా! నీ జీవితము ధన్యము. నీ యశశ్చంద్రిక యాచంద్రతారార్కముగ నిల్చుగాక"

18 వ ప్రకరణము.

"దేవా! ఏ నంశుమంతుండను వాఁడ. కలియుగార్జున బిరుదాంకితుఁడ. విలువిద్యయం దారితేఱినవాఁడ వివిధములగు లక్ష్యము లేయగలను. కఠినాతి కఠినములును, సూక్ష్మాతి సూక్ష్మములునగు లక్ష్యము లెవ్వియైన నేయఁగలను. శబ్ద భేద్యాదులు నాకుఁ గరతలామలకములు. కార్ముకవిద్యా పరిశ్రమయందు దేవరయు సిద్ధహస్తులని యెఱింగి, యిచ్చోటి కేతెంచితి. దేవరవారు నా కరలాఘవమును బరీక్షింతురుగాక."

ఇట్లు నిండుకొలువునందన యెట్టయెదుట నిల్చి ప్రౌఢ గంభీర వాక్యముల నుచ్చరించు, పురుషుని ప్రౌఢదేవరాయలు తేఱి పారజూచెను. అతఁడు సముత్తుంగ దేహుఁడు. విశాల వక్షుఁడు. దృఢమాంసల శరీరుఁడు. క్రూర రక్త నేత్రుఁడు. ఆతఁడు తన సుదీర్ఘ కేశపాశములను దువ్వి ముడివైచినాఁడు. ఆతని తలపై నుష్ణీషము లేదు; భుజములపై నుత్తరీయమును లేదు. ముదక దోవతి నొకటి వెనుకకు విరిచికట్టి పులి తోలుతో దాని నదిమి కట్టినాఁడు. మెడలో గురివింద చేరులు ధరించినాఁడు. వలకేలి నాశీవిషోపమంబగు నొక యమ్ము బట్టి దాపలి కేల నారి సడలించిన ధనువును బట్టినాఁడు. పృష్ఠభాగమున నమ్ములపొది గట్టినాఁడు. జ్యాకిణాంకితములైన యాతని ముంజేతులాతని యస్త్రవిద్యా నిరంతర పరిశ్రమను వ్యక్తము సేయుచున్నవి. కండలు తేఱి దృఢమైయున్న యాతని దేహయష్టి యాతని నిరంతర దేహపరిశ్రమకుఁ దార్కాణముగా నున్నది. సునిశిత ములైన యాతని తీక్ష్ణదృక్కులాతఁడెట్టి లక్ష్యమునైన నేయ గలఁడని వ్యక్తము చేయుచున్నవి. ఆతని వేషమంతయు నాట వికము. భాషయంతయు నాగరకము.

రాయలు, మహామంత్రి వైపు చూచినాఁడు. మహామంత్రి యాధనుర్ధరు నిట్లు ప్రశ్నించినాఁడు.

మహా:- "నీ దేయూరు? నీ వృత్తాంతమంతయుఁ బ్రభువులకు సవిస్తరముగా నివేదించుకొనుము?."

అంశు:- మంత్రిసత్తమా ! నా పుట్టు పూర్వోత్తరములతో మీ కేమి ప్రయోజనము ? నే నిక్కడ నేమి వివాహ సంబంధమునకు రాలేదు కదా ! నే నున్నాఁడను. నా యస్త్రసముదాయ మున్నది. నా విద్యా విశేషముల నారసి నన్ను ననుగ్రహింపుఁడు. ఆసేతు శీతనగమును జుట్టి వచ్చినాను. ఎందును గార్ముక విద్య నాదరించిన ప్రభువే లేఁడు. వారందరు కేవల ఖడ్గ చాలనముతోడనే తృప్తిఁబొందు చున్నారు. ఇప్పుడు నా యదృష్టము పండినది. నేటికిఁ గూడ నీ విద్యయం దఖండ పాండిత్యమును సంపాదించి, సకల జగజ్జేగీయమానకీర్తి సాంద్రులైన ప్రభువులు విద్యానగరమును బాలించుచున్నారు. నా విద్యా నైపుణ్యమును బరిశీలింపుఁడు. లేని పోని ప్రశ్నలతో నేమి పని.

సార్వభౌముని ముందర నిట్టి ప్రగల్భవాక్యముల నింతకుముందెవ్వరు నాడి ఎరుఁగరు. సభ్యులందరు సార్వభౌముని వంకకు, నంశుమంతుని వంకకు నేకాగ్ర చిత్తముతోఁ జూచు చుండిరి. కొంచెముసేపూరకుండి మహామంత్రి మరల నాతని నిట్లు ప్రశ్నించెను.

మహా:- సార్వభౌముని వలన సన్మానము నపేక్షించినవారు తమ కుల గోత్రాదికమును జెప్పియే తీరవలయును. అట్లు చెప్పనినాఁడు, వారి కళానైపుణ్యమును వారి కడనే యుంచుకొని, వచ్చినదారినే మరలి పోవుట

యుచితము. విద్యావంతుల నవమానించు నుద్దేశము విద్యానగర ప్రభువుల కెన్నడును లేదు. కాని యిది రాజనీతి. వచ్చిన వాని వంశమర్యాదల నెరుంగకయే వాని కాశ్రయమిచ్చుట రాజ ధర్మము కాదు. ఈ విషయమునఁ జెప్పవలసినది చాల గలదు. కాని యది యంతయు నిట నప్రస్తుతము. ఇది సార్వభౌముని యిచ్ఛ;

అంశు:- ప్రభువుల యిచ్ఛయే యాజ్ఞ కదా ! కాని నా మనవి యొక్కటి చిత్తగింపుఁడు. నా వృత్తాంతమును నే నిప్పుడు చెప్పెదననుకొనుడు. కాని యది సత్యమో అసత్యమో మీ రెట్లు నిర్ణయింప గలరు ?

మహా:- ఆ విషయము నీ కనావశ్యకము. పెక్కుమాటలాడక, నీ యుదంతమును జెప్పెదవా ? లేక యీ యాస్థాన మును వీడి పోయెదవా ?

అంశు:- దేవరవారి యాజ్ఞ. నా జీవితమునఁ జెప్పదగిన దంతగా లేదు. నేను గోదావరీ తీరవాసిని. ఆటవికుఁడను. విలువిద్య మా కులవిద్య. మా కులగురువులు దానిని నేర్పినారు. నే నందు బహుపరిశ్రమ చేసితిని. అంతే.

మహా:- నీ తలి దండ్రులు ?

అంశు:- నా తండ్రి మంగిదొర. నా తల్లి సీతమ్మ.

మహా:- నీ యుచ్చారణము నీవు విద్యావంతుఁడవని చెప్పక యె చెప్పుచున్నది. ఆటవికుల మెస నీ యందుఁగాన రాదు. అది యెట్లు సమర్థింపవచ్చును.

అంశు:- సమర్థించుట కేమున్నది మంత్రి సత్తమా! మా యూరి పరిసరమున నొక తపస్వికలఁడు. ఆతనికడ నేను చిన్ననాఁట విద్యాభ్యాసముచేసినాను.

మహా:- నీవు చెప్పఁదలంచుకొన్న దింకేమైనను గలదా ?

అంశు:- లేదు.

మహా:- సరే; ఇఁక నీవు పోవచ్చును. సాయంసమయమగు సరికి ప్రభువుల యుద్దేశము నీకుదెలుపఁబడును.

అంశు:- చిత్తము. అనుగ్రహింపఁబడితిని.

అనంతరము సార్వభౌముఁడు సభవీడి యేకాంతమందిర మునకు మహామంత్రి సమేతముగా జనినాఁడు. సభ్యులందరు మాత్రము, కలియుగార్జునుని ప్రజ్ఞావిశేషమును జూడ నాతురత పడుచుండిరి. సభ్యుల మనస్తత్త్వమును సార్వ భౌముఁడు గ్రహించినాఁడు. ఏకాంత మందిరమున మహా మంత్రియు సార్వభౌముఁడు నాసీనులు కాగానే, సార్వ భౌముఁడే ముందిట్లుపక్రమించెను.

"కలియుగార్జునుని గూర్చి మీ యభిప్రాయమేమి ?"

"ఆతఁడనుమానింప దగినవాఁడని నాయభిప్రాయము."

"ఏల ?"

"నే నీ యభిప్రాయమును సకారణముగా నిప్పుడు నిరూపింపఁజాలను"

"ఊరకే ఆతనియెడ మన మేల దురభిప్రాయముపడ వలయును. ఆతని కొక సదవకాశముఁ గల్పించినందు వలన మన కేమి నష్టము కలదు."

"ప్రభూ ! కారణములు నే నిప్పుడు చెప్పఁజాలనని చెప్పితిని గదా ! ఏలకో నాయంతరాత్మ ఆతఁడు మాయావియని చెప్పుచున్నది"

"కాని సభ్యులు మిక్కిలి కుతూహలముగా నున్నారు. వారిని చిన్నపుచ్చుట మనకు సమంజసమా"

"ప్రభూ ! సమయము చాల విషమముగా నున్నది. రాజ్యమున నంతశ్శత్రువులు పెచ్చు రేగు చున్నారు. వారిని బట్టి నిర్మూలించు వరకు ప్రభువులు విలాస వినోదములకుఁ గాని, విద్యా పరీక్షలకు గాని తావీయరాదని నా మనవి"

"ఈ విషయమునఁ గవిసార్వభౌములతోఁ గొంత యోజింతమా ?"

"అవశ్యము"

అంతలో ద్వారపాలకుడు ప్రవేశించి, శ్రీనాథుని రాక నెరుకపరచెను. మహామంత్రి "తత్క్షణమే ప్రవేశ పెట్టుమని సేవకున కాజ్ఞాపించెను. వెంటనే శ్రీనాథుడు లోన

ప్రవేశించెను. కాని యాతఁడొంటరిగా రాలేదు. ఆతనితో మరి యిరువురు పురుషులుకూడ నుండిరి. ఇరువురును యోధ వేషములలోనే యుండిరి. ఇరువురును ధనుస్తూణీరములను ధరించియుండిరి. ఇంతవరకే వీరి సామ్యము. మిగిలిన దంతయు భేదమే. వారిలో నొకఁడు నలుబది యేండ్లకు మించిన యీడు గలవాఁడు; మిక్కిలి స్ఫురద్రూపియుఁగాఁడు. కాని యాతని ముఖమున లోకజ్ఞాన ముట్టిపడుచుండెను. రెండవ యాతఁడు నిండు జవ్వనముచే తొణికిసలాడుచున్న మేని పసగలవాఁడు. మిసమిసలాడు నిండు జవ్వనంపు లావణ్యమాతని ప్రత్యంగమునను గోచరింపుచుండెను. ఆతని చూపులు చంచలములయ్యు నిశితములు. ఆతని ముఖము గభీరమయ్యు మనోహరము. ఆతని శరీర మంతయు నించుమించుగా, వస్త్రాచ్ఛాదితమై యుండెను. ఆతని గమనము మందమయ్యును సుస్థిరమై యుండెను. ఆతని ముఖమున ననితరసాధారణ ప్రజ్ఞా విశేషము గోచరించుచుండెను. సార్వభౌముఁడు కించుక దూరముగా వచ్చి నిలచిన వారిరువుర నొకమారు చూచి, రాయలు శ్రీనాథ కవిసార్వభౌముని వైపు దృష్టిమరల్చినాఁడు. అంతట రాయల యభిప్రాయము నెఱింగి కవిసార్వభౌము డీరీతిగా వారినిగూర్చి చెప్పినాఁడు.

"ఇందు మొదటివాఁడు భీములు. ప్రభువు లీతని నిదివరకు చూచియేయుందురు. నా బాల్యస్నేహితుఁడు. విలువిద్యయందును ఖడ్గచాలనమునందు నారితేరినవాఁడు. రెండవవాఁడు నా ప్రియ శిష్యుఁడు; సుప్రసిద్ధనటి మాచలదేవికి ప్రియ సోద

రుడు. ధనుర్విద్యయందఖండ ప్రజ్ఞావిశేషము గలవాడు. శస్త్రమునను శాస్త్రమునను ఆరితేరినవాడు. పేరు శక్తివర్మ. మహామంత్రుల యాజ్ఞానుసారము వీరిరువురను గొనివచ్చినాను. వీరు ప్రభువుల యాజ్ఞకు వేచియున్నారు."

అంతట రాయలు మహామంత్రివైపు సాభిప్రాయముగఁజూచెను. రాయల భావమును గ్రహించి మహామంత్రి యిట్లు పలికెను.

"ప్రభూ! కాలమానము బాగుగలేదు. రాజ్యమున, ముఖ్యముగ విద్యానగర పట్టణమున నరాజకము ప్రబలియున్నది. అంతశ్శత్రువులు విజృంభించుచున్నారు. వారి నరికట్టుటకై తగు ప్రయత్నములు చేయుచున్నాను. కాని డిండిమ భట్టారకుల యంతర్ధానము మరియు విపరీతముగానున్నది. వారి జాడ యింకను దెలియరాలేదు. మాచలదేవియు నట్లే యదృశ్యమైనది. విద్యానగర పట్టణముననే యత్యాచారములు చేయ సాహసించువారు సామాన్యులుగా నుండరు. మొన్న కవిసార్వభౌములు చూపినలేఖవలన ప్రతాపుని చరిత్రము సువ్యక్తమేకదా."

సార్వభౌముడు:- ఆ విషయముననే నేనింకను స్థిర నిశ్చయము నకురాలేకయున్నాను. మా యన్నదమ్ములలో వైరము పుట్టించుటకై శత్రువులు కల్పించిన కపట తంత్రమయ్యేది కాకూడదా! ప్రతాపుడు మహావీరుడనియు, నసాధారణ ప్రజ్ఞావంతుడనియు మన కందరకు తెలి

సిన విషయమేకదా! అట్టివానిని మన చేతనే చంపించుట, మన చేతితోడనే మన కన్నుపొడిచినట్లు, శత్రువులకు రక్తపాతములేని విజయముకదా! ఏమందురు.

మహామంత్రి:-- (కొంచెము యోజించి) సార్వభౌముల యభిప్రాయము సమంజసముగా లేదని నేను చెప్పజాలను. ప్రతాపరాయుని మాట యటుండనిండు. ఏమైనను, ఇప్పటి స్థితిగతులను బట్టి మనము జాగరూకులమై యుండుట మంచిది. నాకిప్పుడున్న సేవక వర్గముపై నమ్మకము తగా లేదు. ఎవ్వరిని నమ్మవలెనో, ఎవ్వరిని నమ్మరాదో కూడ చెప్పజాలను. అందును సార్వభౌమ రక్షణ విషయమున వారినుంచుట ప్రమాదకరమని యూహించి, యీ యిరువురను నియోగించినాను. వీరు ప్రభు సన్నిధానమున నహర్నిశము నుందురు.

సార్వభౌముడు:- సరే మీ యభిప్రాయాను సారమే కానిండు. కవిసార్వభౌములుకూడ నీ నిర్మాణక్రమములో భాగస్వాములే కదా! మా హితమునే సదా వాంఛించు మీ యభిప్రాయమును కాదనజాలను.

* * * *

రాయలు సభాస్థానమున గొలువు దీర్చియున్నాడు. సభాస్థారులందఱు రాయలవైపే దృష్టినిల్పి కిక్కురు బిక్కుమనకుండ నాసీనులైయున్నారు. రాయుల కించుక వెనుకగా గవిసార్వభౌములు పంపిన సేవకులు నిలచియున్నారు. వారు

ధనుస్తూణీరములను బట్టుకొని, మొల నాశీవిషసన్నిభంబులగు కరవాలములను ధరించియున్నారు. వారి నిశితవీక్షణములను జూచినచో వారతి జాగరూకులైయున్నారని తెలియగలదు.

అంతట నంశుమంతుండు ధనుస్తూణీరమండితుండు సభాస్థానముఁ బ్రవేశించి, సభ్యులను గలయఁజూచి, సార్వభౌమునకు నమస్కృతిగావించి, తన యస్త్రవిద్యా ప్రదర్శనము గావింపఁబూనినాడు. మొదట, నొక భిత్తికపై నొక బాణ మేసినాఁడు. తరువాత నా బాణపుచ్ఛము నానుకొను నట్లింకొక బాణము. దాని నానుకొను నట్లింకొక బాణము – ఇట్లు బాణ పరంపర నొక గొలుసువలె తయారు చేసనాఁడు

దూరమునఁగృత్రిమ మగుపక్షిని బెట్టినాడు. అంశుమంతుఁడు దాని నొకట్టమారే చూచినాఁడు. నారి ప్రమోగించిది. రివ్వు మని ధ్వనిచేయుచు నొక్క బాణము పోయినది ఆ పక్షి శిరస్సు నేలపైఁబొరలాడుచున్నది. కన్నులకుఁగంతలు కట్టుకొనినాఁడు. దూరమున నొక సన్నని దారమును ధ్వనిచేయింపుడని కోరి నాఁడు. రెండుమూడు మారులుంకించి యొక బాణమేసి నాఁడు చిత్రము. దారము రెండు ముక్కలైనది. ఇట్లెన్నియో లెక్కకు మిక్కిలియైన ప్రదర్శనములను గావించినాఁడు. సభ్యులందఱు నానంద దమగ్నులై యొడలు తెలియక యుండిరి. రాయలు మాటిమాటికి తలయూపుచు 'సెబాస్' 'భళీ' యనుచున్నాఁడు. అంతలో నొక బాణము ... యు వేగ మనోవేగములతో రివ్వున వచ్చుచున్నది. సభ్యులలో 'ప్రభూ! ప్రమాదము' అను ... కేకలు వినఁగినవి. రాయలు నిచ్చవాడి

చూచుచున్నాఁడు. కాని యాబాణము మధ్యేమార్గముననే రెండు ముక్కలైపోయినది. అంశుమంతుఁడు పట్టుపడినాఁడు. కవిసార్వభౌములు పంపిన యువకుని రాయలు, తన ప్రాణమునా విషమ సమయమునఁగాపాడినందులకు బహుధా ప్రశంసించినాఁడు అంశుమంతుఁడు మూఁగవాలె మఱిమాటాడ లేదు. భటులాతని నానాహింసల పాల్జేసినారు. ఆతఁడు మాత్రము తన నిజ వృత్తాంతమును జెప్పలేదు. నోటమాట రానీయలేదు. బందీయైనాఁడు.

19 ప్రకరణము

నాఁడాదివారము. ప్రతాపుఁడు క్రొత్తగాఁగట్టిన భవనము నృత్తగీత వాద్యములతో మాఱుమ్రోఁగుచున్నది. పరిచారకుల సందడి కంతమే లేదు. ఆ గృహప్రవేశ మహోత్సవమునకుఁబ్రతాపుఁడు విద్యానగర మొదలి ప్రముఖ్యులనే కాక, ఆ సామ్రాజ్యమునకు సంబంధించిన యున్నతోద్యోగుల నందఱి నాహ్వానించినాఁడు. ఒక్క వల్లభరాయఁడు తక్క మిగిలిన వారిందఱు నా యుత్సవము నాలోకింప నేతెంచిరి. ఆ యుత్సవము వారమురోజులు చేయుటకై నిశ్చయింపఁబడినది. ప్రత్యహము, పాట కచ్చేరీలు, వారాంగనా నృత్యములు, విందులు, వినోదములు నేర్పాటు గావింపఁబడినవి. దేశదేశములనుండి, సంగీత సాహిత్యములందుఁగీర్తిఁగాంచిన మహా విద్వాంసులేతెంచిరి. మహాకవులనేకులు, ప్రతాపరాయనిఁగీర్తించు ప్రబంధములనే రచించి తెచ్చిరి.

వచ్చిన వారందరకు తగిన విడుదు లేర్పాటు గావింపఁబడెను. ఈ మహోత్సవమున కంతకుఁ బెత్తనదారు వీరన దండనాథుఁడు. వీరన కాదినమున నూపిరియే తీయుటకు సమయములేదనిన నాశ్చర్యకరమగు విషయముకాదు. వచ్చిన మహాపురుషుల నుచితరీతిని గౌరవింపవలయును. పరిచారకులకుఁ బనులు చెప్పుచుండవలెను. పురప్రముఖులకుఁ గొందఱకుఁ బల్యంకాదులను బంపవలెను. వారాంగనల హావభావ విలాసముల నవలోకించి యానందింపవలెను. ఇట్లెన్నియో లెక్కకు మిక్కుటమైన పనులాతని నెత్తిపైఁబడినవి. ఒక్క వారాంగనల సదుపాయములు చూచుటకే ప్రతాపుఁడు తన్నేల నియమింపలేదని యాతఁడప్పుడప్పుడు కించపడుచుండిన మాట వాస్తవమే. కాని వెంటనే మరేదో ముఖ్యవిషయము జ్ఞప్తికి రాగా తల పంకించి యూరకొనుచుండువాఁడు.

ప్రతాపుని నూత్న భవనమును జూచిన వారందఱు నాశ్చర్య చకితులే యగుచుండిరి. అదియొక భవనమువలెగాక, యొక పెద్ద కోటవలెనుండెను. లోనఁబ్రవేశించిన వారికిఁ దామేత్రోవను బ్రవేశించిరో తెలిసికొనుటకూడఁగష్టమే. మొట్టమొదట నున్న విశాల ప్రాంగణముఁదప్ప, నందేయే కట్టడములున్నవో చూచిన వారెవ్వరును లేరు. తన్నిర్మాణక్రమ మంతయు బహు రహస్యముగ జరిగిపోయినది.

పగ లించుమించుగా జాము పొద్దెక్కినది. అతిథులొక్కరొక్కరే వరుసగా రాఁదొడంగిరి. వీరన దండ నాథులు వారినందఱి నెదుర్కొని, సగౌరవముగా, లోనికిఁగొంపోయి,

యర్హాసనములఁ నాసీనులఁగావింపుచుండిరి. ఒక్కొక్క యతిథి కిరువురు పరిచారికలు నియమింపఁబడిరి. వారు, చందన చర్చాదికమును గావించి, తాంబూలాదుల నొసంగి, వింజామరలు వీచుచు, నతిథులను గౌరవింపవలయును. అతిథులుగూడ నాతిథ్యముకంటె, అంగనాజన సౌందర్యమునే బహుధా కొనియాడుచు, నృత్తగీతములలో మునిగి తేలుచుండిరి. ఆ విందునకుఁ గవిసార్వభౌములును మహామంత్రులునుగూడ నాహ్వానింపఁబడిరి కాని వారెందు చేతనో, అప్పటికింకను రాలేదు. పుర ప్రముఖులు కొందఱు వారి యాగమన విషయమున నచ్చటి పరిచారకులను బ్రశ్నించుచుండిరి. త్వరలోనే వారును వత్తురని, తన్నడుగకుండగనే వీరసదండనాథుడు సమాధానమిచ్చుచుండెను. ప్రతాపుడు స్వయముగా, సార్వభౌము నాయుత్సవమును జూచుటకై పిలువ నేగెననియు, సార్వభౌముడు నచ్చటికిఁద్వరలోనే విచ్చేయుననియు, వీరన వచ్చిన వారికెల్లఁ జెప్పుచుండెను. తరువాత నొక్కొక్కరుగా నాయతిథులు లోనికిఁబంపఁబడుచుండిరి. వారు వెడలు త్రోవలోఁ జీకటికోణము వంటి యొక యిరుకు సందు గలదు. అందొకరి మొగ మొకరికిఁ గానరాదు. ఒక యతిథి యాకచీకటి కోణమునఁ గాలుపెట్టగనే, యిరువురు మనుజులు వానిపైఁబడి, నోట గుడ్డలుగ్రుక్కి, కాలుసేతులు బంధించి, యచ్చటనే యున్న కత్తుల బావిలోఁ బడవేయుచుండిరి. ఇట్లు హత్యాకాండ మచ్చట జరుగుచునే యుండెను.

అచ్చట ప్రతాపుఁడు రాయల నాహ్వానించుటకై పోయెను. ఆతని చేతిలోఁబండిన తమలపాకులతో నిండిన బంగరు పళ్లెరముండెను. అందు నిశితమగు బాకొకటి గుప్తమై యుండెను. రాయలా దినమున సభాభవనమునకు రాలేదు. అంతఃపురమునకును బోలేదు. ఒంటరిగాఁ దన యేకాంత సౌధముననే వసించియుండెను. కావలివారి నందఱి నతిక్రమించి, ప్రతాపుఁడు రాయల సన్నిధి కేగి, వినయ వినమిత మస్తకుఁడై, "ప్రభువులనుగ్రహించి నా నూత్న గృహమును బావనముసేయఁ బ్రార్థించుచున్నా ! నని మనవిచేసికొనెను. నిండు సభలోఁదన్నుఁజంపుటకై యంశుమంతుఁడు ప్రయత్నించుట యాదిగా, సార్వభౌముఁడు సర్వవిషయములందును జాగరూకుఁడైయుండెను. అదియునుగాక, ఆ దినమున నాయన కేలకో, శరీరమున నస్వస్థతగా నుండెను. ఈ రెండును గారణములుగా సార్వభౌముఁడు తానా దినమునఁ బ్రతాపుని యుత్సవమునఁబాల్గొన జాలనని చెప్పెను. ప్రతాపున కరికాలు మంట నెత్తికెక్కినది. కాని యుద్రేకము నడంచుకొని,

"ఈ యేడురోజులలో నెప్పుడైనఁ దమ యనుగ్రహము కలుగునా ?"

ప్రతాపుని కంఠ స్వరములో నేదోయపశ్రుతి సార్వభౌమునకు గోచరించినది. అది కఠోర కార్యకరణ దీక్షాదక్షమైయున్నది.

సార్వ:- రాజాలము. మేము కొలది దినముల వఱకు, నే యుత్సవములందును బాల్గొనఁజాలము. నగరమున గుట్రల నేకములు బయలుదేరుచున్నవి. ఆ కుట్రదారు లలో నొందఱు, విద్యానగర శ్రీనే అపహరింప యత్నములు చేయుచున్నట్లు, మాకొంబొడగట్టుచున్నది.

ప్రతా:- అట్లయిన నా కుట్ర దారులలో నేనొకడనని యందురా యేమి?

సార్వ:- (తీక్ష్ణముగా) ఏల కాకూడదు?

ప్రతాపుఁడిక తన యుద్రేకము నడంచుకొనలేక పోయినాఁడు. ఆతని సర్వావయవములును గోధోద్రేకమున వడవడ వణుకఁజొచ్చినవి. నయనగోళము లెఱ్ఱవడినవి. "ఆ" యని యొక్క కేక వైచి, తమలపాకులలోని బాకుఁదీసి, సార్వభౌమునిపైకి దుముకఁబోయినాఁడు. సార్వభౌముండిట్లగు నని కలలోఁగూడఁదలంపలేదు. హఠాత్సంభవమగు నీ యాప దంగాంచి రాయలు నిశ్చేష్టుఁడై వెనుక కొదిగినాఁడు. కాని ప్రతాపుని బాహువెత్తినది యెత్తినయట్లుండఁగనే, వాఁడి యమ్ములకటి రివ్వునవచ్చి యద్దానిని ఖండించివైచెను. హాహాకా రముఁజేయుచుఁబ్రతాపుఁడు నేలఁగూలినాఁడు. ఇచ్చఁజెప్పిన విషయమంతయు నరనిమేషములో జరిగిపోయినది. ప్రతాపుని హాహాకారము నాకర్ణించి, చుట్టునున్న పరిచారకు లందఱుఁ జుట్టుముట్టినారు. రాయలట్లే రిచ్చవడి చూచుచుండెను.

ప్రతాపుని నూత్న భవనమునఁ గోలాహలము బయలు దేఱినది. ఒక వేయిమంది యాశ్వికులొక్కమారే యా భవనమునుజొచ్చి, యచ్చటి పరిచారకులఁ గావలి వాండ్రనందఱ బంధించిరి. పాపము! వీరనగారుకూడ బాధింపఁబడిరి. అంతలో వల్లభ రాయఁడును, గవి సార్వభౌములును, మహామంత్రియు నచ్చటికివచ్చిరి. కాని యేమున్నది? అప్పటికే యొక నూరుమంది యతిథులు నిష్కారణముగ సంహరింపఁ బడిరి. వారందఱును రాయలకుఁబరమాప్తులు. వారిలో రాజ బంధువులుకూడ కొందఱు కలరు. కత్తుల వాఁతవంకఁ జూచి మహామంత్రి సంభ్ర మాశ్చర్య విషాదములకులోనై నాఁడు. కాని యంతలోనే యాతని బుద్ధి సార్వభౌముని వంకకుఁబోయినది.

మహా:- కవి సార్వభౌమా! ప్రతి పుడు సార్వభౌము నాహ్వానింపనేగినాడఁట. అచ్చట నేమి ప్రమాదము వాటిల్లునో. త్వరగా మన మచ్చటికి పోవలయును.

కవిసార్వ:- శాపగ్రస్తుఁడు; పాపము! పోకుండ నుండఁ గలఁడా. మంత్రిశేఖరా! చక్రవర్తి కేమియును భయము లేదు. ఆతని శరీరమును గాపాడ వజ్రకవచమునుంచి నాను.

20 ప్రకరణము

ఆనాఁడు విద్యానగరము సముద్రమువలె ఘూర్ణిల్లు చున్నది. అప్పటికింకను గారెడు ప్రొద్దైన నెక్కలేదు. కాని నగరమున నెక్కడఁజూచిన జనము తండోప తండములుగ గాన వచ్చుచుండిరి. అందఱు నొక్కవైపునకే పోవుచుండిరి. అందరి నోట నొక్క మాటే వినవచ్చుచుండెను. ప్రతాపుడు సార్వభౌమునిపై కుట్రపన్ని యాతని ప్రాణములనే యపహరింప యత్నించినాడఁట. దైవమువలె నెవ్వడో అంగ రక్షకుఁడు ప్రతాపుని సంహరించి, సార్వభౌముని గాపాడినాడఁట. 'ఆ యంగ రక్షకుఁడెవ్వరో చూడవలెను.' ఈ మాటలే ప్రతిమనుజుని నోరి వెంబడి విన వచ్చుచుండెను.

పగ లించుమించుగా ఝాము ప్రొద్దెక్కినది. ముత్యాల శాలయంతయుఁగిటకిటలాడిపోవుచున్నది. మంత్రి సామంత దండనాథాదులు యథాయోగ్యములగు నాసనముల నలంకరించియున్నారు. పరిచారకు లిటునటుఁదిరుగుచు జనకోలాహలము నడంచుటకు యత్నింపుచున్నారు. అట్టిసమయమున ఘంటానాదము వినవచ్చినది. సార్వభౌముని రాకకై, సభ్యులందఱు నుత్సుకులైయున్నారు. అంతటఁ గవిసార్వభౌములును మహామంత్రులును ముందేతెంచి యాసనముల నుపవిష్టులైరి. అంతట జయజయ నాదములతో సార్వభౌముఁడేతెంచి, సింహాపీఠి నలంకరించెను. సార్వభౌముని మోము జేవురించియున్నది. కన్నుల నగ్నిస్ఫులింగములు గురియుచున్నవి. కవిసార్వభౌ

ముల మోము ప్రసన్న గంభీరమైయున్నది. మహామంత్రి
కన్నులలోఁ గాంచెము తీక్ష్ణత గోచరించుచున్నది. సార్వభౌ
ముని మోమెత్తిచూచుటకుఁగూడ నందఱు జడిసిపోవుచుండిరి.
సభయంతయు నిశ్శబ్దముగానున్నది. ఉచ్ఛ్వాస నిశ్వాసములు
కూడ గట్టిగా వినవచ్చుట లేదు.

అంత వేత్రహస్తులు, కుట్రలో పాల్గొన్న వారి నొక్కొ-
క్కొకరుగాఁ గొనివచ్చుచుండిరి. వారిని జూచినంతనే సభ్యుల
యాశ్చర్యమునకు మేర లేదు. వారందఱకును సుపరిచితులే,
సామ్రాజ్యమున నున్నత పదవుల నధిష్ఠించి యున్నవారే.
ప్రతి దినము నించుమించుగా, మహారాజ సందర్శనము గావిం
చువారే, కొందఱు సామాన్యులుకూడ కలరు. కాని వారి
సంఖ్య యత్యల్పము. వీరనదండనాథులుగూడ నా బందీలలో
నొకరు. పాపము వారి ముఖము వాడియున్నది. కన్నులు
తేజోహీనములైనవి. కొన్ని యస్పష్టవాక్యములను గొణుగు
కొనుచు నాతఁడు, సభాస్థలి ప్రవేశించినాఁడు. అంతట మహా
మంత్రులు లేచి "సభ్యులారా! పుర ప్రముఖులారా! ఎన్నడు
కని విని యెఱుఁగని ఘోర కార్యము జరిగిపోయినది. ఇంతటి
ఘోర కార్యమును సేయ సామ్రాజ్యమునందలి యున్న
తోద్యోగులే సంకల్పింతురని నేనెన్నడు ననుకొనలేదు. ఇది
నిజముగా విషాదకరమగు విషయము. లజ్జాకరముగూడ, ఈ
మహా సామ్రాజ్య స్థాపనమైనది మొదలిట్టి ఘోర కృత్యములు
దలపెట్టినవారు లేరు. సార్వభౌముఁడన్న నందఱును బూజించు
వారే; బూషించువారే; దూషించువారుగాని, తూలనాడు

వారుగాని లేరు. అట్టియెడ నిట్టి యవాచ్యహాత్యాకాండము జఱిగిపోయినది. సార్వభౌమునకును, సామ్రాజ్య మందలి సర్వప్రజలకు నిట్టి మహాపచారము గావించిన యీ ద్రోహుల కెట్టి శిక్ష విధింపవలయునో మీరే నిర్ణయింతురుగాక !" అని పలికి తన యాసనముపై నాసీనుఁడాయెను.

"ఈ ద్రోహులను జీల్చివేయుఁడు, కాల్చివేయుఁడు" అను కేకలు ముత్యాల శాలయంతటఁ బ్రతిధ్వనించెను. కుట్రలోఁ బ్రతాపునకుఁ గుడిచేయిగాఁ బనిచేసినవాఁడు వీరనయనియుఁ దెలిసిపోయెను. మొదట వీరన మౌనము వహించెను. కాని, నాలుగు ప్రహారములతో నాతనికి మూగరోగము వదలి పోయినది. అతఁడు సర్వము నెఱింగించి, నగరోపాంతారణ్య మధ్యస్థ కారాగారమునుగూర్చియు నందు బంధితులయియున్న సర్వమంగళా డిండిమ భట్టారకులగూర్చియుఁ దెల్పెను. తరు వాత నా కుట్రలోఁ బాల్గొన్న వారికందఱకు నుచిత దండ నము విధింపఁబడెను. వీరనకు శిరచ్ఛేదమే నిర్ణయింపఁబడెను.

అనంతరము క్రమక్రమముగా సార్వభౌముని ముఖము ప్రసన్న భావమును వహించెను. అతఁడొకమారు సగౌరవ ముగఁ గవిసార్వభౌమునివైపు చూచెను.

సార్వ:- కవిసార్వభౌమా ! నీవు కేవల కవి మాత్రుఁడవు కావు. నన్నుద్ధరింపవచ్చిన సాక్షాద్విరూపాక్షుఁడవే. నీ సాహాయ్యమే లేనిచో, నేనీపాటికి, ఊర్ధ్వలోక ద్వార మును దట్టుచుండెడివాఁడనే. నీవు నా కంగరక్షకుఁ

డుగా నొసంగిన శక్తివర్మ, తన నిరుపమాన ధను
ర్విద్యా కౌశలముచే, రెండుసార్లు ప్రాణాపాయము
నుండి కాపాడినాఁడు. ఆతని మేలు నేను మరువఁ
జాలను. నా కృతజ్ఞతను దెలుపుటకై యాతని కైదగ్ర
హారముల నీయ సంకల్పించుకొంటిని. నాయనా !
శక్తివర్మా !

శక్తివర్మ సార్వభౌముని మ్రోల నిలచియున్నాఁడు.

సార్వ:- వర్మా ! నీకుఁగావలసిన యగ్రహారముల నస్మద్రా
జ్యమునుండి యేరికొనుము.

శక్తివర్మ:- ప్రభూ ! క్షమింపుము. నాకేల యీ యగ్రహార
ములు ? నా విధ్యుక్తధర్మమును మాత్రమే నేను
నిర్వహించినాను. అంత మాత్రమునకే బహు
మానమా ?

సార్వ:- అట్లుకాదు. విధ్యుక్తధర్మమును నిర్వహించుట
మాత్రము సామాన్యమా ? సోదరుఁడన్న ప్రాణములు
దీయ సమకట్టుకాలమున ధర్మ నిర్వహణ తత్పరత్వము
బహుమానార్హము కాదా ? నీవు తప్పక మా బహు
మాన మంగీకరింపవలయును. నీ యిచ్చ వచ్చిన వారికి
నీవు వాని నొసంగుము. మా కభ్యంతరము లేదు.

శక్తివర్మ:- ప్రభు చిత్తము.

* * *

విద్యానగరమున గల పేదలకుఁగనకాభిషేకము జరుగుచున్నది. జనులు తండోపతండములుగ విరూపాక్షుని యాలయము కడఁజేరుచున్నారు. కుంటివారు; గ్రుడ్డివారు మూగవారు; చెవిటివారు; దారిద్ర్య పీడితులు, దైవోపహతులు, బహుకుటుంబులు; బంధు విరహితులు; బ్రాహ్మణ యాచకులు; పండితులు; పామరులు, బాలుక వృద్ధులు; వేయేల సర్వవర్ణములవారు, సర్వ విధములవారు నానాముఖ విరూపాక్షాలయమునకే తెంచిరి. ఎందులకు? ఆనాఁడు విద్యానగరమునఁజాటింపఁబడెను "విరూపాక్షాలయమున దానధర్మాదికము గావింపఁబడును గాన, సందఱు రావలె"నని. కాని యావచ్చిన వారందఱు నాశ్చర్య చకితులైరి. ఆ దానధర్మముల గావించు వ్యక్తి యొక మహారాజు కాదు; ఒక ధనవంతుఁడునుగాఁడు. కేవలమొక సన్న్యాసిని.

అంతఃపురాంగనలకులేని యతిలోక సామాన్య సౌందర్యమామెకుఁగలదు. ఆమె యొలజవ్వనంపు సొంపులన్నియుఁ గాషాయాంబరముచేఁ బ్రచ్ఛన్నములై యున్నవి. ఆమె జడలను ధరించి, మెడలో రుద్రాక్షలను ధరించియున్నది. నొసట విభూతి రేఖలు గలవు. నివురుగప్పిన నిప్పువలె, ధూళి ధూసరితమైన, మల్లికా కుసుమదామము వడువున, శైవాలచ్ఛన్నమైన పద్మినీలత వోలె, నిస్తేజయై. గన్పట్టు నామెను గాంచి, జనులందఱు కన్నుల నీరు పెట్టిరి. ఎవ్వరెంత కోరిన నంత, ఎవ్వరేది కోరిన నది. యొసంగఁబడుచుండెను. అడుగనివారిదే పాపము.

ఇంతలో నిరువురు మహాపురుషులచ్చటి కేతెంచిరి. వారి వెనుక నొక సర్వాంగ సుందరియు నేతెంచుచుండెను. దూరమునుండియే; యామెను యుద్రేకము నడంచు కొనం జాలక, "సోదరీ! మాచలా!" అని రోదనము చేయుచు నా సన్న్యాసినిని కౌగిలించుకొనెను. ఆమెయు, నశ్రుగాద్గద్య ముతో, "సర్వమంగళా! కుశలమేకదా" అని యూరకొనెను. కొంతసేపు వారట్లే యొండొరుల కౌగిళ్లలో నుండిపోయిరి. తరువాత మాచల కన్నులువిప్పి యెట్టయెదుట నిలచియున్న కవిసార్వభౌములను వారి వెనుకనేయున్న డిండిమ భట్టారకులను గాంచి, ససంభ్రమముగ నమస్కరించెను. కవిసార్వభౌముల కన్నుల వెంబడి కన్నీరు మున్నీరుగ బ్రవహించుచుండెను. డిండిమ భట్టారకులు పొంగిపొరలివచ్చు దుఃఖమును లోలోననే దిగమ్రింగుచు

"బిడ్డా! యేమిది?" అని మాత్రము ప్రశ్నించిరి. ఆమె అశ్రుగద్గదికమైన కంఠముతో

"దేవా! నాకీ ధనముతో నింకేమిపని? ఈ సౌందర్యముతో నింకేమి ప్రయోజనము? నా హృదయమే బ్రద్దలైపోయినది. నేనెవ్వరిని నా హృదయ పూర్వకముగ, నా హృదయాధి నాథునిగ, నా ప్రేమ సర్వస్వముగ, నా ప్రత్యక్షదైవముగ, ప్రేమించితినో, ఆతనినే నాచేతులార వధించితిని. ఇంక నాకీ జీవితముతోగాని, ధనముతోగాని, విద్యా వినోదములతోగాని యేమి ప్రయోజనము? జీవిత సర్వస్వమునే ధ్వంసము చేసికొన్న నేనేల జీవింప వలయును" అని

చెప్పి వల వల యేడ్వ దొడంగెను. ఆమె ప్రక్కనే నిలచి యున్న మందారవల్లియు బోరున నేడ్వ దొడంగెను.

డిండిమ:- బిడ్డా! నీ హృదయావేదనము నాకుఁదెలియును. బహుజన క్షేమమునుగోరి, దేశ సౌభాగ్యమును గాంక్షించి, నీవొనర్చిన త్యాగము సర్వజన శ్లాఘ్యమైనది. కాని ఇప్పట్టున నిన్నూరార్చుటకుఁగూడ నాకు నోరాడకున్నది. ప్రళయాగ్నిజ్వాలచే దహించుకొనిపోవు నీ హృదయమున కెట్లు శాంతిని సమకూర్పనగునో తెలియుటలేదు.


కొంతసేపటి కామెయే యుపశాంతి నందినది. కవి సార్వభౌముల పాదములపైఁ వ్రాలి

"గురుదేవా! తమ యాజ్ఞను సర్వధా నిర్వర్తించితిని: నేనింక నీ పరిదేశమున నుండజాలను. వారాణసి పోయి శ్రీ విశ్వేశ్వర సాన్నిధ్యమున నా జీవయాత్ర గడపెదను. నాకుఁ జేదోడు వాదోడుగ మందారవల్లి యుండును. తమ యనుజ్ఞ కొఱకెదురు చూచుచున్నాను.

కవి సార్వభౌములు మారు పలుకలేదు. ఆతని కన్నుల వెంబడి నశ్రువులు, నిరంతర ధారగా వచ్చుచున్నవి. అధరోష్ఠము గూడ నించుక చలించుచున్నది. "బిడ్డా! నీ జీవితము నే

ధ్వంసముగావించిన మహాపాపిని ; క్షమింపుము ; త్వరలోనే నేనును వారాణసికి వచ్చెదను.'' అను వాక్యము లస్పష్టముగ నాతని నోటి వెంబడి వచ్చినవి.

క్రమక్రమముగ సూర్య భగవానుఁడపరాద్రిని గ్రుంకినాఁడు. సాంధ్యరాగము దశదిశల నాక్రమించినది. పక్షులన్ని యుఁబారులుగట్టి తమతమ గూండ్ల కేతెంచుచున్నవి. ప్రకృతి యంతయు ప్రశాంత పావనమై, యొప్పుచుండెను. విద్యానగరమున విరూపాక్షాలయమున నిరువురు సన్న్యాసినులు, స్వామి మోలనిలచి, ధ్యానశ్లోకములఁజదువు చుండిరి.



విజయ ప్రెస్, చీరాల.